



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★



జనన, మరణ రికార్డులతో ఓటర్ల జాబితా
పహల్గామ్ మృతులకు అమరవీరుల హోదా ఇవ్వండి
సైనికుల స్థైర్యాన్ని దెబ్బతీస్తారా?
'నీట్'పై అసత్య ప్రచారం
లోపలి పేజీల్లో



సంపుటి 08, సంచిక: 152 | శుక్రవారం | 02-05-2025 | ఖమ్మం Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00




## శ్రామికవర్గాన్ని రక్షించేది

# ఎర్ర జెండానే

- ప్రపంచ వ్యాప్తంగా జరుపుకునే ఏకైక పండుగ 'మేడే'
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్

సామ్రాజ్యవాద శక్తుల చేతిలో మగ్గుతున్న శ్రామికవర్గాన్ని రక్షించేది ఎర్ర జెండా మాత్రమేనని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. 139వ మేడే స్ఫూర్తితో ప్రజాస్వామ్య రక్షణ, కార్మిక హక్కులు, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం కమ్యూనిస్టు పార్టీ నిర్వహించే పోరాటాల్లో ప్రజలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలోని కార్మిక క్షేత్రాలు, కార్మిక వాడలు, ఉద్యోగ క్షేత్రాలు, బస్తీలు, గ్రామాల్లో ఎర్రజెండా రెపరెపలాడింది. సిపిఐ, అనుబంధ ప్రజాసంఘాలు, ఎఐటియుసి అనుబంధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గురువారం నియోజకవర్గ వ్యాప్తంగా 283 కేంద్రాల్లో మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయాలు, విద్యానగర్ బైపాస్ రోడ్డు, గ్రామపంచాయతీ కార్యాలయం, ఆటో, హమాలీ, సింగరేణి ప్రధాన కార్యాలయం, రైతుబజార్, భవన నిర్మాణ కార్మికుల అడ్డా తదితర ప్రధాన సెంటర్లలో కూనంనేని మేడే జెండాను ఆవిష్కరించారు. చికాగో అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభల్లో కూనంనేని మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా జరుపుకునే ఏకైక పండుగ మేడే అని అన్నారు. 1886లో అమెరికాలోని చికాగో నగరంలో ఎనిమిది గంటల పనివిధానం కోసం జరిగిన సమ్మె సందర్భంగా పాలకులు, యాజమాన్యం జరిపిన కాల్పుల్లో మరణించిన కార్మికుల రక్తంతో తడిసిందే ఈ ఎర్రజెండాఅని పేర్కొన్నారు. వారి తరువాయి 2లో

## ఆర్‌టిసి కార్మికుల్లారా...

# సమ్మెలోకి వెళ్లకండి



'శ్రామికుల శ్రమశక్తి, చమట చుక్కలే ప్రపంచ అభివృద్ధికి బాటలు వేశాయి. వారి త్యాగాలు మరవలేనివి. గత 139 ఏళ్ల క్రితం చికాగోలో ప్రపంచ కార్మికులరా ఏకంకండి.... పోరాడితే పోయేది ఏమి లేదు.... బానిస సంకెళ్ళు తప్ప.... అన్న కారల్ మార్క్స్ పిలుపుతో మొదలైన కార్మికోద్యమం ప్రపంచ వ్యాప్తంగా కార్మికులను ఏకం చేసింది.
– ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

- సింగరేణి, ఆర్‌టిసి, విద్యుత్, అసంఘటిత కార్మికుల సంక్షేమమే ధ్యేయం
- రాష్ట్ర ఏర్పాటులో వారిపాత్ర మరువలేనిది
- త్యాగాలతో సాధించుకున్న తెలంగాణను గడచిన పదేళ్ళలో ఓ కుటుంబం విధ్వంసం చేసింది
- మేడే ఉత్సవాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్ఘాటన
- కార్మికులకు అవార్డుల అందజేత

ప్రజాపక్షం/హైదరాబాద్

"ఆర్‌టిసి కార్మికులారా సమ్మె ఆలోచన వీడండి. ఇప్పుడిప్పుడే సంస్థ లాభాల బాట పట్టింది. ఇది మీ సంస్థ... దీన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మీదే. పంతాలు, పట్టింపులకు పోవద్దు. సమస్యలుంటే మంత్రితో చర్చించాలి. ఆర్‌టిసికి వస్తున్న ఆదాయం మీ కోసం ఖర్చు చేస్తాం. అది ఎలా చేయాలో మీరే చెప్పండి. ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదు. సమ్మెపై మరోసారి ఆలోచన చేయండి. మాయ ఉచ్చులో పడొద్దు." అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. గురువారం రవీంద్ర భారతిలో కార్మిక శాఖ ఆధ్వర్యంలో మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కనీస వేతనాల బోర్డు ఛైర్మన్ బి.జనక్ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ ఉత్సవాలకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథులు విచ్చేశారు. మంత్రులు తరువాయి 2లో



## హక్కులు కాలరాస్తే

# కార్మికలోకం ఊరుకోదు

కేంద్రాన్ని హెచ్చరించిన చాడ వెంకట్‌రెడ్డి

ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి

పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను బిజెపి కాలరాస్తే కార్మిక లోకం చూస్తూ ఊరుకోదని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. 139వ మేడే దినోత్సవం సందర్భంగా గురువారం కరీంనగర్‌లో ఎఐటియుసి ఆధ్వర్యంలో రైల్వే హమాలీ సంఘం ఏర్పాటు చేసిన ఎఐటియుసి పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం రైల్వే గేట్ నుంచి సుభాష్‌నగర్, మంచిర్యాల చౌరస్తా, గాంధీ రోడ్, రాజీవ్ చౌక్, టవర్ సర్కిల్, కూరగాయల మార్కెట్, కమాన్ చౌరస్తా నుంచి బద్దం ఎల్లారెడ్డి భవన్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. బైక్ ర్యాలీలో చాడ వెంకట్‌రెడ్డి బైక్ నడుపుతూ కార్మికులను ఉత్సాహపరిచారు. కూరగాయల మార్కెట్ వద్ద గల ఉల్లిగడ్డల హమాలీ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జెండాను చాడ ఆవిష్కరించారు. బద్దం ఎల్లారెడ్డి భవన్ వద్ద ఏర్పాటు చేసిన పతాకాన్ని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సమ్మయ్య ఆవిష్కరించారు. సిమెంట్ గోదాం, ఫర్టిలైజర్ హమాలీ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జెండాను ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్ ఆవిష్కరించారు. అనంతరం జరిగిన మేడే బహిరంగ సభకు ఏఐటియుసి జిల్లా అధ్యక్షుడు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వెంకట్‌రెడ్డి మాట్లాడారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ కార్మిక హక్కులను హరించడానికి కుటిల ప్రయత్నం చేస్తోందని, కార్మిక సంస్కరణల పేరుతో భారత రాజ్యాంగ నిర్మాత డా.బిఆర్ అంబేద్కర్ కల్పించిన తరువాయి 2లో

## కేంద్ర మంత్రులతో

# కమిటీ నియమించాలి

- దేశవ్యాప్తంగా కులగణన చేపట్టేముందు రాజకీయ పార్టీలు, ఆయా రాష్ట్రాలు, పౌర సంఘాలతో చర్చించాలి
- ఉన్నతస్థాయి అధికారులతో కూడిన నిపుణుల కమిటీని ఏర్పాటు చేసి అధ్యయనం చేయాలి
- జనగణన ప్రక్రియ పూర్తిచేసేందుకు ఏడాది సరిపోతుంది
- కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టీకరణ




ప్రజాపక్షం/హైదరాబాద్

జనగణనలో కులగణన చేపట్టే విషయంలో కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని మోడల్‌గా తీసుకోవాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సూచించారు. దేశవ్యాప్తంగా కులగణన చేపట్టబోయే ముందు రాజకీయ పార్టీలు, ఆయా రాష్ట్రాలు, పౌర సంఘాలతో చర్చించేందుకు కేంద్ర మంత్రులతో తరువాయి 2లో

# ప్రతిపక్షాల ఉద్యమం వల్లే...

- కేంద్ర ప్రభుత్వం కులగణన ప్రకటన
- జనగణన సేకరణకు, వ్యవస్థాగతమైన సంస్కరణలకు కాల పరిమితి విధించాలి
- గడువులోపే గణాంకాలు పూర్తిచేయాలి : డి.రాజా



**న్యూఢిల్లీ:** దేశంలో ప్రతిపక్షాలు చేసిన స్థిరమైన రాజకీయ ఉద్యమం ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం కులగణన ప్రకటన చేసిందని భారత కమ్యూనిస్టుపార్టీ (సిపిఐ) ప్రధాన కార్యదర్శి డి.రాజా పేర్కొన్నారు. జనాభా గణాంకాల సేకరణకు, వ్యవస్థాగతమైన సంస్కరణలకు ప్రభుత్వం తప్పనిసరిగా ఒక ఖచ్చితమైన కాలపరిమితిని విధించి ఆ గడువు లోపే గణాంకాల సేకరణ పూర్తిచేయాలని గురువారంనాడు విడుదల చేసిన ఒక ప్రకటనలో డి.రాజా డిమాండ్ చేశారు. రాజకీయ సంకల్పం, చిత్తశుద్ధి, నిష్కపటంతో కులగణనపై చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఇప్పుడు మోదీ ప్రభుత్వంపైనే ఉందనీ, సామాజిక న్యాయం కోసం, ప్రజాస్వామ్య గణాంకాల వ్యవస్థకోసం, సమాన ప్రాతినిధ్యంకోసం భారత కమ్యూనిస్టుపార్టీ తన పోరాటాలను ఉద్ధృతం చేసి ముందుకు తీసుకువెళ్ళడాన్ని కొనసాగిస్తుందని డి.రాజా పేర్కొన్నారు. "దేశంలో కుల ప్రాతిపదికపై జనాభా లెక్కల సేకరణ చేపట్టాలన్న దీర్ఘకాలిక డిమాండ్‌కు కట్టుబడి అగ్రభాగాన నిలబడి పోరాడుతున్న భారతకమ్యూనిస్టుపార్టీ, ఇతర ప్రతిపక్ష శక్తుల కృషి ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం కులగణన ప్రకటన చేసిందని సిపిఐ భావిస్తున్నది. ప్రభుత్వం తీసుకున్న ఈ చర్య, దేశంలో రోజురోజుకూ ప్రజలనుండి పెరగుతున్న ఒత్తిడి, ప్రగతిశీలరాజకీయపార్టీల తరువాయి 2లో

## 5వ తేదీ నుంచి 28 మండలాల్లో

# భూభారతి చట్టం అమలు

- నాలుగు పైలట్ మండలాల్లోని 72 రెవెన్యూ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు పూర్తి
- 555 మండలాల్లో అవగాహన సదస్సులు పూర్తి
- భూ సమస్యలపై 11, 630 దరఖాస్తుల స్వీకరణ
- మార్పునకు నాంది 'భూ భారతి' : మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్



" భూభారతిని విస్తృత స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళుతున్నాం. భూ భారతికి అనూహ్య స్పందన వస్తోంది. నాలుగు పైలట్ మండలాల్లోని 72 రెవెన్యూ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు పూర్తి చేశాం. మొత్తం 555 మండలాల్లో అవగాహన సదస్సులు పూర్తి చేశాం. భూ సమస్యలపై 11,630 దరఖాస్తులు వచ్చాయి. ఈ నెల 5వ తేదీ నుంచి జిల్లాకు ఒక మండలం చొప్పున 28 మండలాలలో భూ భారతి చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని నిర్ణయించాం. 20 జిల్లాల్లో 45 సదస్సుల్లో స్వయంగా నేను పాల్గొన్నాను. మార్పునకు నాంది భూ భారతి" అని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. రెవెన్యూ శాఖ తరువాయి 12లో

## ఉద్రిక్తతలు వద్దు

# వెనక్కు తగ్గండి

భారత్–పాకిస్థాన్‌లకు అమెరికా విజ్ఞప్తి



**వాషింగ్టన్ :** నియంత్రణ రేఖవద్ద ఉద్రిక్తతలకు పాల్పడవద్దని భారత్–పాకిస్థాన్ దేశాలకు అమెరికా ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. పహల్గామ్‌లో ఉగ్రవాదుల కాల్పుల దాడి తర్వాత భారత్ చర్యలు, అందుకు ధీటుగా పాకిస్థాన్ ప్రభుత్వం ప్రతీకార చర్యలకు, సరిహద్దుల్లో కాల్పుల కవ్వింపులకు పాల్పడుతూ ఉండటంతో సంయమనం పాటించాలని, ఉద్రిక్తతలు తగ్గించుకోవాలని అమెరికా ప్రభుత్వం కోరింది. గడచిన వారం రోజులుగా పాకిస్థాన్ సరిహద్దుల్లో కాల్పులకు తెగబడుతూ భారత్ సైన్యాన్ని కవ్విస్తున్నది. అమెరికా విదేశాంగమంత్రి మార్కో రుబియో టెలిఫోన్ ద్వారా పాకిస్థాన్ విదేశాంగమంత్రితో మంతనాలు జరిపారు. ఉద్రిక్తతలకు దూరంగా ఉండాలని, రెచ్చగొట్టే చర్యలకు పాల్పడవద్దని కోరారు. ఏప్రిల్ 22వ తేదీన పహల్గామ్ సమీపంలో పర్యాటకులపై కాల్పులు జరిపి 26 మందిని చంపిన ఘటనలో పాకిస్థాన్ తరువాయి 2లో



## పాలమూరు ప్రాజెక్టులను


# వేగిరపరుస్తాం

- అత్యంత ప్రాధాన్యతగా గుర్తించి పూర్తిచేస్తాం
- క్షేత్రస్థాయిలో పనులు పరిశీలించిన మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి

ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రాజెక్టులను అత్యంత ప్రాధాన్యతగా గుర్తించి పూర్తిచేస్తామని రాష్ట్ర నీటిపారుదలశాఖమంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పర్యాటకశాఖమంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులో ప్రధానభాగమైన నార్లాపూర్ రిజర్వాయర్ ప్రాజెక్టు పంపుహౌస్, ప్యాకేజి–2 ఓపెన్‌కెనాల్, మహాత్మాగాంధీ కల్వకుర్తి లిఫ్టు ఇరిగేషన్ స్కీమ్ లిఫ్టు–1, వనపర్తి జిల్లా రేవల్లి మండలం ఏదుల రిజర్వాయర్, స్టేజ్–2 కోడేరు మండలం తీగలపల్లి గ్రామంలో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పంపుహౌస్, సొరంగం, కాల్వ నిర్మాణ పనులను మంత్రులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనులు జరుగుతున్న తీరుపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ఇరిగేషన్ ప్రాజెక్టులన్నింటిని వేగవంతంగా చేయడానికి, సమస్యల పరిష్కారం అవాంతరాలను తరువాయి 2లో



# ప్రపంచం
WORLD NEWS


## ఢాకాలో కార్మికుల మే డే ర్యాలీ

**ఢాకా :** బంగ్లాదేశ్‌లో గురువారంనాడు మే డే సందర్భంగా వేలాదిమంది కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. రాజధాని ఢాకాలోని నయాపల్టన్ వద్ద ర్యాలీ చేశారు. వేతనాలు పెంచాలని, హక్కులు కాపాడాలని, ధరలకు అనుగుణంగా వేతనాలు ఉండాలని కోరారు. 12 డిమాండ్లు పరిష్కరించాలని తాత్కాలిక ప్రభుత్వాన్ని కోరారు. జతియతబది శ్రామిక దళ్ సంస్థ ''వర్కర్స్ ర్యాలీ'' పేరుతో ఈ మహాప్రదర్శన నిర్వహించింది. మధ్యాహ్నం 2.10 గంటలకు హోలీ ఖురాన్ పఠనం ద్వారా ఈ ర్యాలీ ప్రారంభమైంది.



జతియతబది శ్రామిక దళ్ సంస్థ అధ్యక్షుడు అన్వర్ హుస్సేన్ ఈ ర్యాలీకి నాయకత్వం వహించారు.

# అమెరికా-ఉక్రేన్ మధ్య ఖనిజవనరుల ఒప్పందం




### ప్రపంచ అవసరాలన్నీ ఇక ఉక్రేన్ ఎగుమతులతోనే...?

**వాషింగ్టన్ :** అమెరికా–ఉక్రేన్ మధ్య కీలకమైన ఖనిజ వనరుల ఒప్పందం కుదిరింది! ప్రపంచంలో అత్యంత అరుదైన కీలకమైన ముడిఖనిజ వనరులు ఐదూశాతం మేరకు తమదేశంలోనే ఉన్నాయని ఉక్రేన్ అంచనావేసింది. కొత్తతరం ఎలక్ట్రానిక్ వాహనాల తయారీకి అవసరమైన కీలక ముడిపదార్థాలన్నీ ఉక్రేన్ భూగర్భంలోనే ఉన్నాయి. అందువల్ల ప్రపంచదేశాలకు సరఫరా అయ్యే కొత్త తరం వాహనాలకు, వాటి తయారీ కంపెనీలకు ఉక్రేన్ దేశమే పెద్ద దిక్కుగా మారనున్నది. దీంతో ఉక్రేన్ సంపన్న దేశంగా ఎదగనున్నది. ఈ ఒప్పందం కోసం అమెరికా ఎంతోకాలంగా ఎదురుచూస్తున్నది.వీటితోపాటు అల్యూమినియం, సహజవాయువు, గ్రాఫైట్‌లు అత్యధికంగా తవ్వితీస్తారు. సరిగ్గా రెండు నెలలక్రితం జెలెన్‌స్కీ అమెరికా పర్యటన చేసినప్పుడు ఈ ఒప్పందం జరగాల్సి ఉండగా ట్రంప్–జెలెన్‌స్కీమధ్య ''అరుపులాట'' కారణంగాఆయన ఒప్పందంపై సంతకం చేయకుండా మధ్యలోనే బయటకు వచ్చేశారు. ఇప్పుడు రెండు నెలల తర్వాత అటూఇటూగా అదే సమయంలో మళ్ళీ ఈ ఒప్పందంపై సంతకాలు జరిగాయి.50:50 లాభాల ప్రాతిపదికపై ఈ ఒప్పందం కుదిరింది. దీనికోసమే యుద్ధ విరమణకు మధ్యవర్తిత్వానికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చారు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్. ఈ ఒప్పందంతో అమెరికా కంపెనీలకు చేతినిండా లాభాలు దొరుకుతాయి. టైటానియం, జిర్కోనియం, గ్రాఫైట్ వంటి అత్యంత విలువైన ఖనిజవనరులు ఉక్రేన్ భూభాగంలో అపారంగాఉన్నాయి. ఈ ఒప్పందంలో ఏడు ముఖ్యాంశాలు ఉన్నాయి. ఈ ఒప్పందం ప్రకారం ఖనిజ వనరులకోసం ఉమ్మడి అన్వేషణ చేస్తారు. ఉక్రేన్ అభివృద్ధికి పెట్టుబడులను ప్రవహింపజేస్తారు. ఉక్రేన్‌లో శాంతికి అమెరికా కృషి చేస్తుంది. అమెరికా ఆర్థికమంత్రి స్కాట్ బెస్సెంట్, ఉక్రేన్ తరపున ఆ దేశ మొదటి ఉప ప్రధానమంత్రి యులియా సిర్దెంకోలు ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ విషయం చెప్పారు. పుతిన్‌పట్ల అమెరికా కఠిన వైఖరి అనుసరించాలి, అతలాకుతలమైన ఉక్రేన్‌కు ఏదైనా సహాయం చేయాలి, పాత అప్పులు గురించి అడగకూడదు వంటి అంశాలు ఈ ముసాయిదాలో ఉన్నాయి. ఉక్రేన్ పునర్నిర్మాణంవల్ల రష్యాకు సహాయం చేసినవారెవ్వరూ లాభపడకూడదనే నిబంధన కూడా ఉంది. ఉక్రేన్‌తో కొత్త చమురు, గ్యాస్ ఉమ్మబడి ఒప్పందాలు, ఖనిజ వనరుల లబ్ధి అమెరికా పొందినాగానీ యాజమాన్యం మాత్రం ఉక్రేన్ కిందే ఉండాలన్న నిబంధన జెలెన్‌స్కీ విధించారు.ఈ ఒప్పందంవల్ల యూరోపియన్ యూనియన్‌లో చేరాలన్న ఉక్రేన్ దీర్ఘకాలిక కలకు ఎంతమాత్రం ఆటంకం కూడా రాదు. ఒప్పందాన్ని అంగీకరిస్తే ఉక్రేన్‌కు యూరోపియన్ యూనియన్‌లో చేరేందుకు సమస్యలు వస్తాయని తొలుత భయపడింది. అదే విధంగా ఈ ఒప్పందం ప్రకారం పది సంవత్సరాలపాటు లాభాలను ఉక్రేన్‌లోనే తిరిగి పెట్టుబడుటుగా పెట్టి పునర్నిర్మాణానికి దోహదపడాల్సి ఉంటుంది. యుద్ధంలో మునిగి అతలాకుతమవుతున్న ఆ దేశంలోని కొన్ని ప్రాంతాలలో ఉన్న విలువైన, అతి కీలకమైన ఖనిజవనరులపై అమెరికాకు అధికారాలు లభిస్తాయి. బ్రిటన్ మీడియా ఈ విషయం వెల్లడించింది. ఈ ఒప్పందానికి సబంధించిన ముసాయిదా ఒప్పంద పత్రాలు తమ చేతికి వచ్చాయని, ఐతే తాము తుది ఒప్పంద పత్రాలను చూడలేదని మీడియా పేర్కొంది. ఉక్రేన్‌తో ఒప్పందం కోసం అమెరికా ఎంతో ఆత్రంగా ఎదురుచూస్తున్నది. మూడు సంవత్సరాలుగా జరుగుతున్న యుద్ధవల్ల నేలమట్టమైన ఉక్రేన్‌లో తిరిగి పెట్టుబడులు సంపాదించుకోవడానికి ఖర్చులు గడుపుకోవడానికి ఈ ఒప్పందం సహాయకారిగా ఉంటుందని జెలెన్‌స్కీ భావిస్తున్నారు. కాగా యుద్ధ సమయంలో ఉక్రేన్‌కు అమెరికా అందించిందని చెబుతున్న 350 బిలియన్ డాలర్ల సహాయాన్ని తమకు తిరిగి చెల్లించాలని ట్రంప్‌పెట్టినషరతునుఉక్రేన్‌తిరస్కరించింది.గతంలో అలాంటి షరతులేవీ అమెరికా విధించలేదని జెలెన్‌స్కీ చెప్పారు.

### వనరుల ఒప్పందంతో ఉక్రేన్‌కు మహర్దశ,శాంతి?

అమెరికాతో ఖనిన వనరల ఒప్పందం చేసుకోవడం ద్వారా తమ దేశంలో కొంతలోకొంత శాంతి లభిస్తుందనీ, దేశ పునర్నిర్మాణనాకి పెట్టుబడులు సమకూరుతాయని ఉక్రేన్ ఆశాభావంతో ఉంది. ఐతేఈముసాయిదా ఒప్పందం ప్రకారం రష్యాపట్ల కఠిన వైఖరి అనుసరించాలని ఉక్రేన్ కోరింది. దీనిని ట్రంప్ ఎంతవరకూ నెరవేరుస్తారన్నది ప్రధానాంశం. మాగా (మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్) అనే నినాదానికి కట్టుబడిన ట్రంప్ అమెరికా కంపెనీల ఆర్థిక ప్రయోజనాలకే ఎక్కువ విలువ ఇస్తారని, తమకు మేలు చేస్తారని ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ గట్టి ఆశాభావంతో ఉన్నారు. ప్రప్రంచవ్యాప్తంగా ఉన్నఐదూశాతం కీలక ఖనిజ వనరులు ఉక్రేన్‌లోనే ఉన్నాయి. వీటిల్లో ప్రధానంగా 19,000 మిలియన్ టన్నుల గ్రాఫైట్ నిల్వలు ఉక్రేన్ భూభాగంలోనే ఉన్నాయి. ఈ ఖనిజ వనరులను గనుక ఎగుమతి చేసుకుంటే ఉక్రేన్‌కు లాభాలే లాభాలు వస్తాయి. లాభాల పంటతో ఆ దేశం అనతికాలంలోనే ప్రపంచంలో అత్యున్నత ఐదు సంపన్నదేశాలలో ఒకటిగా ఎదిగే అవకాశాలు ఉంటాయి. కొన్ని లక్షల బిలియన్ డాలర్ల విలువైన ఖనిజ వనరులు ఉక్రేన్‌లో ఉండటంతో ఈ ఒప్పందం ద్వారా అమెరికా ఆ ప్రాంతాన్ని తన వశం చేసుకుంది. ఈ ఒప్పందం రెండు దేశాలమధ్యా ఒక కీలకమైలురాయి వంటిదని ఉక్రేన్ విదేశాంగమంత్రి ఆండ్రీ సైబిహా వ్యాఖ్యానించారు. ఉక్రేన్–అమెరికా మధ్య ఆర్థిక భాగస్వామ్యం ఎంతో ఆహ్వానించదగిన పరిణామమని బ్రిటన్ ప్రధానమంత్రి కీవ్ స్టార్‌మర్ అన్నారు.

## దక్షిణకొరియా తాత్కాలిక అధ్యక్షుడు హాన్ డక్ సూ రాజీనామా



**సియోల్ :** దక్షిణ కొరియా ప్రధాన మంత్రి, ఆ దేశ తాత్కాలిక అధ్యక్షుడు హాన్ డక్ సూ (70) గురువారంనాడు అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. జూన్ మూడవ తేదీన దక్షిణ కొరియాలో అధ్యక్ష పదవికిఎన్నికలు జరుగుతున్న తరుణంలో ఆయ న రాజీనామా చేశారు. 40 సంవత్సరాలపాటు బహిరంగ రాజకీయ జీవితంలో ఉన్న సూ ఎన్నికల్లో ఆయన కూడా అధ్యక్ష అభ్యర్థిగా పోటీ చేస్తారని భావిస్తున్నారు. ''దేశంలో అధికార సంక్షోభం ఏర్పడింది, ఈ సమస్య పరిష్కారానికి నా వంతు కృషి నేను చేస్తాను, చేయగలిగినదంతా నేను చేస్తా ను, అది నా విధి, కర్తవ్యం'' అని సూ చెప్పారు. ఒకవేళ నిజంగా ఆయన అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటే ఈ నెల నాలుగో తేదీ నాటికి అధికారిక లాంఛనాలన్నీ పూర్తిచేసుకుని ఎన్నికల బరిలోకి దిగవలిసి ఉంటుంది. ఇప్పుడు ఆయన స్థానంలో దేశ ఉపాధ్యక్షుడు ఛోయ్ సాంగ్ మోక్ అధ్యక్ష బాధ్యతలు చేపడతారని భావిస్తున్నారు. గత ఏడాది డిసెంబరులో దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ దేశంలో ప్రతిపక్షాలను వేధింపులకు గురిచేయాలనే ఉద్దేశంతో ఆకస్మికంగా మార్షల్ లా ప్రకటన చేశారు. ఆ తర్వాత వెనక్కు తగ్గి కొద్దిగంటలకే ఆ నిర్ణయం వెనక్కు తీసుకున్నారు. కానీ ఆయన ఈ చర్య ద్వారా దేశద్రోహ నేరానికి పాల్పడ్డారంటూ యూన్ సుక్ యోల్‌ను పార్లమెంటు అభిశంసన తీర్మానం ద్వారా అధ్యక్ష పదవినుండి తొలగించింది. ఆ తర్వాత ఆయన అరెస్టయ్యారు. ప్రస్తుతం కోర్టు విచారణ ఎదుర్కొంటున్నారు. ఈ తరుణంలో జూన్‌లో దక్షిణకొరియాలో ఎన్నికలు జరుగుతున్నాయి.

## జూన్‌లో పాలస్తీనాకు ఫ్రాన్స్, సౌదీ అరేబియా గుర్తింపు

**లండన్ :** పాలస్తీనాను ఒక దేశంగా గుర్తించేందుకు సంబంధించి బ్రిటన్, ఫ్రాన్స్, సౌదీ అరేబియా దేశాలు చర్చలు జరుపుతున్నాయి. ఈ చర్చలు ఒక కొలిక్కి వస్తే రాబోయే జూన్ నెలలో పాలస్తీనాకు ఒక దేశంగా ఆ మూడు దేశాలు గుర్తింపు ఇస్తాయి. బ్రిటన్ విదేశాంగమంత్రి డేవిడ్ లమ్మీని ఉటంకిస్తూ ద గార్డియన్ పత్రిక ఈ విషయం ప్రకటించింది. బ్రిటన్ ఎగువసభ హౌస్ ఆఫ్ లార్డ్స్‌లోరి ఇంటర్నేషనల్ సెలక్ట్ కమిటీ సమావేశంలో మాట్లాడుతూ, డేవిడ్ లమ్మీ ఈ విషయం చెప్పారు. ఫ్రెంచ్ విదేశాంగమంత్రి జీన్ నోయల్ బారెట్ ఏప్రిల్ నెలారంభంలో మాట్లాడుతూ, జూన్ నెలలో న్యూయార్క్‌లో ఫ్రాన్స్,సౌదీఅరేబియా దేశాలు పాలస్తీనాను గుర్తించే విషయంపై చర్చలు జరుపుతుతాయన్నారు. ఈ పరిణామం పాలస్తీనాలో ప్రస్తుత ఉన్న పరిస్థితులపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని, కొంత మార్పు వచ్చే అవకాశాలు ఉన్నాయని డేవిడ్ లమ్మీ హౌస్ ఆఫ్ లార్డ్స్‌లో చెప్పారు. ఇటీవల కొన్ని యూరప్ దేశాలు పాలస్తీనాను ఒక దేశంగా గుర్తింపు ఇచ్చినప్పటికీ కూడా అంతర్జాతీయస్థాయిలో ఎలాంటి ప్రభావం కలగలేదని, పాలస్తీనాకు ఎలాంటి మేలూ జరగలేదని ఆయన అన్నారు. ఈ పరిస్థితిలో మార్పు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. పాలస్తీనాకు 135 మిలియన్ డాలర్ల సహాయంగా ఇస్తున్నట్లు ఏప్రిల్ నెలాఖరులో బ్రిటన్ విదేశాంగమంత్రి ప్రకటించింది.

## రేపు వరల్డ్ సోషలిస్టుల ఆన్‌లైన్ మేడే ర్యాలీ

**వాషింగ్టన్ :** కార్మికుల అంతర్జాతీయ పర్వదినం మే డే పురస్కరించుకుని వరల్డ్ సోషలిస్టులు మే మూడో తేదీన అంటే శనివారంనాడు ఆన్‌లైన్ ద్వారా మహా ప్రదర్శన నిర్వహిస్తున్నారు. ఇంటర్నేషనల్ కమిటీ ఆఫ్ ఫోర్త్ ఇంటర్నేషనల్, వరల్డ్ సోషలిస్ట్ వెబ్‌సైట్‌లు సంయుక్తంగా ఈ వార్షిక మే డే ఆన్‌లైన్ మహా ప్రదర్శన నిర్వహిస్తున్నాయి. ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాటం చేసేందుకు, నియంతృత్వానికి, ప్రపంచంలో వివిధ ప్రాంతాలలో జరుగుతున్న యుద్ధాలకు వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్తంగా కార్మికులందరినీ ఏకం చేయడం కోసం శనివారంనాడు ఈ మహా ప్రదర్శనను ఆన్‌లైన్‌లో ఏర్పాటు చేశారు. అమెరికాలో డోనాల్డ్ ట్రంప్ అధ్యక్షుడుగా తిరిగి పదవిని అధిష్టించడంతో ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థలో పెద్ద సంక్షోభం ప్రారంభమైంది. ఫాసిస్టు ఎజెండాను చాలా శరవేగంగా ట్రంప్ ప్రపంచవ్యాప్తంగా అమలు చేస్తున్నాడు.ప్రపంచ దేశాలలో ఖనిజ వనరులను దోచుకునేందుకు అన్వేషణ ఉద్ధృతం చేశాడు. వ్యాపారపోటీ పెరిగింది. ఇది ఆర్థిక సంక్షోభ పరిస్థితులకు దారితీస్తున్నది. ట్రంప్, వారి తైనాతీయు ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్నారు, వ్యవస్థలను కూలదోస్తున్నారు.యుద్ధాలకుఆజ్యం పోస్తున్నారు, వలస ప్రజలపై దాడులను ప్రోత్సహిస్తున్నారు, గాజాలో సామూహిక ఊచకోతను ప్రతిఘటిస్తున్న విద్యార్థులను వెన్నులో వణుకుపుట్టేవిధంగా అణచివేతకు గురిచేస్తున్నారు, మహ్మద్ ఖలీల్, మహ్మద్ తాహ్, రుమేసా ఓజ్‌టుర్క్ వంటి విద్యార్థి నాయకులు అమెరికాలో ఉండి వారి విధానాలను వ్యతిరేకిస్తుంటే, వారిని బలవంతంగా స్వదేశాలకు పంపేస్తామని బెదిరిస్తున్నారు. వారిని దారుణంగా అణచివేతకు గురిచేస్తున్నారు. ప్రజాస్వామ్యబద్ధమైన నిరసన ప్రదర్శనకు తావు లేకుండా హక్కులను హరించివేస్తున్నారు. ఎలాన్‌మస్క్ వంటి సంపన్న అండతో సామ్రాజ్యవాదులు తమ ఆటలు కొనసాగించడానికి దురాక్రమణ చర్యలకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు, అసమానతలను పెంచిపోషిస్తున్నారు. ట్రంప్ విధానాల కారణంగా ప్రపంచ పెట్టుబడిదారీ దేశాలలో నియంతృత్వ పోకడలు పెరుగుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా పాలకులు అసంతృప్తి పెరుగుతుంటే అణచివేత చర్యలతో స్పందిస్తున్నారు. ఇలాంటి దారుణ పరిస్థితులలో అంతర్జాతీయ కార్మికవర్గం ఐక్యం కావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. యుద్ధాలకు, అణచివేతలకు, అసమానతలకు వ్యతిరేకంగా ప్రపంచ కార్మికులు తక్షణం ఐక్యం కావాల్సిన ఆవశ్యకత వచ్చింది. అంతర్జాతీయస్థాయిలో పెట్టుబడిదారీవ్యవస్థపై కార్మికలోకం పోరాటం చేయాల్సిన అవసరం ఉంది. సామ్రాజ్యవాద హింసకు అంతం పలకాల్సిన ఆవశ్యకత ఉంది.



## బిసి కులగణనకు చట్టరూపం కల్పించాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఇప్పటికే అసెంబ్లీలో ఆమోదం పొందిన బిసి కులగణనకు చట్టరూపం కల్పించాలని, రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్డ్‌లో చేర్చే విధంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని తెలంగాణ వెనకబడిన తరగతుల కమిషన్ ఛైర్మన్ జి.నిరంజన్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ విషయంలో చొరవ తీసుకొని, అఖిల పక్షంతో ప్రధానమంత్రిని కలిసి, ఒప్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కేంద్ర మంత్రివర్గం జనాభా లెక్కలతో పాటు బిసి కులాల గణన చేయాలని నిర్ణయించడాన్ని ఆహ్వానిస్తున్నామని నిరంజన్ అన్నారు. హైదరాబాద్ ఖైరతాబాద్‌లోని బిసి కమిషన్ కార్యాలయంలో సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్‌లతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో బిసి కులాల సర్వేను శాస్త్రీయంగా నిర్వహించి, మొత్తం జనాభాలో 56.36 శాతం బిసిలు ఉన్నట్టు నిర్ధారించడం జరిగిందన్నారు. తదనుగుణంగా బిసిలకు రాజకీయ, విద్యా, ఉద్యోగ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్ ఖరారు చేస్తూ మార్చి 17న అసెంబ్లీలో రెండు బిల్లులు ఆమోదం పొందడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఆ బిల్లులు చట్టరూపం దాల్చటానికి కేంద్ర ప్రభుత్వ ఆమోదం కోసం వేచి ఉన్నాయన్నారు. 42 శాతం రిజర్వేషన్‌లను స్థానిక సంస్థల ఎన్నికల్లో అమలు చేయాలనే ఉద్దేశంతో జనవరి 2024 నుండి గ్రామ పంచాయితీ ఎన్నికలు, ఎంపిటిసి, జెడ్‌పిటిసి ఎన్నికలు నిర్వహించలేదన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1,03,889 ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్ల ద్వారా 1,12,15,134 కుటుంబాలను సర్వే చేయడం జరిగిందన్నారు.

## ఎర్ర జెండానే (మొదటి పేజీ తరువాయి)

అమరత్వంతోనే ఎనిమిది గంటల పనివిధానంతోపాటు అనేక కార్మిక చట్టాలు, హక్కులు ఏర్పడ్డాయని, చికాగో అమరుల స్ఫూర్తితో భారతదేశంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా జరిగిన ఉద్యమాలకు ఏలికలు దిగిరాక తప్పలేదన్నారు. బ్రిటీష్ రాజ్యంలో, ఆ తర్వాత స్వతంత్ర భారతంలో పోరాడి, త్యాగాలు చేసి సాధించుకున్న కార్మికుల హక్కులను ఏకమొత్తంగా బిజెపి ప్రభుత్వం రద్దు చేసే కుట్రలకు పాల్పడుతోందని విమర్శించారు. ఈ కార్యక్రమాల్లో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, జిల్లా కార్యవర్గ సభ్యులు దుర్గరాసి వెంకటేశ్వర్లు, చంద్రగిరి శ్రీనివాసరావు, సలిగంటి శ్రీనివాస్, జిల్లా సమితి సభ్యులు వాసిరెడ్డి మురళి తదితరులు పాల్గొన్నారు.

## వెనక్కు తగ్గండి
(మొదటి పేజీ తరువాయి)

సైన్యానికి ప్రమేయం ఉందని, వారి ప్రోద్బలంతోనే ఉగ్రవాదులు దాడులకు తెగబడ్డారని భారతదేశం చేసిన ఆరోపణను పాకిస్థాన్ తిరస్కరించింది. అందుకు తగిన సాక్ష్యాధారాలు లేవని వాదించింది. అదేవిధంగా పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్‌తో మాటల సందర్భంగా ఈ ఘటనను ఖండించాలని మార్కో రుబియో కోరారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సిసిఎస్ సమావేశం అనంతరం పాకిస్థాన్‌పై దాడి చేయడానికి త్రివిధ దళాలకు పూర్తిస్వేచ్ఛ ఇచ్చిన కొద్ది సేపటికి పాకిస్థాన్ సమాచారశాఖామంత్రి ఒక ప్రకటన చేస్తూ రాబోయే 24 లేదా 36 గంటల్లో భారతదేశం పాకిస్థాన్‌పై యుద్ధం ప్రకటించే అవకాశాలున్నాయని ప్రకటించిన నేపథ్యంలో మార్కో రుబియో రెండు దేశాలూ సంయమనం పాటించాలని విజ్ఞప్తి చేశారు.

## కమిటీ నియమించాలి
(మొదటి పేజీ తరువాయి)



ఒక కమిటీని నియమించాలని, అలాగే ఉన్నత స్థాయిలో అధికారులతో కూడిన నిపుణుల కమిటీని ఏర్పాటు చేసి క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని,అందరీ అభిప్రాయాలను, సూచనలను స్వీకరించాలని తెలిపారు. ఏడాదిలోపు జనగణన ప్రక్రియను పూర్తి చేసేందుకు గడువు సరిపోతుందని చెప్పారు. జన గణనలో కులగణన చేపట్టేందుకు కేంద్రప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తాము స్వాగతిస్తున్నామని,ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని స్పష్టం చేశారు. హైదరాబాద్, జుబ్లీహిల్స్‌లోని తన నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రేవంత్ రెడ్డి మాట్లాడుతూ జన గణనలో కులగణన చేపట్టాలని, రిజర్వేషన్ల 50 శాతం పరిమితిని తొలగించాలని శాసనసభలో రెండు తీర్మానాలు చేసి కేంద్రానికి పంపించామని,ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద బిసి సంఘాలతో కలిసి ధర్నా నిర్వహించామని, దీనికి తోడు కులగణన చేపట్టాలని ప్రధానప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ దేశ వ్యాప్తంగా చేపట్టిన భారత్ జోడో యాత్రలో డిమాండ్ చేశారని, ఈ ఒత్తిళ్ల మేరకే ప్రధాని మోదీ తలొగ్గి కులగణనపై నిర్ణయం తీసుకున్నారని అన్నారు. కులగణన చేసేందుకు కేంద్రం అంగీకరించిందని, ఈ విషయంలో ముందుగా రాహుల్‌గాంధీకి అభినందనలు చెప్పాలని, ఆయన కులగణన కోరుతూ వేల కిలోమీటర్లు భారత్ జోడో యాత్రను చేపట్టారని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. కేంద్రంలో అధికారంలోనికి వస్తే కులగణన చేపడుతామని రాహుల్ హామీనిచ్చారని, ప్రధానప్రతిపక్ష పార్టీగా కులగణన విషయంలో కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చారని గుర్తు చేశారు. కులగణన సమాజానికి ఎక్స్‌రేలాంటిదని రాహుల్ గాంధీ అన్నారన్నారు.

### రాష్ట్రాలతో కేంద్రం కలిసి పనిచేయాలి

కులగణన విషయంలో కేంద్రం, రాష్ట్రాలు కలిసి పని చేయాలని సిఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. ఈ విషయంలో స్పష్టమైన మార్గ దర్శకాలు రూపొందించాలన్నారు. కులగణన పూర్తయితే కేంద్రం చేం చేస్తుందో కూడా స్పష్టం చేయాలన్నారు. ఒబిసిలలో రాష్ట్రాల వారిగా వేర్వేరు కేటగిరీలుగా ఉన్నందున, కుల గణన విషయంలో రాష్ట్రాల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలని కేంద్రానికి సిఎం సూచించారు. కులగణన విషయంలో తెలంగాణ రాష్ట్రంలో 8 పేజీల్లో 57 ప్రశ్నల ద్వారా వివరాలు సేకరించామని, ఎన్యు మరేటర్ నుంచి సిఎస్ వరకు పలు సార్లు సమీక్షించామని, రాజకీయ పార్టీలు, బిసి, ప్రజా సంఘాల సలహాలు తీసుకున్నామని, శాసనసభలో కూడా చర్చించామని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు.కులగణనలోరాజకీయపార్టీల ప్రమేయం లేకుండా చేశామన్నారు. ప్రజల నుంచి సేకరించిన సమాచారాన్ని గోప్యంగా ఉంచామన్నారు.

### కేంద్రం ఆహ్వానిస్తే వెళ్తాం....

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ అనుభవాలను పంచుకునేందుకు కేంద్రం తమను ఆహ్వానించినా, లేదా కేంద్ర ప్రతినిధులు ఇక్కడికి వచ్చినా, 'తెలంగాణ కుల గణన' విధివిధానాలను వివరిస్తామని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. తమ అనుభవాలను పంచుకోవడానికి తెలంగాణ ప్రభుత్వానికి ఎటువంటి బేషజాలు లేవని చెప్పారు. కేంద్రం ఏ ఉద్దేశాలతో, ఏ కారణాలతో కులగణన నిర్ణయం తీసుకున్నప్పటికీ అంతిమంగా బలహీనవర్గాలకు అన్ని రంగాలల్లో ఉపాధి అవకాశాలు, న్యాయం జరగాలన్నదనే తమ ఆకాంక్ష అని సిఎం అన్నారు. రాహుల్ గాంధీ ఆలోచనలను అమలు చేసేందుకు ఎవరితోనైనా కలిసి పని చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, దేశంలోనే ఎక్కడా లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం కులగణన చేసి చూపించిందన్నారు.

### మోదీ ఎవరిని అనుకరిస్తున్నారో ఆ పిల్లలకు తెలువదు ..

ప్రధాని మోదీ ఎవరిని అనుకరిస్తున్నారో, ఏం చేస్తున్నారో కూడా తెలియకుండా, తెలంగాణ రాష్ట్రానికి చెందిన పిల్లలు కిషన్‌రెడ్డి, బండి సంజయ్(కేంద్ర మంత్రులు) గల్లీలో ఏదేదో మాట్లాడుతున్నారని సిఎం రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేసిన కుల గణనను కేంద్రం అనుకరించడం, తమ సూచనలను, సలహాలను ప్రధాని మోదీ అమలు చేయడం పట్ల రాష్ట్ర బిజెపి నాయకులలో అసూయ, అసంతృప్తి కనిపిస్తోందని, తమ విధానాలను మోదీ అనుసరిస్తున్నారనే బాధ వారిలో ఉన్నదని రేవంత్ రెడ్డి అన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాలలో కులగణన ఎందుకు చేపట్టలేదని, కేంద్రంలో అధికారంలో ఉన్న ఈ పదేళ్లలో కులగణన ఎందుకు గుర్తుకు రాలేదని బిజెపిని సిఎం రేవంత్ నిలదీశారు. బిజెపి తమ సంకీర్ణ ప్రభుత్వాన్ని కాపాడుకోవాలంటే కులగణన చేసి తీరాల్సిన పరిస్థితి నెలకొన్నదన్నారు. తెలంగాణ రాష్ట్ర బిజెపి నాయకులు రాజకీయ లబ్ధి కోసమే తమపైన విమర్శలు చేస్తున్నారన్నారు. బిజెపికి 400 పార్లమెంట్ సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మార్చేవారని, రిజర్వేషన్లను రద్దయ్యేవని, కులగణన చేపట్టే పరిస్థితి కూడా ఉండేది కాదన్నారు. ఈ విషయాన్ని తాము ప్రజలలో తీసుకెళ్లామని, అందుకే బిజెపి సీట్లు తగ్గాయని, దీంతో కులగణన చేపట్టాల్సిన పరిస్థితి నెలకొన్నదని సిఎం అన్నారు.

### చర్చలే సమస్యకు పరిష్కార మార్గం :

ఏ సమస్యకైనా చర్చలే పరిష్కార మార్గమని, ఈ విధానాన్నే తాము పాటిస్తామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. హింసకు తాము వ్యతిరేకమన్నారు. మావోయిస్టుల అంశంపై సిఎం పై విధంగా స్పందించారు. మహాత్మా గాంధీ శాంతియుత పద్ధతిలోనే విజయాన్ని సాధించారని, అందుకే హిరోషిమాలో గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేసి, ఆయనను జపానీయులు పూజిస్తున్నారని చెప్పారు. గాంధీ తరహాలోనే అనుకున్నది సాధించే వరకు రాహుల్ గాంధీ వదిలిపెట్టబోరని, ఏదో ఒక రోజు ఆయన అనుకున్నదానిని అందరూ పాటించాల్సిందేనని, ఇందుకు కులగణన ఒక్క ఉదాహరణ అని సిఎం అన్నారు.

## ప్రతిపక్షాల ఉద్యమం వల్లే...
(మొదటి పేజీ తరువాయి)

నాయకత్వంలో ప్రజాశ్రేణులు సమీకృతమై చేసిన స్థిరమైన పోరాటాలకు స్పష్టమైన ప్రతిస్పందన. భారతదేశ సామాజిక వాస్తవాలను ప్రతిబింబించేందుకు శాస్త్రీయ పద్ధతిలో కులగణన చేపట్టాలని భారతకమ్యూనిస్టుపార్టీ ఎప్పటినుండో చాలా స్థిరంగా ప్రభుత్వాలను డిమాండ్ చేస్తూ వచ్చింది. బీహార్‌లో బిజెపి చేసిన దాడులనుండి కులగణనను సర్వేను రక్షించడానికి సిపిఐ అగ్రభాగాన నిలబడింది, తెలంగాణరాష్ట్రంలో కూడా ఇదేవిధంగా కులగణన చేపట్టడానికి సిపిఐ బలమైన మద్దతు ఇచ్చింది. ఈ రెండు రాష్ట్రాల అసెంబ్లీలలో ఈ సర్వే నివేదికలను ఆమోదించడంలో, ప్రజలపక్షాన నిలబడి పోరాటం చేయడంలో సిపిఐ బలమైన మద్దతుదారుగా తనవంతు పాత్ర పోషించింది. ఈ కీలకమైన సమస్యపై దేశవ్యాప్తంగా ప్రజాభిప్రాయాన్ని కూడగట్టడంలో సిపిఐ ఎంతో క్రియాశీలపాత్ర వహించింది. అదేసమయంలో, నిర్ణీత ప్రకారం 2021లో చేపట్టవలసిన జనాభా లెక్కల సేకరణ ప్రక్రియను క్షమించరాని రీతిలో జాప్యం చేయడంపట్ల కూడా భారత కమ్యూనిస్టుపార్టీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. గడచిన నాలుగు సంవత్సరాలుగా విధాన నిర్ణయాలు చేయడంలో కాలం చెల్లిన గణాంకాలనే ఉపయోగించారు. అందువల్ల ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం ఈ గణాంకాల సేకరణకు ఒక నిర్ణీ కాలపరిధిని, ఒక గడువును అనివార్యంగా ప్రకటించారు. అదేవిధంగా రిజర్వేషన్లపై ఏకపక్షంగా విధించిన యాభైశాతం పరిమితిని కూడా వెంటనే తొలగించాలనిభారత కమ్యూనిస్టుపార్టీ డిమాండ్ చేస్తున్నది. వ్యవస్థాగతమైన ఆటంకాలను పరిష్కరించకుండా, ప్రభుత్వరంగ వ్యవస్థలో ఉద్యోగ నియామకాలకు తిరిగి ప్రాణం పోయకుండా కులగణన చేయడంవల్ల సామాజిక న్యాయాన్ని ముందుకు తీసుకువెళ్ళాలనే లక్ష్యాన్ని సాధించడం కష్టం అని సిపిఐ స్పష్టం చేస్తున్నది'' అని డి.రాజా తన ప్రకటనలో పేర్కొన్నారు.

## వేగిర పరుస్తాం
(మొదటి పేజీ తరువాయి)

తొలగించడానికి తామూ ప్రాజెక్టులను సందర్శించినట్లు తెలిపారు. మహాత్మా గాంధీ కల్వకుర్తి లిఫ్టు ఇరిగేషన్‌స్కీమ్, నెట్టెంపాడు, బీమా, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులను పూర్తిచేయడంలో గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, పదేళ్లుగా ఈప్రాజెక్టుల పనులు ముందుకు సాగలేదన్నారు. ఈనాలుగు ప్రాజెక్టులన్నింటిని సంపూర్ణంగా ఈ ఆర్థిక సంవత్సరంలో 2026 మార్చి 31వరకు అన్నివిధాలుగా వందశాతం పనులను పూర్తిచేయడానికి ఆదిశగా చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులోభాగంగా నార్లాపూర్, ఏదుల, వట్టెం, కరివేన రిజర్వాయర్లలో 50 టిఎంసిలనీటిని నింపడానికి ఆరునెలల సమయం పెట్టుకొని, ఏం పనులు చేయాలో, అదేవిధంగా ఉద్దండాపూర్ రిజర్వాయర్ నింపడానికి 2026మార్చి వరకు నిర్ధిష్ట గడువును నిర్ధేశించుకొని ప్రణాళికబద్దంగా పనులను వేగవంతం చేసి రైతులకు సాగునీటిని అందించేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. మహాత్మాగాంధీ కల్వకుర్తిలిఫ్టు ఇరిగేషన్‌స్కీం మొదటిలిఫ్టులో నిరుపయోగంగా ఉన్న రెండు మోటార్లను రెండుమూడునెలల్లో మరమ్మత్తులు పూర్తిచేసి వినియోగంలోకి తీసుకొస్తామని స్పష్టంచేశారు. మంత్రులవెంట ఎంపి మల్లురవి, రాష్ట్రప్రణాళికసంఘం వైస్‌చైర్మన్ చిన్నారెడ్డి, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రాజేష్‌రెడ్డి, కసిరెడ్డినారాయణరెడ్డి, జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్, ఇంజనీరింగ్‌శాఖ అధికారులు ఉన్నారు.

## సమ్మెలోకి వెళ్లకండి
(మొదటి పేజీ తరువాయి)

జనక్ ప్రసాద్ అధ్యక్షతన పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఎంఎల్‌ఎలు రాజ్ ఠాకూర్, కాలే యాదయ్య, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణు గోపాల్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో సింగరేణి, ఆర్టీసీ, విద్యుత్, అసంఘటిత కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో వారి పాత్ర మరవలేనిదని పేర్కొన్నారు. అనేక మంది త్యాగాలతో సాధించుకున్న ఈ తెలంగాణను గడిచిన 10 ఏళ్లలో 4 గురితో కూడిన ఓ కుటుంబం పూర్తిగా విధ్వంసం చేసిందని విమర్శించారు. రూ.7లక్షల కోట్ల అప్పుల ఊబిలో కి రాష్ట్రాన్ని నెట్టిశారని, ఇంతా అప్పు చేసినా రాష్ట్రంలో ఒక్కరూ బాగుపడింది లేదన్నారు. జరిగి న విధ్వంసాన్ని సరి చేసుకుంటూ ముందుకు పోతున్నామని చెప్పారు. సింగరేణి సంస్థ నుండి ఉన్నత చదువులు చదివే విద్యార్థులకు ప్రత్యేక నిధులు కేటాయించి ప్రత్యేక కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. అదే విధంగా కార్మికుల అభివృద్ధి కి ప్రత్యేక కృషి చేసిన కార్మికులు, కార్మిక నాయకులకు శ్రమ శక్తి అవార్డులు, ఉత్తమ యాజమాన్య అవార్డులు సిఎం అందచేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ కమీషనర్ ఎం. దాన కిషోర్, సంయుక్త కార్మిక కమీషనర్ జి. సునీత గోపాల్ దాస్, కార్మిక శాఖ అధికారులు, వివిధ కార్మిక సంఘాలు, తదితరులు పాల్గొన్నారు.

## చూస్తూ ఊరుకోదు
(మొదటి పేజీ తరువాయి)

హక్కులను చట్టాలను మార్చే కుట్రలు చేస్తోందన్నారు. పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను నిర్వీర్యం చేయడానికి నాలుగు లేబర్ కోడ్‌లుగా చేసి కార్మికుల పనిదినాలు పెంచుతూ కార్మిక సంఘాల రిజిస్ట్రేషన్ రద్దు చేస్తూ కార్మికులకు కనీస వేతనాల చట్టం గ్రాడివిటీ చట్టంతో పాటు ఈ దేశంలోని కార్మిక వర్గ సామాజిక భద్రత, ఉద్యోగ భద్రతను కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. కార్మికులందరూ నాలుగు లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తూ పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాలలో ఎఐటియుసి అనుబంధ రైల్వే హమాలీ సంఘం అధ్యక్షుడు కాసెట్టి లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి దాసరి ప్రభాకర్, రవీందర్, బ్యాంకు ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు వెల్దండి దామోదర్, ఉల్లిగడ్డల హమాలీ సంఘం అధ్యక్షుడు నర్సింహులు, కొమురయ్య, సిమెంట్ గోదాం ఫర్టిలైజర్ హమాలీ సంఘం అధ్యక్షుడు జంగా తిరుపతి, నన్నవేన కొమురయ్య, కదారి బీరయ్య, మామిడిపెల్లి శంకర్, ఆకుల లచ్చన్న, ప్రకాశం గంజ్ ట్రాలీ ఆటో యూనియన్ నాయకులు ప్రభాకర్, కాల్వ రాయమల్లు తదితరులున్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## తహసీల్దార్లను పూర్వ జిల్లాలకు బదిలీ చేయండి

సిఎస్ రామకృష్ణా రావును మర్యాదపూర్వకంగా కలిసిన 'ట్రైసా'

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎన్నికల సమయంలో బదిలీ అయిన తహసీల్దార్లను తిరిగి స్వంత జిల్లాలకు బదిలీ చేయాలని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ (ట్రైసా) అధ్యక్షుడు వంగ రవీందర్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు వంగ రవీందర్‌రెడ్డి నేతృత్వంలో ట్రైసా ప్రతినిధి బృందం నూతన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావును సచివాలయంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో ట్రెసా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.గౌతమ్ కుమార్, ఉపాధ్యక్షుడు కె.నిరంజన్‌రావు, కార్యదర్శి వాణిరెడ్డి, నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు రమన్ రెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు బి.సుధాకర్,కార్యవర్గ సభ్యులు రాజేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

# రాష్ట్ర వ్యాప్తంగా అరుణ పతాకాల రెపరెపలు

ఘనంగా మేడే ఉత్సవాలు






**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర వ్యాప్తంగా అరుణ పతాకాలు రెపరెపలాడాయి. గురువారం అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మేడే వేడుకలను కార్మికులు ఘనంగా నిర్వహించుకున్నారు. కార్మిక, ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో ఎక్కడికక్కడ జెండాలను ఎగురవేసి సంబురాలు చేసుకున్నారు. ఎఐటియుసి, సిఐటియు తదితర వామపక్ష పార్టీల అనుబంధ కార్మిక సంఘాలతో పాటు ఐఎన్‌టియుసి, టిఎన్‌టియుసి, బిఆర్ఎస్‌కెవి అనుబంధ సంఘాలు పండుగ వాతావరణంలో అంతర్జాతీయ కార్మిక దినోత్సవ వేడుకలను నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఎక్కడికక్కడ ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించుకున్నారు. మేడే జిందాబాద్.. కార్మిక ఐక్యత వర్ధిలాలి నినాదాల్లో రాష్ట్రమంతా మారుమోగింది. కార్మిక శాఖ ఆధ్వర్యంలో రవీంద్ర భారతిలో కార్మిక దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కార్మికులు, కార్మిక నాయకులకు శ్రమశక్తి అవార్డులు, ఉత్తమ యాజమాన్య అవార్డులు అందచేశారు. ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయం రాష్ట్ర అధ్యక్షుడు ఎండి. యూసుఫ్ అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. రాంకోఠిలోని షాలిమార్ ఫంక్షన్ హాల్‌లో బహిరంగ సభ నిర్వహించారు. అదేవిధంగా సిఐటియు ఆధర్యంలో ఆర్‌టిసి ఎక్స్‌రోడ్‌లోని ఎంబి భవన్‌లో సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అరుణ పతాకాన్ని ఎగురవేసి కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. తెలంగాణ భవన్‌లో బిఆర్ఎస్‌కెవి జెండాను శాసనమండలి ప్రతిపక్షనాయకుడు మధుసూధనాచారి ఎగురవేశారు. హిమాయత్‌గనగర్‌లోని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ప్రధాన కార్యాలయంలో తెలంగాణ టూరిజం కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధర్యంలో మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు సాంబశివరెడ్డి, సబు రాజమౌళిలు జెండాను అవిష్కరించారు. ఉద్యోగ , ఉపాధ్యాయ సంఘాల ఆధర్యంలో మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకున్నారు. జిహెచ్‌ఎంసి, జలమండలిలో ఆయా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జెండాలను ఎగురవేశారు.

### సాయుధ పోరాట యోధురాలు
## పశ్య కన్నమ్మకు ఘన నివాళులు



* అంత్యక్రియల్లో పాల్గొన్న సిపిఐ జాతీయ నాయకులు
* విప్లవ జోహార్లు అర్పించిన కార్యకర్తలు, ప్రజలు



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** ప్రముఖ సాయుధ పోరాట యోధురాలు, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వీరనారి కామ్రేడ్ పశ్య కన్నమ్మకు సిపిఐ జాతీయ నాయకులు ఘననివాళులు అర్పించారు. గురువారం హుజూర్‌నగర్‌లో జరిగిన పశ్య కన్నమ్మ అంత్యక్రియలల్లో అశేష జనవాహిని, సిపిఐ రాష్ట్ర, జాతీయ నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని అంతిమ వీడ్కోలు పలికారు. కొత్తగూడెం ఎమ్మెల్యే, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ కౌన్సిల్ సభ్యులు పల్లా వెంకటరెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, జాతీయ మహిళా సమాఖ్య జాతీయ కార్యదర్శి డాక్టర్.రజిని, చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్ ఫర్ సోషల్ ప్రోగ్రెస్ ఉపాధ్యక్షురాలు చంద్ర సంధ్య, సెల్ఫ్ రాష్ట్ర సలహాదారు పరుచూరి జమున, ఎపి మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి దుర్గ భవాని, రాష్ట్ర మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఉస్తెల సృజన, తెలంగాణ సాయుధ పోరాట అమరుడు, పశ్య కన్నమ్మ సోదరుడు దొంతిరెడ్డి శంభిరెడ్డి సతీమణి తిరుపతమ్మ, అఖిల భారత కిసాన్ సభ జాతీయ కౌన్సిల్ సభ్యురాలు సంధ్యలు పాల్గొని విప్లవ జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దశాబ్దాలుగా పేదవర్గాలకు న్యాయం చేసేందుకు కన్నమ్మ ఎంతగానో కృషిచేశారని తెలియజేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎర్ర జెండా ప్రాధాన్యత ఉన్నదంటే పశ్య కన్నమ్మ లాంటి వారి నాయకత్వమేనని పేర్కొన్నారు. ఆమె సేవలు ఎంతో విలువైనవని భవిష్యత్ తరాలకు మార్గదర్శకం చూపిస్తాయన్నారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు, జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, జాతీయ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి దేవరం మల్లీశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

# మేడే స్ఫూర్తితో శ్రమదోపిడీపై ఉద్యమించాలి

కార్మికవర్గం బిజెపికి గుణపాఠం చెప్పాలి

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

హనుమకొండ సిపిఐ జిల్లా కార్యాలయంలో ఘనంగా మేడే





**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి :** మేడే స్ఫూర్తితో శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా కార్మికవర్గం ఉద్యమించాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే సందర్భంగా గురువారం హనుమకొండ బాల సముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయం ఎదుట అరుణ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరించి, ఆదానీ, అంబానీ లాంటి కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టారని అన్నారు. దేశ సంపదను తన కార్పొరేట్ మిత్రులకు మోడీ కట్టబెడుతున్నారని, ప్రభుత్వరంగ సంస్థల ఉద్యోగులను రోడ్డున పడవేస్తున్నారని అన్నారు. కార్మికులు ఉద్యమించకుండా కార్మిక చట్టాలను సవరించి వారి హక్కులను కాలరాశారని అన్నారు. పోరాడి సాధించుకున్న 8 గంటల పని విధానాన్ని కాపాడుకునేందుకు, కార్పొరేట్ శక్తుల శ్రమ దోపిడీని అరికట్టేందుకు కార్మికవర్గం మేడే స్ఫూర్తితో ఉద్యమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆదరి శ్రీనివాస్, ఎన్.అశోక్ స్టాలిన్, జిల్లా నాయకులు మునిగాల బిక్షపతి, మాలోతు శంకర్, బాషబోయినసంతోష్, కొట్టేపాక రవి, కండే నర్సయ్య పాల్గొన్నారు.

**కార్మికవర్గం బిజెపికి గుణపాఠం చెప్పాలి**

**ప్రజాపక్షం / వరంగల్ ప్రతినిధి :** మేడే స్ఫూర్తితో శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా కార్మిక వర్గం ఉద్యమించాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే సందర్భంగా గురువారం వరంగల్ తమ్మెర భవన్‌లో ఘనంగా మేడే సిపిఐ జిల్లా కార్యాలయం ఎదుట అరుణ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించి, ఆదానీ, అంబానీ లాంటి కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టారని అన్నారు. దేశ సంపదను తన కార్పొరేట్ మిత్రులకు మోడీ కట్టబెడుతున్నారని, ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులను రోడ్డున పడవేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి, జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్ కె బాష్మియా, సిపిఐ జిల్లా నాయకులు దండు లక్ష్మణ్, జి.భద్రి, సంగి ఎలేందర్, లాయాదెల్ల శరత్ పాల్గొన్నారు.

**ఎఐటియుసి ఆధ్వర్యంలో...** మే డే స్ఫూర్తితో మరో స్వతంత్ర పోరాటానికి సిద్ధం కావాలని ఎఐటియుసి జిల్లా గౌరవ అధ్యక్షులు పనాసప్రసాద్ కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. మేడే సందర్భంగా ఎఐటియుసి అనుబంధ సిమెంట్ ఐరన్‌షాప్ హమాలి వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వరంగల్ నగరంలో 80 ఫీట్ల రోడ్డు, హంటర్ రోడ్డు, అండర్ బ్రిడ్జి, బీట్ బజార్, బట్టుపల్లి రోడ్డు సెంటర్లలో మేడే దినోత్సవం ఎఐటియుసి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పనాస ప్రసాద్ మాట్లాడుతూ ఇప్పటికైనా మోడీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను నిలిపివేయాలని లేదంటే కార్మికుల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. ఎఐటియుసి నాయకులు నగేష్, గబ్బెట వెంకన్న, సంజీవ, రమేష్, నరసింహాచారి, సోమయ్య, చంద్రమౌళి, విజయ్, రవి, సుధాకర్, రాకేష్ పాల్గొన్నారు.

# మే డే స్ఫూర్తిని కొనసాగిద్దాం

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

సిపిఐ కార్యాలయంలో ఘనంగా మేడే వేడుకలు



**ప్రజాపక్షం/నల్లగొండ ప్రతినిధి :** చికాగో అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ మే డే స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ విధానాల వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పిలుపునిచ్చారు. ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే సందర్భంగా నల్లగొండ జిల్లా పార్టీ కార్యాలయంలో పార్టీ అరుణ పతాకాన్ని ఎమ్మెల్సీ సత్యం ఎగురవేశారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ చికాగో నగరంలో చిందిన రక్తం ప్రపంచవ్యాప్తంగా కార్మిక ఉద్యమాలకు నాందిపలికిందని, అనేక కార్మిక ఉద్యమాలకు స్ఫూర్తిగా నిలిచిందని అన్నారు. కార్మికులు ఎన్నో త్యాగాలు, పోరాటాలు చేసి సాధించుకున్న అనేక కార్మిక చట్టాలను రద్దుచేస్తూ, పనిగంటలను కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా 12 గంటలుగా మార్చుటకు కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌లను ముందుకు తెచ్చిందని విమర్శించారు. నేడు దేశంలో అసంఘటితరంగ కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా వారికి కనీసం పనిభద్రత, ఎలాంటి సౌకర్యాలు లేవని, కనీస వేతనాలకు నోచుకోక వారు దుర్భర జీవితం కొనసాగిస్తున్నారని అన్నారు. నాలుగు లేబర్ కోడ్‌ల అమలు వల్ల కార్మికుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారబోతునందున కార్మికవర్గం ఐక్యంగా పోరాడాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శిలు పల్లా దేందర్‌రెడ్డి, లోడంగి శ్రవణ్ కుమార్, సీనియర్ నాయకులు మల్లెపల్లి ఆదిరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు వీరస్వామి, బొల్లుగిరి నరసింహ, పట్టణ కార్యదర్శి గదేపాక రమేష్, నాయకులు కెఎస్.రెడ్డి, విశ్వానాధుల లెనిన్, ముండ్ల ముత్యాలు, నీతి యాదగిరి, మదర్, యూసుఫ్ దొన్నకొండ వెంకన్న, సుజాత, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక హక్కులను కాపాడేది ఎర్రజెండా మాత్రమే



సిపిఐ జాతీయ కౌన్సిల్ సభ్యుడు పల్లా వెంకట్ రెడ్డి



**ప్రజాపక్షం/కోదాడ :** కార్మికుల హక్కులను కాపాడేది ఎర్రజెండా మాత్రమేనని సిపిఐ జాతీయ కౌన్సిల్ సభ్యుడు, మాజీ శాసనసభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంలు అన్నారు.

గురువారం మేడే సందర్భంగా చిలుకూరు మండలంలోని జెర్రిపోతుల గూడెంలో నిర్వహించిన మేడే వేడుకల్లో వారు మాట్లాడారు. దీనికి ముందు పన్నెండు వందల మంది కార్మికులతో సిపిఐ, ఎఐటియుసి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశ స్వాతంత్రానికి ముందే సిపిఐ, అనుబంధ సంఘం ఎఐటియుసి ఆధ్వర్యాన కార్మికుల హక్కుల కోసం పోరాడిన ఘన చరిత్ర ఎర్రజెండాకు ఉందన్నారు. నేడు కేంద్ర పాలకులు కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ 44 కార్మిక చట్టాలను 4 లేబర్ కోర్టులుగా విభజించి అన్యాయం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులంతా ఏకమై ఐక్యంగా తమ హక్కుల సాధన కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వాలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను చిత్తశుద్ధితో అమలు చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి మండవ వెంకటేశ్వర్లు, శాఖ కార్యదర్శి కాంపాటి వెంకటయ్య, నాయకులు రేమిడాల రాజు, చేపూరు కొండలు, నారాయణ సాయి బాలిలు పాల్గొన్నారు.

## సిఎం రేవంత్‌రెడ్డికి అభినందనల వెల్లువ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేశ జనాభాలో కుల గణనను చేపట్టాలని కేంద్ర మంత్రివర్గం నిర్ణయించిన నేపథ్యంలో పలువురు బిసి ప్రముఖులు, నేతలు సిఎం రేవంత్ రెడ్డిని కలిసి అభినందించారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని సిఎం నివాసంలో గురువారం రేవంత్ రెడ్డిని బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సలహాదారు డాక్టర్ కె.కేశవరావు, మాజీ ఎంపిలు వి.హనుమంతరావు, ఎం.అంజన్‌కుమార్ యాదవ్, మధుయాష్కీ గౌడ్, కాంగ్రెస్ బిసి ఎంపిలు, ఎంఎల్‌ఎలు, కార్పొరేషన్ చైర్మన్లు, బిసి ఇంటెలెక్చువల్ ఫోరం చైర్మన్ డాక్టర్ చిరంజీవులు, బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, పలు బిసి సంఘాల నేతలు సిఎంకు పుష్పగుచ్ఛాలు అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. వారు మాట్లాడుతూ కులగణన విషయంలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ప్రజా ప్రభుత్వంపై విమర్శలు చేసే వారికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు.

### ఆర్‌టిసి సమ్మెపై సిఎం రేవంత్ రెడ్డి స్పందనకు..
# టిజిఎస్‌ఆర్‌టిసి జెఎసి కృతజ్ఞతలు

సిఎం చర్చలకు ఎప్పుడు పిలిచినా వచ్చేందుకు సిద్ధం

సమ్మెకు ఇంకా ఆరురోజుల సమయం ఉంది

టిజిఎస్ ఆర్‌టిసి జెఎసి చైర్మన్ ఈదురు వెంకన్న

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రపంచ కార్మిక దినోత్సవం మే డే రోజున ముఖ్యమంత్యిర రేవంత్ రెడ్డి ఆర్‌టిసి కార్మికులు చేపట్టబోయే సమ్మె పట్ల స్పందించినందుకు టిజిఎస్ ఆర్‌టిసి జెఎసి చైర్మన్ ఈదురు వెంకన్న కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మాట్లాడటానికి ఎప్పుడు పిలిచినా తాము వస్తామని, ఆయనతో చర్చించి, తమ సమస్యలు పరిష్కరించుకోవాడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. సమ్మె చేపట్టేందుకు నిర్ణయించిన తేదీకి ఇంకా ఆరు రోజుల సమయం ఉందని, ఈ గడువులోగ సిఎం సూచించిన విధంగా తాము ప్రభుత్వంతో చర్చలు జరపడానికి జెఎసి సిద్ధంగా ఉన్నామన్నారు. ముఖ్యమంత్రి సూచించిన అంశాలను క్షుణ్ణంగా చర్చించడానికి అవకాశం కల్పించాలని ఈదురు వెంకన్న కోరారు. హైదరాబాద్ అజామాబాద్ పరిశ్రామిక వాడలోని ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయంలో గురువారం జెఎసి కో చైర్మన్ కె. హనుమంతు ముదిరాజ్, వైస్ చైర్మన్ ఎం. థామస్ రెడ్డి, కన్వీనర్ ఎం.డి. మౌలానా, కో కన్వీనర్లు కత్తుల యాదయ్య, సుద్దాల సురేష్, బి.యాదగిరిలతో కలిసి ఈదురు వెంకన్న మాట్లాడారు.

**సమ్మె ఇప్పటికిప్పుడు ఆలోచనకాదు**

తాము ఇప్పటికిప్పుడు ఆలోచన చేసి సమ్మె చేద్దామని నోటీసు ఇవ్వలేదని ముఖ్యమంత్రి గుర్తించాలని ఈదురు వెంకన్న అన్నారు. గత ఏడు నెలల నుండి పలుమార్లు రవాణా శాఖమంత్రిని, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను, ప్రభుత్వ పెద్దలందరిని కలిసి వినతిపత్రాలు ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు ఆ సమస్యలను పరిష్కారం చేయడానికి ముందుకు రాకపోవడంతోనే విధిలేని పరిస్థితిలో సమ్మె నోటీసు ఇవ్వాల్సి వచ్చిందని ఈదురు వెంకన్న స్పష్టం చేశారు. తమ సమ్మె డిమాండ్‌లలో ఆర్థిక అంశాలు లేని సమస్యలు 90 శాతం ఉన్నాయని, వాటిని కూడా బేరిజు చేసుకుని చర్చించినప్పుడే అన్ని విషయాలు స్పష్టంగా అర్థం అవుతాయని తెలిపారు. ఎందుకంటే అధికారులు తప్పుడు నివేదికల ద్వారా సిఎంకు తప్పుడు సమాచారం ఇస్తున్నారని, కాబట్టి తాము వాస్తవాలను సిఎంకు చెప్పే అవకాశం తమకు ఎవరూ ఇవ్వడం లేదని, కాబట్టి దయచేసి ఆ వాతావరణం కల్పించవలసిందిగా ముఖ్యమంత్రిని కోరుతున్నామన్నారు.

**కార్మిక సంఘాలపై ఆంక్షల ఎత్తివేత లేకపోవడం బాధాకరం**

ముఖ్యమంత్రి కార్మిక దినోత్సవం రోజు ఆర్‌టిసి కార్మిక సంఘాలపై ఉన్న ఆంక్షలు ఎత్తివేస్తారని కొండంత ఆశతో ఎదురు చూశామని, కానీ ఆ అంశాన్ని ప్రస్తావించకపోవడం చాలా బాధాకరంగా ఉందన్నారు. గతంలో స్వయంగా ముఖ్యమంత్రినే ఆర్‌టిసిలో సంఘాలు ఉండాలని, ఆ సంఘాలతో కార్మికులకు ఏమైనా సమస్యలు ఎదురైతే సామరస్యంగా ఆర్‌టిసి అధికారులతో మాట్లాడుకుని పరిష్కరించుకోవడానికి అవకాశం ఉంటుందని చెప్పారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి ఆ మాట చెప్పకపోవడం అందరికీ అసంతృప్తికి గురి చేసిందన్నారు.

**రాజకీయ పార్టీలు ఉసిగొలిపితే.. ఉద్యమాలు చేస్తున్నామనడం బాధాకరం**

ఎవరో ప్రేరేపిస్తే ఏవో రాజకీయ పార్టీలు ఉసిగొలిపితే తాము ఉద్యమాలు చేస్తున్నమని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించడం తాము చాలా బాధపడుతున్నామని ఈదురు వెంకన్న తెలిపారు. తమ వెనుక ఎవరూ లేరూ, తాము కేవలం తమ ఆర్‌టిసి కార్మికుల ఆక్రందనలను చూసి నిత్యం అనుభవిస్తున్న ఇబ్బందులను డిపోలలో అధికారులు చేస్తున్న వేధింపులు, అధిక పని భారాలు మోయలేక అనారోగ్యాలతో కార్మికులు చనిపోతున్న సంఘటనలు అనేకం ఉన్నాయన్నారు. వారు పడుతున్న నాన అవస్థలను దృష్టిలో పెట్టుకొని, వారి నుండి వచ్చిన ఆలోచనల మేరకే తాము సమ్మె వైపుకు వెళ్తున్నామని ఈదురు వెంకన్న స్పష్టం చేశారు.

**ఆంక్షలతో డిపోలలో మాయమైన ప్రశాంత వాతావరణం**

ఆర్‌టిసిలో కార్మిక సంఘాలపై ఆంక్షలు విధించడంతో డిపోలలో ప్రశాంత వాతావరణం లేదని, కార్మికులంతా అధిక పనిపారాలతో 14 గంటలు 16 గంటలు 18 గంటలు పని చేయిస్తూ, వారిని నడ్డి విరిచే పరిస్థితులు డిపోల అధికారులు చేస్తున్నారన్నారు. కనీసం పండుగలు వచ్చిన పబ్బం వచ్చిన కుటుంబ సభ్యులు చచ్చిపోయిన ఒక్కరోజు లీవ్ కూడా ఇవ్వని పరిస్థితి ఉందన్నారు. 16,000 మంది ఆర్‌టిసిలో ఈ 10 సంవత్సరాల కాలంలో పదవీవిరమణ చేస్తే, ఒక్క నియమాకం కూడా చేపట్టలేదన్నారు.

ఆ భారం అంతా ఉన్న వాళ్ళ మీద వేసి కార్మికుల అనారోగ్యాలకు గురికావడానికి యజమాన్యం కారణమని విమర్శించారు. వేధింపులు, పనిభారాలు, బాధలు భరించలేక ఆ బాధల నుంచి వచ్చిందే ఈ సమ్మె నోటీసు అన్నారు. కార్మికుల ఇబ్బందులను ముఖ్యమంత్రి అర్థం చేసుకోవాల్సిందిగా కోరుతున్నామన్నారు.




### కార్మికవర్గానికి తీవ్ర అన్యాయం చేసే
## నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలి

ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు ఎండి. యూసఫ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కార్మిక వర్గానికి తీవ్ర అన్యాయం చేసే 4 లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు మొహమ్మద్ యూసఫ్ డిమాండ్ చేశారు. నరేంద్ర మోదీ మోడీ ప్రభుత్వ తిరోగమన విధానాలతో కార్మికుల హక్కులు, రక్షణను హరించడంతో పాటు వారి గౌరవాన్ని కించపర్చుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారంఎఐటియుసి ఆధ్వర్యంలో అంతర్జాతీయ కార్మిక దినోత్సవం 'మే డే' ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ హిమాయత్ నగర్‌లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయం వద్ద ఎండి.యూసఫ్ అరుణపతాకాన్ని ఆవిష్కరించి కార్మికుల ప్రదర్శనను జండా ఊపి ప్రారంభించారు. హిమాయత్‌నగర్, హైదర్ గూడా మీదుగా రామ్ కోట్ షాలిమార్ ఫంక్షన్ హాల్ వరకు కార్మికుల ప్రదర్శనను నిర్వహించారు. అనంతరం అక్కడ ఎఐటియుసి హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఎం.నరసింహ అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో ఎండి యూసఫ్ మాట్లాడుతూ కార్మిక వర్గాన్ని గౌరవించడానికి, న్యాయమైన వేతనాలు, మెరుగైన పని పరిస్థితుల కోసం వారి పోరాటాలను స్మరించుకోవడం, కార్మికుల హక్కుల పోరాటానికి చిహ్నంగా 'మే డే' జరుపుకుంటామని గుర్తుచేశారు. బడా కార్పొరేట్ సంస్థల హద్దులేని దోపిడీని సులభతరం చేసేందుకు కార్మికులు తమరక్తం చిందించి సాధించుకున్న హక్కులను తగ్గించడానికి మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈనెల 20న కేంద్ర కార్మిక సంఘాలు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చాయని, సమ్మెను విజయవంతం చేయాలని యూసఫ్ విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో ఎఐటియుసి సీనియర్ నాయకులు ఉజ్జిని రత్నాకర్‌రావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.ప్రేమ్‌పావని, కార్యదర్శులు ఎన్.కరుణ కుమారి, మారగోని ప్రవీణ్ గౌడ్, హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి కమతం యాదగిరి, ఉప ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి కిషన్, వర్కింగ్ ప్రెసిడెంట్ పి. వెంకటయ్య, నేతలు ఎం.లక్ష్మి, ఎ. బిక్షపతి యాదవ్, రమేష్, రాజమౌళి, కొంరెల్లి బాబు, సిహెచ్. జంగయ్య, ఎస్. అశోక్, సిహెచ్. శ్రీనివాస్ పాల్గొన్నారు.

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్
మూసాపేట్ సర్కిల్-23, జిహెచ్ఎంసి.
GHMC
NIT No.05/GHMC/MPT/EE/2025-26 టెండర్ నోటీసు
**పని పేరు:** సివిల్ పని (5), **అంచనా విలువ / ఇసివి:** రూ.39.65లక్షలు, **బిడ్ల స్వీకరణకు ప్రారంభ తేదీ / ఆఖరి తేదీ & సమయం:** 02.05.2025న ఉ.10.30గం.ల నుండి 06.05.2025న ఉ.10.40గం.ల వరకు. **అధికారి పేరు & చిరునామా:** శ్రీ ఇ.యు.రమేష్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, జిహెచ్ఎంసి, మూసాపేట్ సర్కిల్-23, సెల్: 9849994029. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా www.tender.eprocurement.gov.inలో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, జిహెచ్ఎంసి, మూసాపేట్ డివిజన్-23.
DIPR R.O. No. : 1177-PP/CL/ADVT/1/2025-26, Date: 01-05-2025

ప్రజాపక్షం
శుక్రవారం, మే 02

## కెనడా : లిబరల్స్ విజయం వెనుక...

ఏప్రిల్ 28న జరిగిన కెనడా సార్వత్రిక ఎన్నికల్లో పాలక లిబరల్ పార్టీకి తిరిగి అధికారం కట్టబెట్టటం ద్వారా కెనడియన్‌లు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు పరోక్షంగా చెంపపెట్టు పెట్టారు. కెనడా ఎన్నిలకు ట్రంప్‌కు ఏమిటి సంబంధం అని సందేహం తలెత్తవచ్చు. ట్రంప్ జనవరి 20 న అధికారం చేబట్టగానే కెనడా గూర్చి ఏమన్నారో గుర్తు చేసుకోవటం అవసరం. ''కెనడాను అమెరికా 51వ రాష్ట్రంగా కలిపేసుకుంటాం. అది ఆ ప్రజలకు ఎంతో మేలు చేస్తుంది'' అన్నారు. అదే సమయంలో అమెరికాలోకి వలస ప్రజల ప్రవేశానికి, స్మగ్లింగ్‌కు కెనడా అడ్డాగా మారిందన్నారు. కెనడాను శిక్షించే విధంగా కెనడా నుంచి దిగుమతి సుంకాలను ఇబ్బెడు ముబ్బెడు చేశారు. నాటి ప్రధాని జస్టిస్ ట్రూడో ఏ మాత్రం జంకకుండా ట్రంప్‌ను చర్యకు ప్రతి చర్యలతో ఢీ కొన్నారు. అది లిబరల్ పార్టీ విజయావకాశాలను మెరుగుపరిచింది. పాలక లిబరల్ పార్టీ 168 సీట్లు గెలుపొందగా కన్సర్వేటివ్ పార్టీకి 144 సీట్లు లభించాయి. బిక్యుకు 23 సీట్లు, రద్దయిన పార్లమెంటులో 24సీట్లున్న సిక్కుల పార్టీ ఎన్‌డిపికి కేవలం 7 సీట్లు దక్కాయి. గ్రీన్స్ ఒక సీటులో గెలిచారు. 343 మంది సభ్యులుగల పార్లమెంటులో లిబరల్ పార్టీకి కనీస మెజారిటీకి 4సీట్లు తగ్గాయి. ఏమైనా, ప్రస్తుత ప్రధాని మార్క్ కార్నీ సునాయాసంగా కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేయగల స్థితిలో ఉన్నారు. సిక్కు తీవ్రవాది జగ్‌మీత్ సింగ్ పార్టీ ఎన్‌డిపి చిత్తుగా ఓడిపోవటం కెనడాకేగాక భారతదేశానికి కూడా పెద్ద ఉపశమనం.

లిబరల్ పార్టీ ఓటమి ఖాయమనుకున్న రాజకీయ పరిస్థితిలో ప్రజాభిప్రాయంలో ఇంత మార్పు ఎలా సాధ్యమైంది అన్నది ప్రశ్న. మితవాద నాయకుడు పీర్రీ పోయ్‌లీవ్రీకిది గట్టి ఎదురుదెబ్బ. ఆర్థిక వ్యవస్థలో క్షీణింపు, రాజకీయ సంక్షోభం నేపథ్యంలో ప్రధాని ట్రూడో మార్చినెలలో రాజీనామా చేశారు. ట్రూడో స్థానంలో రాజకీయాలకు కొత్త అయిన ఆర్థికవేత్త, ఉన్నతాధికారి మార్క్ కార్నీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. ట్రంప్ కెనడా వ్యతిరేక ప్రకటనలు – కెనడియన్‌లలో జాతీయవాదం, దేశభక్తి, ఐక్యంగా ఎదుర్కోవాలన్న భావాన్ని ఉద్దీపింపజేశాయి. ట్రూడో ట్రంప్‌ను ఎదిరించిన తీరు ఈ ఐక్యతను పటిష్టం చేసింది. ఇది ఆయన వారసుని ఎన్నికల విజయానికి గట్టి పునాదిగా పనిచేసింది. అమెరికాకు దక్షిణ పొరుగుగా ఉన్న కెనడా సంపన్న జి7 దేశాల గ్రూపులో భాగస్వామి. అనేక అమెరికన్ బహుళజాతి కంపెనీలు కెనడాలో తమ పారిశ్రామిక ఉత్పత్తి కేంద్రాలను నెలకొల్పి, అక్కడ ఉత్పత్తి చేసిన ఉత్పత్తులను అమెరికాకు ఎగుమతి చేస్తూ లాభాలు గడిస్తుంటాయి. అంతేగాక శ్రామిక ప్రజలు పెద్దసంఖ్యలో అమెరికా వ్యవసాయ క్షేత్రాలు, భవన నిర్మాణాలు, గృహసేవలు, వగైరాల్లో పనులు చేస్తూ సులభంగా సరిహద్దుకు అటుఇటు ప్రయాణాలు సాగిస్తుంటారు. ట్రంప్ మొదటి టరం అధ్యక్ష పదవీకాలంలో సరిహద్దును మూసివేస్తూ కొంత దూరం గోడ కట్టించారు. ఇప్పుడు దాన్ని పూర్తి చేయాలని తలపెట్టారు. కెనడాతో వాణిజ్యలోటు తగ్గించుకునే తొలి చర్యగా దిగుమతి సుంకాలు భారీగా పెంచారు. కెనడా కూడా ప్రతిచర్య తీసుకుంది. కెనడాలో ఎన్నికల ప్రచారకాలంలో కూడా ట్రంప్ కెనడాను అమెరికాలో కలుపుకునే ప్రకటనలు చేశారు. కెనడాకు ట్రంప్ డూప్లికేట్‌గా పరిగణించబడిన మితవాది పోయ్‌లీవ్రీ పార్టీని ఈ నేపథ్యంలో తిరస్కరించారు.

ఇప్పుడు ఏమి జరగబోతుంది? అమెరికా, భారత్‌లతో కెనడా సంబంధాలు మెరుగుపడతాయా? కెనడాలో అనేక తరాలుగా సిక్కులు స్థిరపడ్డారు. ఖలిస్థానీ తీవ్రవాదులు కూడా వారిలో ఉన్నారు. సిక్కులకు రాజకీయ ప్రభావం కూడా ఉంది. ట్రూడో వారిపై ఆధారపడినందుకే భారత ప్రభుత్వంతో వైరం తెచ్చుకున్నారు. కెనడా పౌరుడైన ఒక సిక్కు తీవ్రవాది హత్య విషయంలో భారత ఇంటెలిజెన్స్ హస్తముందన్న అక్కడి సిక్కు నాయకుల ఆరోపణను ప్రధాని ట్రూడో పునశ్చరణ చేయటంతో భారత్–కెనడా సంబంధాలు దెబ్బతిన్నాయి. ఆ తప్పును దిద్దుకునేందుకు ట్రూడో ప్రయత్నించినా అప్పటికే ఆలస్యమైంది. ఎన్నికల ఫలితాలు రాగానే ప్రధాని నరేంద్ర మోదీ కెనడా ప్రధాని కార్నీకి ఫోన్‌చేసి అభినందనలు తెలిపారు. త్వరలో కలుసుకుందామన్నారు. జూన్‌లో జి7 సమావేశానికి కెనడా ఆతిథ్యమిస్తున్నది. దానికి భారత్‌ను కెనడా ఆహ్వానించి విభేదాల పరిష్కారానికి, సంబంధాల మెరుగుదలకు బాట వేయవచ్చు. అలాగే సుంకాలతో దాడిచేస్తున్న ట్రంప్ విధానం స్వదేశంలో కూడా తీవ్ర నిరసనకు గురవుతున్నది. చైనా, కెనడా, మెక్సికోలతో సుంకాలపై చర్చలకు ట్రంప్ సిద్ధంగా ఉన్నారు. బెదిరించి లొంగదీసుకునే ట్రంప్ విధానం బెడిసికొడుతున్నందున, కెనడా ప్రధాని కూడా ట్రంప్‌తో సంభాషణలతో సంబంధాల మెరుగుదలకు ప్రయత్నించవచ్చు.

# వచ్చే ఎన్నికలకు రేవంత్ 'మాస్టర్ ప్లాన్'!



ఎస్‌కె. జకీర్
సీనియర్ జర్నలిస్ట్

''ఎన్నికలకు ఆరు నెలల ముందు మా ప్రభుత్వం గురించి ప్రజల్లో చర్చ జరుగుతుంది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన పథకాలు ఏ రాష్ట్రంలోనూ అమల్లో లేవు. వీటిపైనే వచ్చే ఎన్నికల్లో చర్చ జరుగుతుంది''అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల మీడియాకు చెప్పారు. ''రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న అనర్థాలకు మాజీ సిఎం కెసిఆరే కారణమని, తెలంగాణ రాష్ట్ర ఖజానా మొత్తాన్ని లూటీ చేసి ఇప్పుడు తమపై నిందలు వేస్తున్నారు''ని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. నిజంగానే కెసిఆర్ హయాంలో పదేళ్ల విధ్వంసాన్ని సరిచేయడానికే రేవంత్‌కు ఏడాది పట్టింది. పథకాల ప్లానింగ్‌కు ఏడాదిన్నర సరిపోయింది. ఇక వాటి అమలుపై పూర్తిస్థాయిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టి సారించాలనుకుంటున్నారు.

కెసిఆర్ పార్టీ పూర్తిగా సోషల్ మీడియాపై ఆధారపడుతున్నట్లుగా బిఆర్ఎస్ రజతోత్సవ వేళ జరిగిన సభలో మాటల్ని బట్టి అర్థమవుతోంది. ప్రజలతో సంబంధాలు పూర్తిగా తెగిపోయాక, వాటిని పునరుద్ధరించడం అంత సులభం కాదు. ప్రజలపట్ల నిజమైన ప్రేమ చూపాలి. ప్రజలకోసం తాము పనిచేస్తున్నట్లుగా రుజువు చేసుకోవాలి. చేసిన తప్పులకు క్షమాపణలు చెప్పుకోవాలి. వాటిని మళ్ళీ చేయబోమన్న హామీ ఇవ్వగలగాలి. నిజాయితీగా ఆత్మ విమర్శ చేసుకోవాలి. అటువంటిదేమీ కెసిఆర్, కెటిఆర్ లో కనిపించడం లేదు.

''తప్పులు లేకుండా ముందుకు సాగలేరు. తప్పులు చేయడం తప్పనిసరి. తప్పుల నుంచి నేర్చుకోకుండా ప్రజలకు సరైన డైరెక్షన్ ఇవ్వలేం''అని మావో అన్నాడు. కెసిఆర్, ఆయన కుటుంబం చేసిన తప్పులు అన్నీ, ఇన్నీ కావు.

తెలంగాణ మొత్తాన్ని 'ఫార్మ్ హౌజ్ సంస్కృతి'తో బంధించారు. ఒక్క హైదరాబాద్ నగరంలోనే కాదు. ఈ నడమంత్రపు విలాస సంస్కృతి జిల్లాలకూ ఎగబాకింది. బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలుగా, నాయకులుగా పనిచేసిన, చేస్తున్న వారందరికీ ఎక్కడో ఒక చోట ఫార్మ్ హౌజ్‌లు ఉన్నట్టు ఆరోపణలున్నాయి. అంతగా వారందరికీ సంపద వచ్చి పడింది. ఏ తప్పూ చేయలేదని కెసిఆర్, కెటిఆర్ వాదన. తెలంగాణను సుభిక్ష రాష్ట్రంగా మార్చి పారేశామని అంటున్నారు. రేవంత్ రెడ్డి వచ్చి రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తున్నట్టు వారి ఆరోపణ.

కాగా ''కెసిఆర్ ఫార్మ్ హౌజ్‌లో ఉంటూనే తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలో నెంబర్ 1 చేశారు. దేశానికి దిక్సూచిగా మార్చారు. ప్రజలు అడగని పథకాలను అమలు చేశారు. దమ్ముంటే సిఎం రేవంత్ రెడ్డి రాజీనామా చేసి, ఇప్పుడు రాష్ట్రంలో ఎన్నికలు నిర్వహించాలి. తెలంగాణ ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. ఈ ప్రభుత్వాన్ని అత్యవసరంగా శిక్షించాలని ప్రజలు భావిస్తున్నారు'' అని మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఏప్రిల్ 30న ఒక ప్రకటన విడుదల చేశారు. 'ఎన్నికలు ఇప్పటికిప్పుడు జరగాలి. కెసిఆర్ ముఖ్యమంత్రి అవుతారు. ఆయన ఫార్మ్ హౌజ్ నుంచే పరిపాలిస్తారు తప్పేమిటి' అని నిరంజన్ రెడ్డి ప్రకటన సారాంశం. ఆయన ప్రకటనకు ప్రజలు కన్విన్సు అవుతారా? అనే ప్రశ్న తలెత్తుతుంది.

'తాము మళ్ళీ అధికారంలోకి వచ్చినా దొరల పాలనే' చేస్తామని బాహాటంగా రొమ్ము విరుచుకొని మాట్లాడుతున్నారంటే తెలంగాణ ప్రజల పట్ల వాళ్లకున్న ద్వేషం, ఆగ్రహం, చులకన భావం ఏ స్థాయిలో ఉన్నాయో అంచనా వేయవచ్చు. కెసిఆర్‌ను ఓడించి ప్రజలు తప్పు చేశారనో, ఏమి కోల్పోయారో వాళ్ళకిప్పుడు అర్థమవుతున్నదనో కెసిఆర్, కెటిఆర్ వ్యాఖ్యలకు నిరంజన్ రెడ్డి పత్రికా ప్రకటన కొనసాగింపుగా భావించాలి. ఏ రాష్ట్రంలోనూ ఇలాంటి వైఖరి కనిపించదు. తెలంగాణకే ప్రత్యేకం. ముఖ్యమంత్రి సెక్రటేరియట్‌కు రాకుండా ప్రగతి భవన్ పేరిట నిర్మించుకున్న 'గడీ' నుంచి అయినా, ఫార్మ్ హౌజ్ నుంచి అయినా పరిపాలించగలిగిన ధైర్యం కెసిఆర్‌కు మాత్రమే ఉన్నది. ప్రజలతో సంబంధాలు లేకుండా 'కటాఫ్ ఏరియా'కు వెళ్ళిపోయినా ఆయన తప్ప మరొకరు తెలంగాణకు దిక్కు లేరని చేస్తున్న ప్రచారం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. పైగా బిఆర్ఎస్‌లో ఉంటేనో, ఆ పార్టీకి మద్దతిస్తేనో తెలంగాణ మనుషులని, ఆ పార్టీకి మద్దతివ్వని వ్యక్తులెవరైనా వారు 'తెలంగాణ ద్రోహులు', 'చంద్రబాబు బానిసలు' అని ఈ మధ్య కొందరు నకిలీ విశ్లేషకులు బిఆర్ఎస్ పక్షాన వకాల్తా పుచ్చుకొని చెండాడుతున్నారు. కెసిఆర్ మళ్ళీ అధికారంలోకి రాకూడదని కోరుకునే వారంతా తెలంగాణకు చెందిన వారు కాదని బల్లగుద్ది వాదిస్తున్నారు. ఇలాంటి వాళ్ళ పట్ల బిఆర్ఎస్ నాయకత్వం అప్రమత్తంగా లేకపోతే జరిగే నష్టం గురించి చెప్పడం అనవసరం.

కెసిఆర్ లాగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా గట్టి 'పంచ్'లు విసురుతున్నారు. అందులో భాగంగానే ''కెసిఆర్ వలె లాంచింగ్, క్లోజింగ్, షోపుటప్ పథకాలు మా ప్రభుత్వంలో ఉండవు'' అని సిఎం



అన్నారు. కెసిఆర్ హయాంలో డబుల్ బెడ్ రూమ్, దళితబంధు సహా పెక్కు కార్యక్రమాలు అట్టహాసంగా ప్రకటించడం, తర్వాత వాటిని అటకెక్కించడం ప్రజలకు తెలుసు.

''రేవంత్ చెప్పింది చేస్తాడనే నమ్మకం ప్రజల్లో కలిగిస్తా. నన్ను నమ్ముకున్నోళ్లను ఎన్నడూ మర్చిపోను. అద్దంకి దయాకర్‌కు ఎమ్మెల్సీ ఇస్తానని చెప్పా. ఆయన ఓపిగ్గా నన్నే నమ్ముకుని ఉన్నాడు. ఆయనకు ఎమ్మెల్సీ పదవి వచ్చింది. అద్దంకి దయాకర్‌లాగా ఓపిగ్గా ఉంటే నాకూ బాధ్యత ఉంటుంది. అలా కాకుండా బయట ఎక్కడయినా స్వీపింగ్ రిమార్కులు చేస్తే నాకెలాంటి బాధ్యత లేదు.''

రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న అనర్థాలకు మాజీ సిఎం కెసిఆరే కారణమని, తెలంగాణ రాష్ట్ర ఖజానా మొత్తాన్ని లూటీ చేసిన ఆయన ఇప్పుడు తమపై నిందలు వేస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మండిపడ్డారు. పదేళ్ల పాలనలో కెసిఆర్ చేసిన విధ్వంసాన్ని సరిదిద్దడానికి తమకు ఏడాదికి పైగా పట్టిందన్నారు. ఏడాదిన్నర కాలం పథకాలను ప్రణాళిక చేసుకోవడానికి సరిపోయిందని ఇక వాటి అమలుపై పూర్తి స్థాయిలో దృష్టి పెడతానని చెప్పారు.. తాను కక్ష సాధింపు చర్యలకు దిగబోనని స్పష్టం చేశారు. కెటిఆర్ మీద కేసు.. ఫోన్ ట్యాపింగ్ తదితర కేసులన్నింటిపైనా విచారణ చట్ట పరిధిలోనే జరుగుతుందన్నారు. తాను చట్ట ప్రచారమే పని చేస్తానని, కెసిఆర్‌లాగా చట్టాన్ని అతిక్రమించి అరెస్టులు చేయించబోనని చెప్పారు. బిఆర్ఎస్‌కు పదేళ్ల అవకాశం ఇచ్చిన ప్రజలు..తమకూ పదేళ్లు ఇస్తారని అన్నారు.

'తిన్నామా.. పడుకున్నామా..తెల్లారిందా..'అనే ధోరణి కొందరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలలో కనిపిస్తున్నది. 'ప్రభుత్వం మనదే కదా' అనే భావనతోనే ఉన్నారు కానీ మరలా తాము గెలవవలసి ఉందని, మెజారిటీ సీట్లు వస్తేనే తిరిగి అధికారంలోకి రాగలమని పలువురు ఎమ్మెల్యేలు అనుకోవడం లేదు. కొందరు మంత్రులు, ఎమ్మెల్యేలు భారమంతా రేవంత్ రెడ్డిదే అని అంటున్నట్టు సమాచారం అందుతోంది. 'ముఖ్యమంత్రిగా రేవంత్ అన్నీ చూసుకుంటారు' అనే వైఖరి ఎంత మాత్రం సబబు కాదు. రేవంత్ ప్రభుత్వం సుస్థిరంగా, పటిష్టంగా ఉండడానికి ఎమ్మెల్యేల సంపూర్ణ సహకారం సిఎంకు అవసరం. ఎమ్మెల్యేల మంచీ, చెడూ చూసుకునే బాధ్యత సిఎంపైన ఉన్నది. పలువురు అధికారపక్షం ఎమ్మెల్యేల పనితీరుపట్ల చాలాకాలంగా సిఎం అసంతృప్తిగా ఉన్నారు. సిఎల్పీ సమావేశాల్లోనూ వాళ్ళ పనితీరు మార్చుకోవాలని, ప్రజల్లోనే ఉండాలని హితబోధ చేసినా ఎమ్మెల్యేలు ఖాతరు చేయడం లేదని పార్టీ వర్గాలలో వినిపిస్తోంది.

రేవంత్ రెడ్డి ఎన్నిసార్లు హితవు చెప్పినా చాలామంది పాత పద్ధతిని విడిచిపెట్టడం లేదు. నియోజకవర్గాల్లో తక్కువ సమయం గడుపుతూ,హైదరాబాద్‌లోనే మకాం వేయడం వల్ల పార్టీకి ఇప్పటికే చాలా డ్యామేజ్ అయిందని ఇంటెలిజెన్స్ అధికారవర్గాలు ముఖ్యమంత్రికి నివేదికలందించారని తెలుస్తోంది. బిఆర్ఎస్, బిజెపితో పోల్చితే సోషల్ మీడియాలో కాంగ్రెస్ చాలా వెనుకబడి ఉందన్న సంగతి కొత్తదేమీ కాదు. కొందరు మంత్రులు, నాయకులు ఎవరికివారే తమ సొంత ఇమేజ్‌ను పెంచుకునేందుకు సోషల్ మీడియా బృందాలను ఏర్పాటు చేసుకొని నడిపిస్తున్నట్టు తెలుస్తోంది. వాటిలో ఎక్కడా ప్రభుత్వ ప్రస్తావన కానీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రస్తావన కానీ లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఒక మంత్రికి చెందిన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో పొరపాటున ఒక కార్యకర్త ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫోటో జత పరచినందుకు సదరు మంత్రి, ఆ కార్యకర్తపై నిప్పులు చెరిగి అతన్ని తొలగించినట్లు తెలిసింది.


కాంగ్రెస్ పార్టీ తరపున గెలిచిన ప్రతి ఎమ్మెల్యే, మంత్రి పదవి ఆశించడం, మూడు నాలుగు సార్లు అదివరకే ఎమ్మెల్యేగా గెలిచి ఉంటే సిఎం రేసులో ఉండడం ఆ పార్టీకి దశాబ్దాలుగా పట్టి పీడిస్తున్న సమస్య. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన మంత్రు లు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి ముఖ్యమంత్రి పదవికి సమర్థులని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల రెడ్డి అంటున్నారు. రాజగోపాలరెడ్డి మంత్రిపదవి కోసం తీవ్రంగా పోటీ పడుతున్నారు. మంత్రివర్గ విస్తరణ జాప్యమవుతున్న కొద్దీ ఆయన అసహనం వ్యక్తం చేస్తున్నారు. బిజెపి నుంచి కాంగ్రెస్‌లో చేరే సమయంలోనే తనకు మంత్రి పదవి హామీ ఇచ్చినట్టు కోమటిరెడ్డి రాజగోపాలరెడ్డి బలంగా వాదిస్తున్నారు. చెన్నూరు ఎమ్మెల్యే డాక్టర్ వివేక్ వెంకటస్వామి కూడా అలాంటి వాదనే చేస్తున్నట్టు ప్రచారం.

మంత్రివర్గ విస్తరణపై పార్టీ హైకమాండ్ తుది నిర్ణయం తీసుకోవలసి ఉన్నది. ఈ జాప్యానికి సిఎం రేవంత్ రెడ్డి కారణం కాదని తెలిసినా, ఆయనపై అసంతృప్తి, అలకలు ప్రదర్శించడానికి ఆశావహులు ప్రయత్నిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు నియోజక వర్గాల్లోనే ఉండి అవసరమైనప్పుడు మాత్రమే హైదరాబాద్‌కు రావాలని ఎవరూ ప్రత్యేకంగా కోరనవసరం లేదు. వారు ప్రజల్లోకి వెళితేనే పథకాలూ ప్రజల్లోకి వెళతాయి. ''ఎమ్మెల్యే అయ్యాక మనోడు, మందోడు అనేది ఉండదు'' అని సిఎం రేవంత్ రెడ్డి ఏప్రిల్ 28న అన్నారు. ఆయన వ్యాఖ్యల్లో ఆవేదన ఉన్నది. కానీ కొందరు ఎమ్మెల్యేలు మినహా మెజారిటీ ఎమ్మెల్యేలు తమ 'ఫెర్ఫార్మెన్స్' మెరుగుపరచుకునే ప్రయత్నాలు చేయడం లేదని పార్టీ కార్యకర్తలు చెబుతున్నారు. ఎమ్మెల్యేలు ఎవరు ఏం చేస్తున్నారో సిఎం రేవంత్ రెడ్డి దగ్గర పక్కా సమాచారం ఉంది. అలాంటి సమాచార వనరులు, గూఢచర్యం గురించిన మెళకువలు లేకపోతే కెసిఆర్ వంటి పర్వతాన్ని కూల్చిపారవేయడం ఆయనతో జరిగే పని కాదు.

# సింధు జలాల ఒప్పందం రద్దు... కొత్త చరిత్రకు శ్రీకారం

*'అహింస శక్తివంతమైన శస్త్రం, యుద్ధంతో శత్రువుని కాదు, శాంతితో మనిషిని గెలవాలి'.* – *ఆచార్య వినోబా భావే*

ఈ నెల 22న కాశ్మీర్‌లోని పహల్గాం బైసరన్ వాలీలో పాకిస్తాన్ ప్రేరేపిత టిఆర్ఎఫ్‌కు చెందిన ఉగ్రవాదులు 26 మంది అమాయక భారత పర్యాటకులను విచక్షణారహితంగా కాల్చి చంపిన హేయమైన చర్య పై భారత్ తీవ్రంగా స్పందించింది. దేశమంతటా ఆగ్రహ జ్వాలలు, నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. ఈ సంఘటన ఫలితంగా భారత ప్రభుత్వం 60 ఏళ్ల క్రితం పాకిస్థాన్‌తో కుదుర్చుకున్న సింధు జలాల పంపిణీ ఒప్పందాన్ని నిలిపివేయాలని నిర్ణయించింది. ప్రపంచ బ్యాంకు మధ్యవర్తిత్వంతో ఈ ఒప్పందం జరిగింది. ఈ నిర్ణయంతో పాకిస్తాన్‌లో కలకలం రేగి వెన్నులో వణుకు పుట్టింది. 1960 నుండి పాకిస్తాన్ భారత్‌తో యుద్ధాలు చేసినప్పటికీ ఎంతో సంయమనంతో వ్యవహరించిన భారత్ ఇండస్ వాటర్ ట్రీటీని ఎప్పుడు భంగపరచలేదు. పాకిస్తాన్ ఈ విషయాన్ని మర్చిపోయి



విద్వేషపూరితంగా వ్యవహరించడం ద్వారా ఇప్పుడు భారీ మూల్యం చెల్లించుకోక తప్పని పరిస్థితి ఏర్పడింది. ఈ ఒప్పందం పాకిస్తాన్ నెత్తిన పిడుగులు పడ్డ చందంగా మారింది. టెర్రరిస్టులను, ఉగ్రవాదాన్ని పెంచి పోషించిన స్వయంకృతాపరాధ ఫలితంగా పాకిస్తాన్ తన జీవనాడులు తెగిపోయే ప్రమాదం కొని తెచ్చుకుంది.

**సింధు జలాల ఒప్పందం**

1947లో భారతదేశ విభజన తర్వాత ఇండస్ నదీ వ్యవస్థ భారత్ పాక్ మధ్య విభజింపబడింది. ఇది నేటి వివాదాలకు కారణమయ్యింది. ఇరిగేషన్ విధానాల్లో హెడ్ వర్క్స్ భారతదేశంలో ఉండగా కాల్వలు పాకిస్తాన్‌లో ఉన్నాయి. 1948లో స్టాండ స్టిల్ అగ్రిమెంట్ ముగిసిన తర్వాత మే 4, 1948లో ఇంటర్ డొమినియన్ ఒప్పందానికి దారితీసింది.

1951లో రెండు దేశాలు సింధు వ్యవస్థపై నీటిపారుదల ప్రాజెక్టులకు నిధులు మంజూరు చేయాలని ప్రపంచ బ్యాంకును కోరాయి. ప్రపంచబ్యాంకు మధ్యవర్తిత్వంగా భారత్, పాక్ మధ్య సింధు జలాల ఒప్పందం జరిగింది. 1960 సెప్టెంబర్ 19న కరాచీలో ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, పాకిస్తాన్ అధ్యక్షుడు అయూబ్ ఖాన్ ఈ ఒప్పందంపై సంతకం చేశారు. ప్రపంచ బ్యాంకు మాజీ ఉపాధ్యక్షుడు W.A.B. ఇలిఫ్ కూడా పాల్గొన్నారు. ఇరుదేశాల మధ్య సద్భావన, స్నేహస్ఫూర్తితో నిర్ణయించి అంగీకరిస్తూ ముందు అవసరాలకు సహకార స్ఫూర్తితో పరిష్కరించుకోవడమే ధ్యేయంగా ఇరు ప్రభుత్వాలు చేసుకున్న ఒప్పందం అది.

**సింధూ జలాల వ్యవస్థ**

తూర్పు నదులైన సట్లేజ్, బియాస్, రావి నదుల పై భారతదేశానికి అనియంత్రిత వినియోగం కేటాయించింది. పశ్చిమ నదులైన సింధు, జీలం, చీనాబ్ నదుల నీటి వినియోగంపై పాకిస్తాన్‌కు అపరిమిత హక్కులు ఉన్నప్పటికీ ఇండస్ వాటర్ ట్రీటీ (IWT) యొక్క అనుబంధం సి,డి ద్వారా భారత్‌కు వ్యవసాయ ఉపయోగాలకు రన్ ఆఫ్ ద రివర్ (నీటి నిలువ లేకుండా) జల విద్యుత్ ప్రాజెక్టులు నిర్మించడానికి అనుమతినిస్తుంది. సింధూ నది పాకిస్తాన్‌లో 47%, భారత్‌లో 39 శాతం, టిబెట్‌లో 8%, ఆఫ్ఘాన్‌లో 6% గుండా ప్రవహించే అతి పొడవైన అంతర్జాతీయ నది. సింధూ నది వ్యవస్థ ద్వారా ప్రవహించే నీటిలో దాదాపు 70% పాకిస్తాన్ తాగునీటికి, వ్యవసాయానికి, గృహ అవసరాలకు ఇస్తుంది. 30% శాతం భారతదేశానికి లభిస్తుంది. ప్రపంచంలోనే అత్యంత ఉదారమైన నీటి భాగస్వామ్య ఒప్పందం ఫలితంగా 70శాతం పాకిస్తాన్‌కు నీటి కేటాయింపుతో అసమాన జలాల భాగస్వామ్యం ఏర్పడింది. సింధు జలాల ఒప్పందం నుండి చట్టబద్ధంగా నిష్క్రమించే అవకాశం భారతదేశానికి ఉంది. VCLT (వియన్నా ఒప్పంద చట్టంపై సమావేశం–1969) ఆర్టికల్ 60 ఇతర పార్టీల ద్వారా ఏవైనా ముఖ్యమైన ఉల్లంఘనలు జరిగితే ఒప్పందం ఉపసంహరించుకోవడానికి, పునఃసమీక్షకు అనుమతిని ఇస్తుంది. సింధు జలాల ఒప్పందం నిష్క్రమణకు ఎటువంటి నిబంధన లేని, గడువు తేదీలేని, శాశ్వతమైన ఒప్పందం. ఒప్పందం అమలు, పునరుద్ధరణకు ఎటువంటి నిబంధన లేదు. పాకిస్తాన్ కు చట్టపరంగా వాదించే మార్గం కూడా లేదు.

**సిమ్లా ఒప్పందం**

1971 నాటి బంగ్లాదేశ్ యుద్ధంలో పాకిస్తాన్ భారత్ చేతిలో ఓడిన తర్వాత ఈ సంధి కుదిరింది. ఈ యుద్ధంలో తూర్పు పాకిస్తాన్ గా పిలవబడే విభాగం పాకిస్తాన్ నుండి వేరుపడి బంగ్లాదేశ్ గా ఏర్పడింది. భారత్–పాక్ మధ్య ద్వైపాక్షిక సంబంధాల కోసం సిమ్లా ఒప్పందంపై ప్రధానమంత్రి ఇందిరాగాంధీ, పాకిస్తాన్ అధ్యక్షుడు జుల్ఫికర్ అలీ భుట్టో 1972 జూలై రెండున సిమ్లాలో సంతకం చేశా రు. ఈ ఒప్పందం 17 డిసెంబర్ 1971 నాటి కాల్పుల విరమణ రేఖను భారత్, పాక్ మధ్య(LOC) నియంత్రణ రేఖగా మార్చింది. ఐక్య రాజ్య సమితి చార్టర్ ప్రకారం ఒకరి ప్రాదేశిక స్వాతంత్రానికి, సమగ్రతకు వ్యతిరేకంగా మరొకరు పనిచేయరాదు. ఈ రేఖను ఇరువైపులా ఏకపక్షంగా మార్చకూడదని అంగీకరించబడింది. ద్వైపాక్షిక చర్చల ద్వారా శాంతియుతంగా విభేదాలు పరిష్కరించుకోవాలని నిర్ణయించుకున్నాయి. పహల్గాం ఉగ్రవాద దాడుల తర్వాత భారత్ తీసుకున్న కఠినమైన నిర్ణయాలకు ప్రతిస్పందనగా పాకిస్తాన్ గురువారం 1972 సిమ్లా ఒప్పందాన్ని రద్దు చేసింది. పాక్ తన అసంబద్ధ నిర్ణయంతో తన నిజస్వరూపాన్ని బయటపెట్టుకుంది.

**సవాళ్లు**

అణ్వాయుధ సున్నిత ప్రాంతాల్లో సమస్యలు తలెత్తవచ్చు. చైనా అఫ్గాన్ ల ప్రభావం కనబడుతుంది. ఏకపక్ష ఒప్పంద ఉపసంహరణల వల్ల అంతర్జాతీయంగా ప్రభావితమయ్యే అవకాశం ఉంటుంది. కొత్త గా నిర్మిస్తున్న ఆనకట్టలు, జల విద్యుత్ ప్రాజెక్టుల పురోగతిపై ప్రభావం చూపవచ్చు. ఒకప్పుడు సహకారానికి చిహ్నంగా ఉన్న సింధూ నదీ జలాలు ఇప్పుడు రక్తం మరియు నీరు కలిసి ప్రవహించ లేవు అనే సంఘర్షణ వాతావరణానికి కేంద్రంగా నిలుస్తున్నాయి. పాకిస్తాన్ ఇకనైనా తన వక్ర రాజకీయాలను మానుకొని భారత్‌తో సత్సంబంధాలు నెలకొల్పు కోవడమే ఏకైక శరణ్య మార్గం. భారత్ – పాక్ యుద్ధాలు (1965,1971, 1999)ముఖ్యంగా ఉరి(2016) పుల్వామా(2019) పహల్గాం(2025) వంటి ఉగ్రవాదుల దాడుల తర్వాత పెరుగుతున్న ప్రజా మరియు రాజకీయ ఒత్తిళ్ల మధ్య భారత్ తన నదులపై సార్వభౌమహక్కులను నొక్కి చెప్పడాన్ని భారత్ తీసుకున్న ఈ సింధు జలాల ఒప్పందం రద్దు నిర్ణయం ప్రతిబింబిస్తుంది. ఉగ్రవాదాన్ని కూకటి వేళ్ళతో పెకిలించడానికి భారత్ దృఢ నిశ్చయంతో ముందుకు వెళుతోంది. ఇది ప్రపంచ రాజకీయాల్లో శాంతి మార్గానికి మలుపును సూచిస్తుంది.

వెంకటరమణ గిలకత్తుల.
9866 878769.

# మావోయిస్టులతో చర్చలు – ప్రజాస్వామ్యం

దేశంలోని ప్రధాన మీడియా ప్రస్తుతం రెండు అంశాలను తీవ్రంగా చర్చిస్తున్నది. ఒకటి కాశ్మీరులోని పహల్గాంలో ఉగ్రవాద హంతక ముఠా అమాయకులను అమానుషంగా చంపిన సంఘటన కాగా రెండోది మావోయిస్టులని ఏరివేయటానికి వేలాది కేంద్ర బలగాలు కర్రిగుట్టలను దిగ్బంధం చేయటం. ఈ విషయాలనే జనం కూడా చర్చించుకుంటున్నారు. రెండింటిని ఒకే గాట కట్టలేము. కాశ్మీర్లో జరిగిన కిరాతకం నిర్దాక్షిణ్యంగా అణచివేయాల్సిందే. వారితో చర్చలు అంటూ ఏమీ లేవు, వారు దేశ శత్రువులు. కానీ మావోయిస్టు సమస్య అలాంటిది కాదు. మావోయిస్టులు మన పౌరులు. మన పౌర సమాజంలో వచ్చిన అసంతృప్తి, అన్యాయాలకు సంబంధించిందిన అంశాలపై వారు పోరాడుతున్నారు. వారి సమస్య మన పరిధిలో ఉన్నదే. ఈ మధ్యకాలంలో మావోయిస్టులు కూడా తమ పోరాటాన్ని ఆపి ప్రభుత్వంతో చర్చలకు రావటానికి సిద్ధపడటం అనేది ఒక మంచి పరిణా మం. దీనిని అందిపుచ్చుకొని ప్రభుత్వం సామరస్య పూర్వకంగా చర్చలు జరిపి సమాజంలో ప్రజాస్వామ్య వ్యవస్థను పటిష్టపరచటానికి దోహదపడాలని విజ్ఞులు కోరుకుంటున్నారు.

మనకు అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం మావోయిస్టుల ప్రధాన కేంద్రాలను వేలాది కేంద్ర బలగాలు చుట్టుముట్టాయని, వారు ప్రస్తుతం స్థావరాలుగా ఏర్పాటు చేసుకున్న కర్రెగుట్టలను పూర్తిగా కేంద్రబలగాలు స్వాధీనం చేసుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. గత నాలుగు రోజుల్లోనే 40 మందికి పైగా చనిపోయినట్లు తెలుస్తుంది. మావోయిస్టు ముఖ్య నాయకత్వం అంతా దిగ్బంధంలో ఉన్నట్లు కూడా అర్థమవుతుంది. ఇప్పుడు ఏం జరుగుతుందో అని ఆందోళనతో జనాలు ఎదురుచూస్తున్నారు. 2026 మార్చి 31 నాటికి దేశంలో మావోయిస్టులను లేకుండా చేస్తానని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పదేపదే ప్రకటనలు చేస్తున్నాడు. నక్సలైట్లు ఇంత క్లిష్టమైన పరిస్థితిని వారి చరిత్రలో ఎప్పుడు ఎదుర్కోలేదు. ఇంత ఆత్మ రక్షణ స్థితిలోకి నెట్టబడింది ఎప్పుడూ లేదు. అయితే ఈ పరిణామాలన్నింటితో బాగా నష్టపోతుంది మాత్రం ఆదివాసీలే. మావోయిస్టు దళాలలో ఎక్కువగా ఉన్నది ఆదివాసీలే. కాబట్టి చనిపోయిన వారిలో కూడా వారే ఎక్కువగా ఉంటున్నారు. పోలీసు వారికి ఇన్ఫర్మేషన్ ఇస్తున్నారనే పేరిట మావోయిస్టులు కూడా అనేకమంది ఆదివాసులనే చంపారు. కేంద్ర బలగాల, మావోయిస్టుల రణరంగ క్షేత్రం మాత్రం దండకారణ్యమే. అక్కడి నివసించే వారిలో నూటికి 90 మంది ఆదివాసీలే. వారు అత్యంత పేదరికంతో నిరక్షరాస్యతతో అనారోగ్యాలతో అభివృద్ధి లేక అనాగరికంగా జీవిస్తున్నారు. ఎవరు గెలిచినా ఎవరు ఓడినా ఆదివాసుల జీవితాలలో పెద్ద మార్పు లేదు. పైగా ఇప్పుడు జరుగుతున్న పరిణామాలు అన్నీ కూడా వారి జీవితాన్ని మరింత దుర్భరం చేస్తున్నవి.


ఈ పరిస్థితిని గమనించి పౌర సమాజంలో ఉన్న మేధావులు, సామాజిక ఉద్యమకారులు, పౌర హక్కు ల నాయకులు, కవులు, రచయితలు ప్రభుత్వానికి మావోయిస్టు నాయకత్వానికి మధ్యవర్తిత్వం వహించి ఈపరిస్థితి మార్చాలని ప్రయత్నం చేస్తున్నారు. అందు కు జస్టిస్ చంద్ర కుమార్ నాయకత్వాన ఒక పీస్ కమిటీ కూడా ఏర్పాటు చేశారు. మావోయిస్టులు స్పందించి తాము కాల్పులు విరమణ చేస్తామని అవసరమైతే ఆయుధాలు విసర్జనపై కూడా చర్చిస్తామని ప్రకటించడం చాలా ప్రాధాన్యత కలిగిన అంశం. కేంద్ర ప్రభుత్వం ఈ అవకాశాన్ని అంది పుచ్చుకొని మావోయిస్టులతో గౌరవప్రదంగా చర్చలుచేసి వారు ప్రజాతంత్ర ఉద్యమంలోకి రావడానికి అవకాశం కల్పిస్తే బాగుండేది. కానీ కేంద్ర ప్రభుత్వం మొండిగా ఉంది.

**ఎన్నికలు – మార్క్సిస్టు మహోపాధ్యాయులు**

ఎన్నికల్లో పాల్గొనమని నేను మావోయిస్టులను అడిగినందుకు చాలామంది నాపై విమర్శలు చేస్తున్నారు. నన్ను విమర్శించే వారు ఎన్నికల గురించి మార్క్స్, ఏంగెల్స్, లెనిన్, మావో తదితర మార్క్సిస్టు మహోపాధ్యాయులు ఏం చెప్పారో ఒకసారి పరిశీలిద్దాం.

1848లో జర్మనీ చక్రవర్తి ఎన్నికల్లో కార్మిక వర్గం పాల్గొనాలా? వద్దా? అన్న సమస్య ఎదురైనప్పుడు, భూస్వామ్య ప్రతినిధులను ఓడించటానికి బూర్జువా ప్రతినిధులకే ఓటు వేయాలంటాడు మార్క్స్.

1850లో కమ్యూనిస్టు లీగ్ ఆమోదించిన పత్రాన్ని చూద్దాం:



21 సంవత్సరాలు నిండిన ప్రతి వ్యక్తికి ఓటు హక్కు ఉండాలి.

ఎన్నికైన పార్లమెంటు సభ్యులకు వేతనాలు ఇవ్వాలి.

కార్మిక వర్గం ఖచ్చితంగా ఎన్నికల బరిలోకి దిగాల్సిందే అని ఆ పత్రం పేర్కొన్నది.

ఎన్నికలను బహిష్కరించమని చెప్పటం అంటే బుర్జువా రాజకీయ పార్టీల కౌగిలిలోకి కార్మిక వర్గాన్ని పంపటమే అంటారు. అన్ని దేశాలలో కార్మిక వర్గ పార్టీలు ఏర్పడుతున్నాయి. ఎన్నికల వ్యవస్థలు వస్తున్నాయి. గెలిచినా ఓడినా అన్ని స్థానాల్లో కార్మిక వర్గం పోటీ చేయాలి అంటారు.

రష్యాలో జారు రాచరిక ప్రభుత్వం ఉండేది. రాచరికం పోవాలని ప్రజాస్వామ్య ప్రభుత్వం రావాలని, ఎన్నికలు జరగాలని 'డూమా'ను ఏర్పాటు చేయాలని 1905లో రష్యాలో పెద్ద ఎత్తున ఉద్యమాలు జరిగినాయి. పీటర్స్ బర్గ్‌లో జనవరి 9, 1905లో జరిగిన కార్మికుల ప్రదర్శన ఒక మూల మలుపుగా చెప్పవచ్చు. ఎన్నికలు కావాలని జరిగిన పోరాటంలో అనేకమంది కార్మికు లు ప్రాణాలు అర్పించాల్సి వచ్చింది. అనివార్య పరిస్థితుల లో జారు దిగివచ్చి 1906 ఫిబ్రవరిలో ఎన్నికలు జరుగుతాయని ప్రకటించాడు. కానీ ఒక మెలిక పెట్టాడు. జరగబోయే ఎన్నికల్లో కార్మికులకు, పేద రైతులకు ఓటు హక్కు ఉండదని ప్రకటించాడు. కార్మికులకి రైతులకు ఓటు హక్కు ఉండాలని మళ్ళీ పోరాటం చేసి కార్మిక వర్గం సాధించుకోవడం జరిగిం ది. ఎన్నికలకై పోరాటం చేయటం కూడా ఒక గొప్ప విప్లవం అని అందరికీ అర్థమైంది కూడా అప్పు డే.


చైనా విప్లవం 1921ల ప్రారంభమై 1949 వరకు జరిగింది. శత్రు సైన్యంతో వేలాదిమంది చనిపోవడం జరిగింది. అనారోగ్యాలతో ప్రాణాలు కోల్పోవటం జరిగింది. లాంగ్ మార్చ్ జరుగుతున్న సందర్భంగా మావోను అమెరికా జర్నలిస్టు ఎడ్గార్ స్నో 'ఇన్ని ప్రాణాలు కోల్పోకుండా విప్లవం సాధ్యం కాదా' అని మావోని అడుగుతాడు. అప్పుడు మావో 'మీ దేశం, బ్రిటన్, ఫ్రాన్స్, ఇటలీ తదితర యూరప్ దేశాల్లో ఉన్నట్టుగా మాకు కూడా ఎన్నికలు ఉన్నట్లయితే ఇంత రక్తపాతం జరగాల్సిన అవసరం ఏముండేది. ఇన్ని ప్రాణాలు పోవాల్సిన అవసరం ఏముండేది'. దేశంలో ఎన్నికల వ్యవస్థ లేనందుకు ఈ పరిస్థితికి నెట్టబడ్డామని 'ఎడ్గార్ స్నో' తో చెప్పారు. 'చైనాపై అరుణతార' అనే పుస్తకంలో ఎడ్గార్ స్నో యే రాసింది గమనించవచ్చు. మార్క్సిస్టు మహోపాధ్యాయులంతా ఎన్నికల్లో పాల్గొనటాన్ని వ్యతిరేకించలేదు, పైగా పాల్గొనాలని చెప్పారు.

**మారిన ప్రపంచాన్ని అర్థం చేసుకోవాలి**

ఎన్నికల్లో కూడా మనం ఎలా గెలవాలని మనం ఆలోచించాలి కదా!. ప్రజలందరూ ఎన్నికలను ఎందుకు ఆమోదిస్తున్నారు? అర్థం చేసుకోవాలి కదా !?. ఇంకా పాతకాలపు ఆలోచనలతోనే ఉంటే ఎలా? మారి న ప్రపంచాన్ని అర్థం చేసుకొని మనం మారకపోతే ఎలా? నేపాల్ అనుభవాలు, శ్రీలంక అనుభవాలు , లాటిన్ అమెరికా దేశాల అనుభవాలు ఏం చెప్తున్నాయో మనం నేర్చుకోవటానికి సిద్ధంగా లేకపోతే ఎలా? మావోయిస్టులను నేను పిరికివాళ్లనుకోవడం లేదు. త్యాగమూర్తులుగానే భావిస్తా. అంతకైతే వాళ్ళ ఆలోచ న విధానంలో తప్పు ఉంది. అది వాళ్ళు కూడా గుర్తిస్తున్నారు. అలా గుర్తించడం తప్పా? మార్క్సిజం అంటే నిరంతరం మార్పులకు అనుగుణంగా మార్పు చెందే సైన్స్. జడ పదార్థం కాదు. మేంపట్టిన కుందేటికి మూడే కాళ్లన్నట్టుగా ఉండకూడదు. రాచరికము, ని యంతృత్వం, ఫాసిజం ఉన్నపుడు, ఎన్నికలు లేనప్పు డు, సాయుధ పోరాటం అనివార్యమైన ఏకైక మార్గం. ఇప్పుడు ప్రజలకు ఎన్నికలనే ప్రత్యామ్నాయంగా కనబడుతుం ది. అది ఫలితం ఇవ్వని రోజున వారంతట వారే తగు నిర్ణయాలు తీసుకుంటారనే విశ్వాసం మనకు ఉండాలి.

తుపాకి పట్టిన వాడే విప్లవకారుడు, తుపాకీ పట్టటమే కాదు.. వర్గ శత్రువు కంఠాన్ని తెగ గోసి, ఆ రక్తంతో చేయి ముంచి 'మావో జిందాబాద్', 'విప్లవం వర్ధిల్లాలి' అని రాసిన వాళ్ళే విప్లవకారులు అన్న రోజులు లేవా? అవన్నీ మార్చుకుంటూ రాలేదా? ఇప్పుడు వాళ్ళ మారడాన్ని ఆహ్వానిద్దాం. అందుకే కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో చర్చ లు జరిపి వారు బయటికి రావడానికి తోడ్పడాల ని కోరుకుందాం. ఇది జరిగితే, ప్రపంచంలోనే పెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థగా పేరున్న మన భారతదేశ ప్రజాస్వామ్యానికి మరింత ప్రతిష్ట పెరుగుతుంది. ప్రజాస్వామ్యం మరింతగా పటిష్టపడుతుంది. మావోయిస్టులు బయటకు వచ్చిన తర్వాత, వారు ఎన్నికల్లో పాల్గొని శ్రీలంక, నేపాల్, లాటిన్ అమెరికా దేశాల లాగా వామపక్ష ప్రజాతంత్ర ఉద్యమంలో క్రియాశీలక పాత్ర వహిస్తారని ఆశిద్దాం.

జి.రాములు, గౌరవ అధ్యక్షులు
తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం
9490098006



# జాతీయం

NATIONAL & GENERAL NEWS

## జనన, మరణ రికార్డులతో ఓటర్ల జాబితా

**న్యూఢిల్లీ :** కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. జనన, మరణ రికార్డులతో ఓటర్ల జాబితాను అనుసంధానం చేయనున్నట్లు తెలిపింది. ఇందుకోసం రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా (ఆర్‌జిఐ) నుంచి మరణాల సమాచారాన్ని ఎలక్ట్రానిక్ రూపంలో ఎప్పటికప్పుడు తీసుకుంటామని వెల్లడించింది. తద్వారా అత్యంత కచ్చితత్వంతో ఓటరు జాబితాను నవీకరించే వీలుంటుందని పేర్కొంది. నమోదిత మరణాలకు సంబంధించిన సమాచారాన్ని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు (ఇఆర్‌ఒ) సకాలంలో పొందే వీలుంటుంది. చనిపోయిన వారి కుటుంబీకుల నుంచి విజ్ఞప్తి వచ్చేంతవరకు వేచి చూడకుండా.. ఆర్‌జిఐ నుంచి సమాచారం వచ్చిన వెంటనే బూత్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి సమాచారాన్ని ధ్రువీకరించుకుంటారు అని ఎన్నికల సంఘం వెల్లడించింది. ఎన్నికల నిబంధనలు1960, జనన, మరణాల నమోదు చట్టం1969 ప్రకారం ఎన్నికల సంఘానికి ఈ సమాచారాన్ని తీసుకునే అధికారం ఉంది.కాగా, ఓటరు సమాచార చీటీ (విఐఎస్) మరింత స్పష్టంగా కనిపించేందుకు వీలుగా దాని డిజైన్‌ను మార్చాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. సీరియల్ నంబర్, పార్టు నంబర్ల సైజును పెంచనున్నట్లు తెలిపింది.



## పహల్గామ్ మృతులకు అమరవీరుల హోదా ఇవ్వండి

### ప్రధాని నరేంద్ర మోదీకి రాహుల్‌గాంధీ విజ్ఞప్తి

**న్యూఢిల్లీ :** పహల్గామ్ ఉగ్రవాద దాడిలో మరణించిన వారికి అమరవీరుల హోదా ఇవ్వాలని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి విజ్ఞప్తి చేశారు. పహల్గామ్ దాడిలో మరణించిన వారి కుటుంబాలకు తాను అండగా నిలుస్తున్నానని, బాధితులకు అమరవీరుల హోదా ఇవ్వాలనే వారి డిమాండ్‌కు మద్దతు ఇస్తున్నానని గురువారం ఎక్స్‌లో పేర్కొన్నారు. పహల్గామ్ దాడిలో మరణించిన వారి కుటుంబాలకు అండగా ఉంటానని, వారి దుఃఖంలో పాలు పంచుకుంటానని, అమరవీరుల హోదా ఇవ్వాలనే డిమాండ్‌కు ఎప్పుడూ మద్దతు ఇస్తానన్నారు. ఈ విషాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు గౌరవం ఇవ్వడం ద్వారా వారి మనోభావాలను గౌరవించాలని ప్రధానమంత్రిని అభ్యర్థిస్తున్నాను అని రాహుల్ గాంధీ మైక్రోబ్లాగింగ్ ప్లాట్‌ఫామ్‌లో హిందీలో తన పోస్ట్‌లో పేర్కొన్నారు. రాయ్‌బరేలీకి చెందిన కాంగ్రెస్ ఎంపి బుధవారం కాన్పూర్‌లో పహల్గామ్ దాడి బాధితుడి కుటుంబ సభ్యులతో భేటీ అయ్యారు. మరణించిన వారికి అమరవీరుల హోదా కావాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నట్లు ఆయన చెప్పారు. 'నేను కాన్పూర్‌లో ఒక బాధితుడి కుటుంబాన్ని కలిశాను. వారు నరేంద్ర మోడీకి సందేశం పంపమని నన్ను అడిగారు. ఆ కుటుంబాలందరి తరపున, నేను ప్రధానమంత్రికి చెప్పాలనుకుంటున్నాను... ప్రధానమంత్రిజీ వారు మా పిల్లలు అమరవీరులయ్యారని చెప్పారు. వారికి అమరవీరుల హోదా ఇవ్వాలని, వారిని గౌరవించాలని మేము కోరుకుంటున్నాము' అని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకుడు కాన్పూర్‌లోని శుభం ద్వివేది కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పహల్గామ్ దాడి బాధితులకు న్యాయం జరిగేలా చూసేందుకు ప్రతిపక్షం ప్రత్యేక పార్లమెంటు సమావేశాన్ని డిమాండ్ చేస్తోందని అన్నారు.




## 'నీట్'పై అసత్యప్రచారం

### 106 టెలిగ్రామ్, 16 ఇన్‌స్టాగ్రామ్ చానళ్లపై ఎన్‌టిఎ చర్యలు

**న్యూఢిల్లీ :** వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్ (యుజి) పరీక్షకు సంబంధించి అసత్య ప్రచారం చేస్తున్న వారిపై ఎన్‌టిఎ చర్యలు చేపట్టింది. ఈ పరీక్షపై తప్పుదారిపట్టించే సమాచారాన్ని ఆన్‌లైన్‌లో ప్రచారం చేస్తున్న దాదాపు 120కి పైగా సామాజిక మాధ్యమ ఖాతాల్ని గుర్తించి కేసులు నమోదు చేసినట్లు సమాచారం. వీటిలో 106 టెలిగ్రామ్, 16 ఇన్‌స్టాగ్రామ్ చానళ్లు ఉన్నట్లు ఎన్‌టిఎ వర్గాలు పేర్కొన్నాయి. ఈ చానళ్లపై తదుపరి దర్యాప్తు కోసం కేసులను కేంద్ర హోం మంత్రిత్వ శాఖ పరిధిలోని సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్‌కు బదిలీ చేసినట్లు సమాచారం. అలాగే, అసత్య ప్రచారాన్ని, విద్యార్థుల్లో అనవసర భయాందోళనల్ని నివారించేందుకు ఈ చానళ్లను తొలగించాలని టెలిగ్రామ్, ఇన్‌స్టాగ్రామ్ సంస్థలను సైతం కోరినట్లు తెలుస్తోంది. నీట్ ప్రశ్నపత్రం గురించి తప్పుడు ప్రచారం చేసే అనధికార వెబ్‌సైట్‌లు/సోషల్ మీడియా ఖాతాలు; పరీక్ష కంటెంట్ యాక్సెస్‌కు సంబంధించి క్లెయిమ్ చేసే వ్యక్తుల గురించి ఫిర్యాదు చేసేందుకు ఎన్‌టిఎ ఇటీవల కొత్త వేదికను ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ పరీక్షకు సంబంధించి అనుమానాస్పద కంటెంట్ ప్రచారం చేసినట్లు గుర్తిస్తే ద్వారా రిపోర్టు చేయవచ్చని విద్యార్థులు, తల్లిదండ్రులకు సూచించింది. ఈ నేపథ్యంలో ఇప్పటివరకు 1500కు పైగా ఫిర్యాదులు అందగా.. వీటిలో అధిక భాగం టెలిగ్రామ్ ఛానల్ లింక్‌లే ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు, ఈ ఏడాది మే 4న జరగనున్న నీట్ యుజి పరీక్షకు రంగం సిద్ధం చేసింది. నీట్ అడ్మిట్ కార్డుల్ని నిన్ననే విడుదల చేసింది.

## ట్రంప్ వ్యతిరేక నినాదాలతో ప్రపంచవ్యాప్తంగా మే డే ర్యాలీలు

### ట్రంప్ దిష్టిబొమ్మలతో ఊరేగింపులు
### సైనిక వ్యయాలు తగ్గించి కార్మిక వేతనాలు పెంచండి
### ప్రపంచ కార్మికుల నినాదాలు



**చికాగో :** కార్మిక దినోత్సవం సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలలో మే డే ఉత్సవాలు, ప్రదర్శనలు జరిగాయి. ఈ సందర్భంగా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రప్ విధానాలకు వ్యతిరేకంగా ప్రపంచంలో ప్రతిచోటా కార్మికులు నినాదాలు చేశారు. కార్మికుల వేతనాలు పెంచాలని, సైనిక వ్యవయాలను గణనీయంగా తగ్గించాలని, గాజాలో తక్షణం కాల్పుల విరమణ చేయాలని, ఉక్రేన్ యుద్ధం ఆపాలని ప్రదర్శకులు డిమాండ్ చేశారు. ట్రంప్ దిష్టిబొమ్మలతో ఊరేగింపులు జరిగాయి. తమ బిడ్డలు భవిష్యత్తుపై ఆశతో బతికేందుకు తగిన వాతావరణం కల్పించాలని కార్మికులు నినదించారు. లాస్ ఏంజెల్స్‌లో అతిపెద్ద స్థాయిలో మే డే ప్రదర్శన జరిగింది. భారీ సంఖ్యలో కార్మికులు ర్యాలీలో పాల్గొన్నారు. భయంవ్యాప్తిచేసి అబద్ధాలతో బతుకుతున్న రాజకీయ నాయకులు, సంపన్నులకు వ్యతిరేకంగా తాము పోరాటం చేస్తున్నామని కార్మికులు ప్రకటించారు. వలస కార్మికులపై జరుగుతున్న దాడులను వారి అక్రమ తరలింపులను తీవ్రంగా ఖండించారు.

ఈ ఏడాది మే డే ఉత్సవాల్లో ట్రంప్ విధానాలను వ్యతిరేకించడమే ప్రధానాంశంగా, ప్రధాన ఎజెండాగా నిర్దేశించుకున్నట్లు నిర్వాహకులు చెప్పారు. కార్మికులు వేతనాలు పెంచాలని, మెరుగైన జీవన విధానానికి బాటలు వేయాలని ప్రభుత్వాన్ని, కర్మాగారాల యాజమానాలను డిమాండ్ చేశారు. చికాగో,ఫిలిప్పైన్స్, అర్జెంటైనా, జపాన్, ఫ్రాన్స్, జర్మనీ, చైనా తదితర అనేక దేశాలలో మే డే ఉత్సవ వేడుకలతోపాటు వేతనాలకోసం నిరసన ప్రదర్శనలు జరిగాయి. ఆసియావ్యాప్తంగా అనేక దేశాలలో మే డే ఉత్సవాలు, ప్రదర్శనలు జరిగాయి. లక్షలాదిమంది కార్మికులు పదర్శనల్లో పాల్గొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితి పరిస్థితులు రావడానికి ట్రంప్ కారణమని కార్మికులు నినాదాలు చేశారు. అమెరికాలోని చికాగో, కాలిఫోర్నియా, లాస్‌ఏంజెల్స్, న్యూయార్క్, ఫిలిడెల్ఫియా తదితర నగరాలలో భారీ ర్యాలీలు కార్మికులు నిర్వహించారు. ఇప్పటికే రెండుసార్లు ప్రజలు వీధుల్లోకి వచ్చి ట్రంప్ అనుసరిస్తున్న వలస విధానాలను, పొదుపు విధానాలను తీవ్రంగా ప్రతిఘటిస్తూ ప్రదర్శనలు జరిపారు. ఇప్పుడు మే డే ఉత్సవం సందర్భంగా కూడా ట్రంప్ విధానాలను వ్యతిరేకించడమే ప్రదర్శకులకు ప్రధాన ఎజెండాగా మారింది. ట్రంప్ వలస ప్రజలను లక్ష్యంగా చేసుకుని వారిని మాతృదేశాలకు తరిమికొట్టి వారి జీవనోపాధిని దెబ్బతీశారని, వారిని నేరస్థులుగా చిత్రీకరించారని ప్రదర్శకులు విమర్శించారు. అమెరికాలో ఫెడరల్ వర్కర్లను లక్ష్యంగా చేసుకుని వారిని ఉద్యోగాల్లోంచి వెళ్ళగొట్టడాన్ని విమర్శించారు. తైవాన్‌లో కూడా ప్రదర్శనలు జరిగాయి. ఫిలిప్పైన్స్‌లో కార్మిక నాయకుడు మోంగ్ పలటినో ఒక హెచ్చరిక చేస్తూ, ట్రంప్ చేస్తున్న టారిఫ్ యుద్ధంవల్ల స్థానిక పరిశ్రమలకు పెద్ద బెడదగా మారిందని, పరిశ్రమలు మూతపడే పరిస్థితి వచ్చిందని, ఈ విధానాలను వెనక్కు మళ్ళించాలని డిమాండ్ చేశారు. జపాన్వ్యాప్తంగా అనేకచోట్ల మే డే ర్యాలీలు జరిగాయి. ట్రంప్ దిష్టిబొమ్మలతో జపాన్‌లో ఊరేగింపులు చేశారు. ప్రధానగా వేతనాలు పెంచాలని, జీవన విధానాలను మెరుగుపరచాలని కార్మికులు డిమాండ్ చేశారు. స్త్రీ పురుష సమానత్వం పాటించాలని, ఆరోగ్య బీమా ఇవ్వాలని ప్రదర్శకులు కోరారు. జపాన్‌లో ప్రదర్శనలో పాల్గొన్న నిర్మాణరంగ కార్మికుడు తడషి ఇటో మాట్లాడుతూ, పెరుగుతున్న ధరలు తమను భయపెడుతున్నాయన్నారు. దిగుమతి వస్తువుల ధరలు చాలా ఖరీదుగా ఉన్నాయన్నారు. ఇండోన్సేసియాలో అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో జకర్తాలోని నేషనల్ మాన్యుమెంట్ పార్కులో వేలాదిమంది కార్మికులను కలిసి వారికి అభినందనలు తెలియజేశారు. దేశంలో పేదరికాన్ని నిర్మూలించేందుకు తమ ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని ఆయన ఈ సందర్భంగా కార్మికులకు చెప్పారు. సుమారు రెండు లక్షలమంది ఇండోనేసియా కార్మికులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఇండోనేసియా ట్రేడ్ యూనియన్స్ కాన్ఫెడరేషన్ అధ్యక్షుడు సాదిక ఇగ్బాల్ మాట్లాడుతూ, దేశీయ కార్మికులకు పూర్తి రక్షణ ఇవ్వాలని కోరారు. టర్కీలో కూడా మే డే ఘనంగా జరిగింది. అనేకచోట్ల కార్మికులు ప్రదర్శనలు నిర్వహించారు.

### ఇస్తాంబుల్‌లో 400 మంది అరెస్టు

గడచిన దశాబ్ద కాలంలో ఎన్నడూ లేని రీతిలో టర్కీలో భారీ ప్రదర్శన కార్మికులు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులకు సెలవు ప్రకటించారు. ఇస్తాంబుల్‌లో తక్షిమ్ స్క్వేర్ వద్ద 400 మంది కార్మికులను ప్రభుత్వం అరెస్టు చేసింది. ప్రతిష్టాత్మకమైన తక్షిమ్ స్క్వేర్ వద్ద వేలాదిమంది గుమిగూడి మే డే ఉత్సవానికి సన్నద్ధం కాగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించకుండా అడ్డుకుని అరెస్టు చేశారు.

### చైనాలో హాలిడే, ట్రావెల్ బూమ్

చైనాలో మే డే ఉత్సవం సందర్భంగా సెలవు ప్రకటించారు. దీంతో ఒకవైపు ప్రదర్శనలు జరుగుతుంటే, మరోవైపు ప్రజలు పర్యటనలకు వెళ్ళేందుకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. దీంతో రైల్వే స్టేషన్లు, విమానాశ్రయాలు, ఇతర రవాణి కేంద్రాలు లక్షలాదిమందితో కిటకిటలాడిపోయాయి. మార్కెట్లలో భారీగా బూమ్ వచ్చింది. గణనీయంగా కొనుగోళ్ళు జరగడంతో వ్యాపారాలు పుంజుకున్నాయి. రవాణా వ్యవస్థ కార్యకలాపాలు ముమ్మరంగా కొనసాగడంతో రెట్టింపు ఆదాయాలు అందరికీ లభించాయి. ఆర్థిక వ్యవస్థకు, మార్కెట్ కార్యకలాపాలకు ఊతం ఇచ్చేవిధంగా మే డే పర్వదినం ఎంతగానో దోహదం చేసింది. ప్రయాణికుల వ్యాల్యూమ్ 8.7 శాతం మేరకు పెరిగింది. షాంఘై రైల్వే నెట్‌వర్క్ ఒక్క గురువారంనాడే 7,70,000 మందిని తరలించింది. యాంగ్జీ నది డెల్టా ప్రాంతంలో ఒక్కరోజులోనే 40.30 లక్షలమంది ప్రయాణికులు రాకపోకలు సాగించారు. జెంగ్ఝౌ రైల్వే నెట్‌వర్క్ ఒక్క గురువారంనాడు 9.55 లక్షల మంది ప్రయాణికులను తరలించింది.

### పారిస్‌లో వేలాదిమంది ప్రదర్శనలు

పారిస్‌లో వేలాదిమంది మే డే ర్యాలీలలో పాల్గొన్నారు. సిజిటి ట్రేడ్య యూనియన్ ఆధ్వర్యంలో ఫ్రాన్స్‌లో లక్షలాది మంది కార్మికులు మే డే ర్యాలీలలో పాల్గొన్నారు. ఫ్రాన్స్ వ్యాప్తంగా మొత్తం 260 ప్రదర్శనలు జరిగాయి. యూరోపియన్ ట్రేడ్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్తర్ లించ్ ప్రత్యేక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా సంభవించిన పరిణామాల నేపథ్యంలో ఈ ఏడాది మే డే ఉత్సవాలకు ఎంతో ప్రత్యేక ప్రాధాన్యం ఉందని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా కార్మికులు సమైక్యం కావాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కార్మికుల మధ్య మైత్రీభావం పెంపొందాలని, యూరప్‌లో ఉద్యోగాల రక్షణకోసం కార్మికులు చేయవలసినది ఇంకా ఎంతో ఉందని అన్నారు. కార్మికుల జీవితాలను మెరుగుపరచుకోవడానికి తమమైన సోషల్ మోడల్‌ను అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందని ఆమె అన్నారు.




## కంటెంట్ క్రియేటర్లు భారతదేశ టాలెంట్‌ను... సృజనాత్మకంగా ఆవిష్కరించాలి

### న్యూఢిల్లీలో జరిగిన 'వేవ్స్' ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రధాని మోదీ పిలుపు

**ముంబయ్ :** ప్రజల జీవితాలలో సాంకేతిక ప్రగతి ముఖ్య పాత్ర పోషించడం పెరిగిపోతున్నదని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. సంగీతం, నృత్యం, కథ చెప్పడం వంటి కళారూపాలను ఉపయోగించుకోవడం ద్వారా కంటెంట్ సృష్టికర్తలు కరుణామయ భవిష్యత్తును నిర్మించుకోవాలని మోదీ కోరారు. మనుషులను రోబోలుగా మార్చకూడదు. వారు మరింత సున్నితంగా ఉంటారు అని మోదీ చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ గురువారం ఇక్కడ జరిగిన మొదటి వరల్డ్ ఆడియో విజువల్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్ (వేవ్స్) ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సృష్టికర్తలు, స్టార్టప్స్, పరిశ్రమ నాయకులు, విధాన రూపకర్తలను ఒక చోటికి చేర్చడం ద్వారా భారతదేశం మీడియా వినోద ం, డిజిటల్ ఆవిష్కరణలకు ప్రపంచ కేంద్రంగా నిలబెట్టడానికి 'వేవ్స్' ఒక వేదికగా భావించబడుతోంది. ఆన్‌లైన్ కంటెంట్‌పై తీవ్ర చర్చ పెరిగిపోతున్న నేపథ్యానికి వ్యతిరేకంగా ప్రధానమంత్రి వ్యాఖ్యలు చేశారు. అంతేకాకుండా సుప్రీంకోర్టు ఆన్‌లైన్ కంటెంట్‌కు సంబంధించి మార్గదర్శకాలను రూపొందించడం ద్వారా దానిని నియంత్రించాలని ప్రభుత్వాన్ని కోరిన దరిమిలా ప్రధానమంత్రి వ్యాఖ్యలకు ప్రాధాన్యత సంతరించుకుంది.భారతదేశ చలనచిత్ర నిర్మాణం, డిజిటల్ కంటెంట్, గేమింగ్, ఫ్యాషన్, సంగీతం అభివృద్ధి చెందుతున్న తరుణంలో భారతదేశం అంతర్జాతీయ హబ్‌గాఅవతరిస్తున్న సందర్భంగా ప్రపంచ టాలెంట్ ప్లాట్ ఫారమ్‌గా రూపొందడానికి 'వేవ్స్' సమర్థవంతంగా పని సామర్థ్యాలను కలిగిఉంటుందని నరేంద్ర మోదీ చెప్పారు. ప్రపంచం అంతా స్టోరీ టెల్లింగ్ కు కొత్త మార్గాల కోసం ఎదురుచూస్తున్న తరుణంలో 'క్రియేటివ్ ఇన్ ఇండియా', 'క్రియేటివ్ ఫర్ వరల్డ్' సృష్టించేందుకు భారతదేశం వద్ద చాలా ఆఫర్లు ఉన్నాయని ప్రధానమంత్రి మోదీ చెప్పారు. మానవ కరుణను, సామాజిక చైతన్యాన్ని మరింతగా పెంపొందించడానికి సృజనాత్మక ప్రపంచం అధికార శక్తులను కలిగిఉంటుందన్నారు. మోదీ మాట్లాడుతూ రోబోలను సృష్టించడమే లక్ష్యం కారాదన్నారు. సమాచార ఓవర్ లోడ్, సాంకేతిక వేగం నుంచి మాత్రమే ఉద్భవించలేని అధిక సున్నితత్వం, భావోద్వేగ లోతు, మేధో సంపన్నత గుణాలు కలిగిన వ్యక్తులను పెంపొందించడమే లక్ష్యంగా ఉండాలన్నారు. అకాడమీ అవార్డు గ్రహీత ఎం.ఎం.కీరవాణి స్వరపరిచిన రుగ్వేదంలోని ఒక ఉత్తేజకరమైన స్తోత్రాన్ని శ్రేయా ఘోషల్ మరికొందరు గాయకులు ఆలపించడంతో కార్యక్రమం ప్రారంభమైంది. యాక్టర్ షారుక్‌ఖాన్ అతిథులకు సాదర స్వాగతం పలకడం ద్వారా సదస్సుకు ఆహ్వానించారు. చిత్ర ప్రముఖులు అనుపమ్ ఖేర్, హేమ మాలిని, మోహన్‌లాల్, రజినీకాంత్, కార్తీక్ ఆర్యన్, ఎస్ ఎస్.రాజమౌళి, అనిల్ కపూర్ ఈ సందర్భంగా స్వల్ప వ్యవధి ప్రసంగాలు చేశారు.భారతదేశ టాలెంట్‌ను ప్రపంచవేదికపై సృజనాత్మకంగా సృష్టించాలన్న ప్రధానమంత్రి ఆలోచనా దృక్పథాన్ని వారందరూ ప్రశంసించారు.



## సైనికుల స్థైర్యాన్ని దెబ్బతీస్తారా?

### పహల్గామ్ ఘటనపై విచారణకు సుప్రీంకోర్టు తిరస్కరణ

### పిటిషనర్‌పై తీవ్ర ఆగ్రహం

**న్యూఢిల్లీ :** జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో ఇటీవల ముష్కరులు జరిపిన పాశవిక దాడితో యావత్ దేశం ఉలిక్కిపడింది. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా సమైక్యంగా పోరాడాలని దేశమంతా ఒక్కటైంది. ఈ నేపథ్యంలో పహల్గాం దాడిపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై అత్యున్నత న్యాయస్థానం తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఇలాంటి వ్యాజ్యాలతో మన భద్రతా బలగాల స్థైర్యాన్ని దెబ్బతీయాలనుకుంటున్నారా అని కోర్టు పిటిషనర్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. 'ఇది చాలా క్లిష్ట సమయం. ఉగ్రవాదంపై పోరులో ప్రతి పౌరుడు చేతులు కలపాలి. ఇలాంటి పిటిషన్లు దాఖలు చేసేటప్పుడు కాస్త బాధ్యతతో వ్యవహరించండి. అందులో సున్నితత్వాన్ని అర్థం చేసుకోండి. ఇలాంటి చర్యలతో మన బలగాల స్థైర్యాన్ని దెబ్బతీయాలనుకుంటున్నారా? మీక్కూడా దేశంపై బాధ్యత ఉందన్న విషయాన్ని మర్చిపోవద్దు' అని ధర్మాసనం సూచించింది. ఇలాంటి అంశాలను న్యాయ పరిధిలోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నించొద్దు. ఉగ్రవాద ఘటనల విచారణకు జడ్జీలు నిపుణులు కారు అని ధర్మాసనం వెల్లడించింది. అయితే, ఇతర రాష్ట్రాల్లో కశ్మీరీ విద్యార్థుల భద్రత కోసమే తాను ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేసినట్లు పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. విద్యార్థుల కోసమే అయితే హైకోర్టులకు వెళ్లొచ్చని తెలిపింది. కోర్టు సూచనలతో పిటిషనర్ తన వ్యాజ్యాన్ని ఉపసంహరించుకున్నారు. ఏప్రిల్ 22న జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌కు దగ్గర్లో ఉన్న ప్రముఖ పర్యాటక ప్రాంతం బైసరన్ లోయలో ఉగ్రవాదులు మారణహోమానికి పాల్పడిన సంగతి తెలిసిందే. సైనిక దుస్తుల్లో వచ్చిన వారు పర్యాటకులను అతి సమీపం నుంచి కాల్చి చంపారు. ఈ ఘటనలో ఓ కశ్మీరీ సహా 26 మంది ప్రాణలు కోల్పోయారు. ఈ దాడితో భారత్ పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఉగ్రవాదులకు, వారికి మద్దతిస్తున్న వారికి గట్టిగా బదులిస్తామని భారత్ స్పష్టంగా చెప్పింది.

## నేడు సిడబ్ల్యుసి భేటీ

### పహల్గామ్ ఉగ్రదాడి, కులగణనపై చర్చ



**న్యూఢిల్లీ :** కాంగ్రెస్ అత్యున్నత నిర్ణయాధికార సంస్థ అయిన పార్టీ వర్కింగ్ కమిటీ కీలక సమావేశం శుక్రవారం జరగనుంది. పహల్గామ్ ఉగ్రవా ద దాడి, కేంద్రం ప్రకటించిన కుల గణనపై కాం గ్రెస్ అగ్ర నాయకులు చర్చించనున్నారు. పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ విలేకరులతో మా ట్లాడుతూ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సిడబ్ల్యుసి) సమావేశమై దేశం ముందున్న రెండు కీలకమైన అంశాలపై చర్చిస్తుందని చెప్పారు. పహల్గామ్ ఉగ్రవాద దాడి తర్వాత పాకిస్తాన్‌పై కచ్చితమైన చర్య తీసుకోవాలని, జాతీయ జనాభా గణనలో భాగంగా కుల గణనను త్వరగా నిర్వహించడానికి నిధులు కేటాయించాలని కోరుతూ సిడబ్ల్యుసి తీర్మానాలను ఆమోదించే అవకాశం ఉందని వర్గాలు తెలిపాయి. 'శుక్రవారం సాయంత్రం 4 గంటలకు కాంగ్రెస్ వర్కింగ్ సమావేశం జరుగుతుంది. అతి ముఖ్యమైన అంశం పహల్గామ్ దాడి. దేశం ముందున్న అతిపెద్ద రాజకీయ సమస్య అయినందున దాని గురించి చర్చిస్తాము. చర్య కోసం దేశం వేచి ఉంది. కుటుంబ సభ్యులను కోల్పోయిన వారు న్యాయం కోరుతున్నారు' అని రమేష్ అన్నారు. సిడబ్ల్యుసి సమావేశం ఢిల్లీలోని 24, అక్బర్ రోడ్‌లో ఉన్న పార్టీ ప్రధాన కార్యాలయంలో జరుగుతుంది. ప్రభుత్వం బుధవారం ప్రకటించిన కుల గణన అంశంపై కూడా పార్టీ నాయకత్వం చర్చిస్తుందని రమేష్ చెప్పారు. 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని తొలగించే అంశాన్ని పార్లమెంటులో లేవనెత్తుతామన్నారు. స్వాతంత్ర్యం తర్వాత తొలిసారిగా కులాల వివరాలను చేర్చడంతో, కులాల గణన తదుపరి జనాభా గణనలో భాగంగా ఉంటుందని కేంద్రం బుధవారం ప్రకటించింది. 11 సంవత్సరాలుగా వ్యతిరేకిస్తూ వస్తూ తదుపరి జనాభా గణనలో కులాల గణనను చేర్చాలనే ప్రభుత్వం ఆకస్మిక నిర్ణయాన్ని ఆయన స్వాగతిస్తున్నామని జైరామ్ రమేష్ అన్నారు. కానీ కేంద్రం దాని అమలు కోసం కాల పరిమితిని నిర్ణయించాలన్నారు. ప్రభుత్వం కుల గణనను ప్రకటించడానికి కాంగ్రెస్ నిర్వహిస్తున్న నిరంతర ప్రచారాన్ని ప్రశంసిస్తూ, ఇది అమలు పరంగా మహిళా బిల్లు వైపు వెళ్ళవచ్చనేది తన తక్షణ అనుమానమని ఆయన అన్నారు. దాని కోసం నిర్దిష్ట తేదీని నిర్ణయించాలని డిమాండ్ చేశారు. కుల గణన కోసం ప్రభుత్వంపై కాంగ్రెస్ పెట్టిన ఒత్తిడి ఫలించిందని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ పేర్కొన్నారు.

## ఆగని కవ్వింపు చర్యలు

### ఎల్‌ఒసి వద్ద వరుసగా ఏడో రోజూ పాక్ కాల్పులు

### దీటుగా ఎదుర్కొంటున్న భారత బలగాలు

**జమ్ము :** జమ్ముకశ్మీర్‌లోని మూడు సరిహద్దు జిల్లాల్లోని అనేక సెక్టార్లలో పాకిస్తాన్ దళాలు నియంత్రణ రేఖ వెంబడి వరుసగా ఏడవ రాత్రి కూడా కాల్పుల విరమణ ఉల్లంఘనలను కొనసాగించాయి. అయితే భారత సైన్యం దీటుగా స్పందించిందని అధికారులు గురువారం తెలిపారు. ఏప్రిల్ 22న పహల్గామ్ ఉగ్రవాద దాడిపై రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో భారత్, పాకిస్తాన్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ (డిజిఎంఒఎస్) మంగళవారం హాట్‌లైన్‌లో మాట్లాడినప్పటికీ కాల్పులు జరిగాయని అధికారులు గురువారం తెలిపారు. ఏప్రిల్ 30–మే 1, రాత్రి, జమ్ముకశ్మీర్ కేంద్ర పాలిత ప్రాంతంలోని కుప్వారా, ఉరిష అఖ్నూర్ ఎదురుగా నియంత్రణ రేఖ వెంబడి పాకిస్తాన్ ఆర్మీ పోస్టులు చిన్న ఆయుధాలతో కాల్పులు జరిపాయి అని జమ్ములోని రక్షణ ప్రతినిధి ఒకరు తెలిపారు. భారత ఆర్మీ దళాలు వేగంగా స్పందించాయన్నారు. ఉత్తరకశ్మీర్‌లోని కుప్వారా, బారాముల్లా జిల్లాల్లోని ఎల్‌ఓసి వెంబడి ఉన్న అనేక పోస్టులపై చిన్న ఆయుధాలతో కాల్పులు జరపగా, ఆ తర్వాత పూంచ్ సెక్టార్, అనంతరం జమ్ము ప్రాంతంలోని అఖ్నూర్ సెక్టార్‌లో కాల్పులు జరిపాయన్నారు. మంగళవారం రాత్రి రాజౌరి జిల్లాలోని సుందర్‌బాని, నౌషేరా సెక్టార్లలోని ఎల్‌ఓసి వెంబడి ఉన్న అనేక పోస్టులపై చిన్న ఆయుధాలతో కాల్పులు జరిపింది. తదనంతరం, జమ్ము జిల్లాలోని అంతర్జాతీయ సరిహద్దు వెంబడి ఉన్న పర్గ్వాల్ సెక్టార్‌లోకాల్పులు జరిపింది. ఉగ్రవాద దాడిలో 26 మంది మృతి అనంతరం భారత్ సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేసిన కొన్ని గంటల తర్వాత, ఏప్రిల్ 24 రాత్రి నుండి, పాకిస్తాన్ దళాలు కాశ్మీర్ లోయ నుండి ప్రారంభించి జమ్ముకశ్మీర్‌లోని ఎల్‌ఓసి వెంబడి వివిధ ప్రదేశాలలో కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నాయి. ఏప్రిల్ 24న, పాకిస్తాన్–భారత విమానయాన సంస్థలకు తన గగనతలాన్ని మూసివేసింది. వాఘా – సరిహద్దు క్రాసింగ్‌ను మూసివేసింది। భారతదేశంతో అన్ని వాణిజ్యాన్ని నిలిపివేసింది. సింధు జలాల ఒప్పందం ప్రకారం పాకిస్తాన్‌కు ఉద్దేశించిన నీటిని మళ్లించడానికి చేసే ఏ ప్రయత్నమైనా 'యుద్ధ చర్య'గా పరిగణించబడుతుందని పేర్కొంది. భారతదేశం, పాకిస్తాన్ ఫిబ్రవరి 2021లో జమ్ముకశ్మీర్ సరిహద్దుల వెంబడి పునరుద్ధరించబడిన కాల్పుల విరమణకు అంగీకరించాయి.




**IN THE COURT OF THE HON'BLE PRL JUNIOR CIVIL JUDGE AT BHUPLAPALLY.**

**O.S. NO. 75 of 2025**

Between:
1. Gujja Vanamala, W/o Late Bheema Rao, Age: 56 yrs, Occ; Household, R/o. H.No. 6-10, Shyamnagar village, Bhupalpally mandal, Jayashankar Bhupalpally District.
2. Gujja Rajeshwar Rao, S/o Late Bheema Rao, Age: 37 yrs, Occu: Business, R/o, H.No. 6-10, Shyamnagar village, Bhupalpally mandal, Jayashankar Bhupalpally District.
3. Kasanagottu Ramya, D/o Late Bheema Rao, Age: 33 yrs, Occu: Housewife, R/o H.No: 7-80/2/1, Ambetkar colony, Rekurthy, Karimnagar District.

...**Plaintiffs**

Vs

1. The Tahsildar Bhupalpally mandal, Jayashankar Bhupalpally District.
2. The Birth and deaths registrar or Panchayathi Secretary Shamnagar village, Bhupalpally mandal, Jayashankar Bhupalpally district.
3. The District Collector Jayashankar Bhupalpally.
4. Whom so ever it may concern.

...**Defendants**

**Notice**

To
Whom so ever it may concern
Whereas above named Plaintiffs filed above suit to declare that they are legal heirs of late Sri Gujja Bheema Rao, S/o. late Gujja Kantha Rao and the above suit is posted on **05.05.2025.** Any person or persons who have any objection or claim to be the legal heirs of late Sri Gujja Bheema Rao, S/o. late Gujja Kantha Rao appear before the above said Prl. Junior Civil Judge Court at Bhupalpally on **05-05-2025 at 10.30 am.** in person or through a counsel, else the matter will be decided exparte.

(BY ORDER OF THE COURT)

Date : 1-05-2025

**REGULA RAKESH**
Advocate,
Bhupalapally

## ప్రతిభ చాటుకున్న లిటిల్ ఫ్లవర్ విద్యార్థులు



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: పదవ తరగతి ఫలితాల్లో లిటిల్ ఫ్లవర్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని పాఠశాల ప్రిన్సిపాల్ కెకె.జయరాజన్ తెలిపారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను గురువారం ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 51 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 20 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించారని అన్నారు. విజయానికి కారకులైన ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను అభినందించారు. సాధన చేస్తే సాధించలేనిదంటూ ఏం లేదన్నారు.విద్యార్థులను అభినందించిన వారిలో ప్రధానోపాధ్యాయులు సుజయ్‌కుమార్, డైరెక్టర్ జిన్సీ జయరాజన్, ప్రసాద్ ఉన్నారు.

## కార్మికులకు అండ ఎర్రజెండా



ప్రజాపక్షం/అనంతగిరి: కార్మికులకు అండ ఎర్రజెండా అని సిపిఐ మండల కార్యదర్శి బద్దం కృష్ణారెడ్డి అన్నారు. స్థానిక అనంతగిరి మండలంలో మేడే సందర్భంగా జెండా ఆవిష్కరణలు చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో పార్టీ, అనుబంధ సంఘాల జెండాలను ఎగురవేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కావాలంటే పోరాటాల ద్వారానే పరిష్కారం అవుతాయని అన్నారు. కేంద్రంలో ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా కార్మికరైతు వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని అన్నారు. అంతకు ముందు గ్రామంలో ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు, కార్యకర్తలు, కార్మికులు పాల్గొన్నారు.

# కార్మిక చట్టాల జోలికొస్తే ప్రభుత్వాలు పతనం

### కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల జీవితాలతో చెలగాటం : వాడవాడలా మే డే దినోత్సవ వేడుకలలో వక్తలు



ప్రజాపక్షం/కోదాడ: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నాయని, కార్మిక చట్టాల జోలికొస్తే ప్రభుత్వాలు పతనం కాక తప్పదని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు హెచ్చరించారు. గురువారం 139వ మేడేను ఘనంగా నిర్వహించారు. ఎఐటియుసి జెండా దిమ్మెలను ఆవిష్కరించి గవర్నమెంట్ ఆసుపత్రి నుండి బైకు ర్యాలీ, కార్మిక ర్యాలీ బయలుదేరి రంగా థియేటర్ చౌరస్తా నుండి ఆర్టీసీ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈనెల 20న దేశ వ్యాప్తంగా జరిగే సమ్మెను విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు షేక్ లతీఫ్, బత్తిని హనుమంతరావు, పైడిమర్రి వెంకటనారాయణ, పోతురాజు సత్యనారాయణ, రైతు సంఘం నాయకులు బొల్లు ప్రసాద్, ఏఐటియుసి నాయకులు శ్రీనివాస్, వెంకటరెడ్డి, విద్యాచారి, షేక్ సైదా, కర్ల కాంతారావు, వెంకన్న, నయీంఖాన్, రాజశేఖర్, మాతంగి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజాపక్షం/హుజూర్‌నగర్: ప్రపంచ కార్మికుల హక్కుల పరిరక్షణే ఐటీయూసీ ధ్యేయమని ఏఐటీయూసీ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం ప్రపంచ కార్మిక దినోత్సవమైన మేడేను ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలో వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఏఐటీయూసీ జెండాలను జడ శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాసేందుకు యత్నిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ప్రధానకార్యదర్శి జెట్టి ప్రసాద్,ముదుసు పాపారావు,బండి భాస్కర్, పాలడుగు రాజు,బొప్పన రాజు,భానుమత్ సైదులు,పండగ వెంకన్న,జక్కుల మల్లయ్య,బెల్లంకొండ రామ్మూర్తి,చక్రాల వెంకటేశ్వర్లు,వీరేశం, బాలాజీ,పంకజ్,ప్రదీప్,మంగల్,సంజయ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజాపక్షం/చింతలపాలెం: కార్మికులు, ప్రజలు, కర్షకులు, శ్రామికులు అనేక పోరాటాల ద్వారా హక్కులను సాధించుకున్న రోజున మేడేను ఘనంగా జరుపుకున్నారని ఎఐటియుసి యూనియన్ అధ్యక్షులు దాసు బ్రహ్మం అన్నారు. గురువారం మేడే సందర్భంగా సిపిఐ, టిప్పర్ డ్రైవర్స్, హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఎఐటియుసి జెండాను ఆవిష్కరించి అనంతరం గ్రామంలో బైకుర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు కారంగుల కొండ, గంజి కుమారస్వామి, లింగస్వామి, నర్సింహరావు, చిత్తలూరి నర్సింహరావు, వీరబాబు, బ్రహ్మయ్య, రాజశేఖర్‌రెడ్డి, అమరబోయిన శ్రీనివాస్‌యాదవ్, కంపసాటి వెంకటేశ్వర్లు, నాగరాజు, భాష్యం యాదగిరి, శ్రీను, కొండ, ప్రసాద్, ఆదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రజాపక్షం/మునగాల: కార్మికుల పక్షాన నిరంతరం సిపిఐ, దాని అనుబంధ సంఘాలు పోరాడుతున్నాయని సిపిఐ మండల కార్యదర్శి చిల్లంచర్ల ప్రభాకర్ అన్నారు. గురువారం మేడే సందర్భంగా మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సిపిఐ కార్యాలయంలో, ఎఐటియుసి, మిల్లర్స్ వర్కర్స్ యూనియన్, ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్, హమాలీ వర్కర్స్ యూనియన్ ల ఆధ్వర్యంలో జెండాలను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు రాఘవరెడ్డి, జక్కుల చంద్రశేఖర్, గుండగాని శ్రీను, మన్సూర్, దేశగాని శ్రీను, సాలె రవి, మధు, ఉపేందర్‌రెడ్డి, శివనాయక్, భవన నిర్మాణ సంఘం నాయకులు, హమాలీ వర్కర్స్, ట్రాక్టర్ డ్రైవర్స్ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజాపక్షం/నేరేడుచర్ల: పెట్టుబడిదారి వ్యవస్థను అంతం చేసి శ్రమదోపిడి నుండి శాశ్వతంగా విముక్తి కావాలన్న కార్మికుల లక్ష్యాన్ని పునరుద్ఘరించే రోజు మేడే అని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్ అన్నారు. గురువారం నేరేడుచర్ల పట్టణంలోని సిపిఐ కార్యాలయం వద్ద జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దూళిపాళ ధనుంజయనాయుడు, సిపిఐ మండల కార్యదర్శి యల్లబోయిన సింహాద్రి, పట్టణ కార్యరద్శి కత్తి శ్రీనివాస రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రావుల సత్యం, జిల్లా అధ్యక్షులు చిలకరాజు శ్రీను పాల్గొన్నారు.



ప్రజాపక్షం/కొండమల్లేపల్లి : మేడే పోరాట స్ఫూర్తితో కార్మికులు హక్కుల కోసం ఉద్యమించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మేడే సందర్భంగా మండల కేంద్రంలో ఆటో వర్కర్స్ యూనియన్, పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జెండాలను ఎగరవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 20న దేశ వ్యాప్తంగా సమ్మె చేయాలని కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్లు నిర్ణయించుకున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి దూదిపాల రేఖ శ్రీధర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ నాయిని మాధవ రెడ్డి, మాజీ వైస్ ఎంపిపి కాసర్ల వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఉట్కూరి వేమన్‌రెడ్డి, యువజన అధ్యక్షుడు మూడావత్ మంగ్యానాయక్, ఆటో యూనియన్ అధ్యక్షుడు ఆదిరాల శ్రీను, పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఇంద్రయ్య, ఏఐటీయూసీ మండల కార్యదర్శి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపక్షం/మునుగోడు: ప్రపంచ కార్మిక 139వ మేడే దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో సిపిఐ అనుబంధ కార్మిక సంఘాలు ఏఐటీయూసీ మిల్లు హమాలీ కార్మిక సంఘం, భవన నిర్మాణ కార్మిక సంఘం, మార్కెట్,సెంట్రింగ్,ఆటో, చిరు వ్యాపారాల సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్మిక జెండాను రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గురిజ రామచంద్రం, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి వెంకటేశ్వర్లు, సిపిఐ మండల కార్యదర్శి చాపల శ్రీనులు ఎగరవేసి కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు, సురిగి చలపతి, మాజీ జడ్పిటిసి గోసుకొండ లింగయ్య, మండల సహాయ కార్యదర్శులు బండమీది యాదయ్య, మందుల పాండు,ఏఐటీయూసీ మండల అధ్యక్ష కార్యదర్శులు దుబ్బ వెంకన్న, బెల్లం శివయ్య, మండల కార్యవర్గ సభ్యులు ఈదులకంటి కైలాస్ ,ఎండి జానీ పాల్గొన్నారు.

ప్రజాపక్షం/చండూరు: కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు



,చండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నల్పరాజు రామలింగయ్య పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.మే డేను పురస్కరించుకొని గురువారం చండూరు మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయం వద్ద సిపిఐ మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్ ,గుండ్రపల్లి ఎక్స్ రోడ్ వద్ద జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యుడు నల్పరాజు రామలింగయ్య పార్టీ అరుణపతాకాలను ఎగురవేశారు. అనంతరం గుండ్రపల్లి చౌరస్తాలో ఉన్న అమరజీవి,చండూరు మాజీ వైస్ ఎంపిపి మందడి నర్సింహ్మారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్ , మండల పార్టీ సహాయ కార్యదర్శులు పల్లె యాదయ్య, బొడ్డు వెంకటేశ్వర్లు , మండల పార్టీ కార్యవర్గ సభ్యులు తిప్పర్తి రాములు , దోటి వెంకన్న, బండమీది వెంకన్న పాల్గొన్నారు.

ప్రజాపక్షం/ జోగులాంబ గద్వాల ప్రతినిధి: ఏఐటియుసి ఆధ్వర్యంలో జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో 139 వ ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. గద్వాల పట్టణంలో కార్మికుల అడ్డాల దగ్గర వివిధ సెంట్రల్లలో మేడే ను పురస్కరించుకొని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఎర్రజెండను ఎగరవేసి చికాగో కార్మికుల త్యాగాలను స్మృతులను గుర్తు చేసుకొని స్మరించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు బి. ఆంజనేయులు జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ సీపీఐ జిల్లా నాయకులు రంగన్న, ఖాసీం, బసన్న ,శ్రీధర్ రావు, నారాయణ, రాజు, బండి నరసింహులు, ధర్మన్న, ప్రభుదాస్, తిమ్మప్ప, భీమన్న, వెంకటేష్ ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రవీణ్, మస్తాన్, కర్రెప్పు, తదితరులు పాల్గొన్నారు.



## నర్సరీ మొక్కలు ఫలవర్థకంగా ఉండాలి



### పంచాయతీ రాజ్ డైరక్టర్ సృజన

ప్రజాపక్షం/చిట్యాల: ఉపాధి హామీ పథకంలో భాగంగా పెంచుతున్న నర్సరీ మొక్కలు ఫలవర్థకంగా ఉండాలని, మొక్కలు రైతులకు, ఇంటి యజమానులకు ఉపయోగపడాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ డైరక్టర్ సృజన అన్నారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలంలోని పెద్ద కాపర్తి గ్రామంలో పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి పనులతో పాటు, ఉపాధి హామీ పథకం పనులను జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు పంట పొలాలలో పొలం గట్లపై వేసుకునేందుకు వీలుగా, ఇండ్లలో పెరట్లో పెంచుకునే మొక్కలను పంపిణీ చేసే విధంగా ప్రణాళికలు వేసుకోవాలని అధికారులకు సూచించారు. ఉపాధి హామీ పథకం కింద కూలీలకు వేతనం గిట్టుబాటు అయ్యే విధంగా పనులు చేపట్టాలని అన్నారు. నల్లగొండ జిల్లాలో చేపట్టిన ఉపాధి పనుల పట్ల ఆమె సంతృప్తిని వ్యక్తం చేశారు. పెద్దకాపర్తి గుట్ట మీద కందకం తవ్వే పనులను చేస్తున్న ఉపాధి కూలీల దగ్గరికి వెళ్లి వారితో ఆమె ముచ్చటించారు. వేతన వివరాలను వారి నుండి అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు ఎక్కువ వేతనం పనులు ఇవ్వాలని, పనులు గుర్తింపు సమయంలోనే అలాంటి పనులను గుర్తించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. ఆమె వెంట స్థానిక సంస్థల ఇంఛార్జ్ అదనపు కలెక్టర్ రాజ్‌కుమార్, డిఆర్‌డిఓ శేఖర్‌రెడ్డి, జడ్‌పి సిఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, స్థానికి ఎంపిడిఓ జయలక్ష్మి తదితరులున్నారు.

## ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి



ప్రజాపక్షం/చివ్వెంల: కొనుగోలు చేసిన తర్వాత ధాన్యాన్ని వెంటనే మిల్లులకి తరలించాలని ఐకెపి సిబ్బందిని జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు అదేశించారు. గురువారం ఐకెపి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చివ్వెంల మండలం ఎర్రసూర్యతండా, వట్టిఖమ్మం పహడ్ కొనుగోలు కేంద్రాలను జిల్లా అదనపు కలెక్టర్ అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు అరబోసిన ధాన్యం తేమశాతం, ప్రతిరోజు పరిశీలించి సకాలంలో ధాన్యాన్ని తూకంవేసి మిల్లులకు తరలించాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు లో రైతులను ఇబ్బంది పెట్టకుండా సహకరించాలని నిర్వాహకులకి సూచించారు. ఇప్పటి వరకు ఎర్రసూర్య తండా నుండి 6798 క్వింటాలు, వట్టి ఖమ్మంపహడ్ 6960 క్వింటాళ్లు ఇప్పటి వరకు ధాన్యం మిల్లులకు తరలించడం జరిగిందన్నారు. ఆకాల వర్షాలు కురుస్తున్నందున ఎక్కువ మొత్తంలో టార్పాలిన్లు, గన్ని బ్యాగ్స్, హమాలీలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిసి వెంకన్న, సెంటర్ ఇన్‌ఛార్జిలు జ్యోతి, శీరిష, రైతులు పాల్గొన్నారు.

## అంతర్ రాష్ట్ర దొంగలు అరెస్ట్



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను అరెస్టు చేసి రిమాండ్ కు పంపించినట్లు నల్లగొండ డిఎస్‌పి శివరాం రెడ్డి తెలిపారు. గురువారం నల్లగొండలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ఓల్డ్ చౌరస్తా సిమెంట్ రోడ్ వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఏమి రెడ్డి రాజశేఖర్ రెడ్డి సిసియస్ సిబ్బంది నమ్మదగిన సమాచారము మేరకు ఇద్దరు అంతర్ రాష్ట్ర దొంగలను పట్టుబడి చేసి విచారించగా వీరి ఇద్దరితో పాటు ధర్మాడి దుర్గా ప్రసాద్ కలిసి వన్ టౌన్,టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిదిలో పలు నేరాలు చేసినట్లు ఒప్పుకున్నట్లు వారు తెలిపారు.ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం తూర్పుగోదావరి జిల్లా కాకినాడకు చెందిన ధర్మాడి దుర్గా ప్రసాద్ పరారీలో ఉన్నాడని పాసిల సత్యనారాయణ గాడిమొగ్గ గ్రామము, తడలరేవు మండలము కాకినాడ,కామాడి శ్రీనివాసు లు2024 అక్టోబర్ నెలలో ఈ ముగ్గురు దొంగలు కాకినాడ నుండి నల్లగొండ కు రైలులో వచ్చి పట్టణములోని ఆల్కాపూరి కాలనీలా తాళము వేసి ఉన్న పాశం జనార్ధన్ రెడ్డి ఇంట్లో తాళము పగులగొట్టి ఇంట్లో ఉన్న 2 బంగాలు చైన్‌లు 1,తులాల బంగారం, నగదు 40 వేలు దొంగిలించుకొని పారిపోయారని తెలిపారు.ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించి నమ్మదగిని సమాచారముతో నిందితులను పట్టుకున్న సి సిఎ స్ ఇన్స్పెక్టర్ బి. డానియల్ కుమార్. శివ కుమార్, సిబ్బంది విష్ణు, వన్ టౌన్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డి,జె. గోపాల్ రావు,హెడ్ కానిస్టేబుల్, శివ రామ కృష్ణ, శ్రీకాంత్, అంజద్, గాంధీ లను డిఎస్‌పి అభినందించారు.

## హామీల అమలుపై దృష్టిపెట్టండి

### మాజీమంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి



ప్రజాపక్షం/సూర్యాపేట: మాజీ సిఎం కెసిఆర్‌పై చిల్లర మాటలు మాని, ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై దృష్టి సారించాలని, సిఎం రేవంత్‌రెడ్డి కెసిఆర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ కెసిఆర్‌ను విమర్శించి మాట్లాడేవారు బిఆర్‌ఎస్ రజతోత్సవ సభ ఓ చెంపపెట్టు అని అన్నారు. కెసిఆర్ నోట రేవంత్‌రెడ్డి మాట రాలేదనే అక్కసుతోనే అక్రమాలకు పాల్పడ్డారని, రాష్ట్రాన్ని దివాళా తీయించారని మాట్లాడటం సరికాదన్నారు. పోరాడి సాధించుకున్న తెలంగాణపై మాట్లాడే అర్హత ఆయనకు లేదన్నారు. కాంగ్రెస్ అంటే రేవంత్ ఒక్కడేనన్న భ్రమలో ఉన్నాడని, రేవంత్‌కు కాంగ్రెస్‌పార్టీ కన్నా వ్యక్తిగత ప్రచారమే ఎక్కువ అన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని కాంగ్రెస్ ఇవ్వడం ప్రేమతో కాదని, భయంతోనని అన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి సొంత ఎమ్మెల్యేల పేర్లు కూడా మర్చిపోయారని, ప్రజలకు ఇచ్చిన హామీలు ఇక ఏమీ గుర్తుంటాయని అన్నారు. ముమ్మాటికి తెలంగాణ రాష్ట్రానికి కాంగ్రెస్సే విలనని వ్యాఖ్యనించారు. ఉన్న తెలంగాణను ఆంధ్రలో కలిపిందే కాంగ్రెస్ అని గుర్తు చేశారు. ఉద్యమ సమయంలో 359 మంది ఉద్యమకారులను కాల్చిచంపిన పాపం కాంగ్రెస్‌దేనని అన్నారు.

# ప్రపంచ సుందరీమణులకు కట్టుదిట్టమైన భద్రత



ప్రజాపక్షం/నందికొండ: మే 10 నుంచి 31 వరకు హైదరాబాదులో జరిగే అంతర్జాతీయ సుందరీమణుల పోటీలను రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో వాటికి సంబంధించి ఏర్పాట్లపై అన్ని శాఖల అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారని ఇన్స్పెక్టర్ జనరల్ వి సత్యనారాయణ తెలిపారు. అందులో భాగంగా ఆయన మంగళవారం నల్గొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మిర్యాలగూడ డిఎస్పి రాజశేఖర్ తో కలిసి బుద్ధవనాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 12న సాయంత్రం 4 గంటల నుండి 7 గంటల వరకు మూడు గంటలపాటు బుద్ధపూర్ణిమకు సంబంధించి జరిగే కార్యక్రమంలో ఆసియా లోని 30 బౌద్ధ దేశాలకు చెందిన సుందరిమణులు 30 నుంచి 40 మంది ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి బుద్ధవనానికి రావడం జరుగుతుందని. ముందు వారు విజయ్ విహార్ కు చేరుకొని అక్కడ నుండి బుద్ధవనం చేరుకుంటారని అక్కడ మహా స్తూపం వద్ద ధ్యానం చేసిన తర్వాత బుద్ధ మంక్స్ తో కలిసి స్పిరిచువల్ కార్యక్రమంలో పాల్గొనడం జరుగుతుందని తర్వాత జాతకవనం వద్ద చివరి కార్యక్రమంగా డిన్నర్,ఆడియో విజువల్స్ తో కార్యక్రమం ముగుస్తుందని అన్నారు. ఇది గ్లోబల్ ఈవెంట్ కావడం తోపోలీసు శాఖ బృహత్తర బాధ్యతలు తమపై వేసుకుని కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయడం జరుగుతుందని ఆయన అన్నారు.హైదరాబాదు నుంచి నాగార్జునసాగర్ కు 153 కిలోమీటర్ల దూరం ఉందని వారు హైదరాబాదులో బయలుదేరిన దగ్గర నుంచి నాగార్జునసాగర్ చేరుకుని మళ్లీ తిరిగి హైదరాబాద్ బయలుదేరే వరకు ఎటువంటి అవాంతరాలు అవాంఛనీయ సంఘటనలు,జరగకుండా 1200 నుంచి 1500 మంది పోలీసులతో నల్గొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్, దేవరకొండ ఏసీపి మౌనిక మిర్యాలగూడ డిఎస్‌పి రాజశేఖర్ రాజులు పూర్తి కట్టుదిట్టమైన రూట్ బందోబస్తును వారి ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమానికి బయట వ్యక్తులకు ఎటువంటి ప్రవేశం లేదని గుర్తింపు పొందిన అధికారులకు మాత్రమే అనుమతి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సీఐ శ్రీను నాయక్, ఎస్పై సంపత్ గౌడ్ ఆర్ ఐ దండు శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

# పార్ధి గ్యాంగ్ నిందితులకు 18 నెలల జైలు

ప్రజాపక్షం/నల్లగొండ : వాంటెడ్ క్రిమినల్స్ అంతర్ రాష్ట్ర దొంగల ముఠా పార్ధి గ్యాంగ్ నిందితులకు 18 నెలల జైలు విధించడం జరిగిందని జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ తెలిపారు.ఈ సందర్బంగా అయన మాట్లాడుతూ మోస్ట్ వాంటెడ్ క్రిమినల్స్ అంతర్ రాష్ట్ర దొంగల ముఠా సభ్యులకు క్రైమ్ 108,379 ఐపిసి ప్రకారం జెఎఫ్‌సియం కోర్టు 18 నెలల కఠిన కారాగార శిక్ష ఒక్కొక్కరికి వెయ్యి రూపాయలు జరిమానా చెల్లించాలని , జరిమానా చెల్లించని పక్షంలో ఐ పిసి సెక్షన్ 379 అర్ డబ్ల్యూ 34 ప్రకారం శిక్షార్హమైన నేరానికి ఒక నెల పాటు సాధారణ కారాగార జైలు శిక్ష జరిమాన జిల్లా విధించినట్లు తెలిపారు.నిందితులు గత కొన్ని నెలల క్రితం తెలంగాణ రాష్ట్రం లో నల్లగొండజిల్లా లోని చిట్యాల, నార్కెట్ పల్లి, కట్టంగూర్ మండలాలు, రాచకొండ, సైబరాబాద్ కమిషనరేట్ లలో సంగారెడ్డి జిల్లాలోయ యన్ 65 పై వాహనములు ఆపిలేబే పై పండుకున్న వారిని రాళ్ళతో కొట్టి, వారి వద్ద నుండి బంగారం, డబ్బులు దొంగలించుకుంటూ పట్టుబడి 2024 మే18న కట్టంగుర్ పి ఎస్ పరిధి లొ అశోక్ పవార్,మహారాష్ట్ర రాష్ట్రం చెందిన పార్ధి సభ్యులు మరి కొందరు పైన కేసు నమోదు చేసి నిందితుల పైన సరైన ఆధారాలను సేకరించి కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు సమర్పించగా నేడు దోషులుగా నిర్ధారించి శిక్ష విధించడం జరిగిందని తెలిపారు.ఈ పార్ధి గ్యాంగ్ ముఠా మొత్తం కలిసి నల్లగొండ, హైదరాబాద్, సైబరాబాద్ రాచకొండ ఏరియా లలో మొత్తం 32 కేసులలో నేరం అంగీకరించారని.వీరి పైన ఇంకా కొన్ని కేసులలో జైలు శిక్ష విధిస్తున్నట్లు తెలిపారు.

ఈ కేసును త్వరిత గతిన ఛేదించి సరైన ఆధారాలను సేకరించి కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు సమర్పించి నిందితులకు శిక్ష పడే విధంగా కృషి చేసిన ఇన్వెస్టిగేషన్ అధికారులు నార్కట్ పల్లి సిఐ కె. నాగరాజు, అప్పటి ఎస్ఐ డి సైదాబాబు, చిట్యాల్ పోలీస్ ప్రస్తుత ఎస్ఐ ఎన్ ధర్మ, ఎ ముత్తిలింగం కోర్ట్ లైజనింగ్ ఆఫీసర్ పి నరేందర్, ఎన్.మల్లికార్జులను జిల్లా ఎస్పి అభినందించారు.



## ఇచ్చిన మాట నిలబెట్టుకున్న కలెక్టర్

### ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన 5 మందికి సైకిళ్ల పంపిణీ

ప్రజాపక్షం/యాదాద్రి : రామన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఎంపీసీలో 98.09 శాతం సాధించిన ధీరజ్ కుమార్, అదే కళాశాలలో ఇంటర్ సిఈసిలో 91.60 శాతం శ్రేష్ట, ఒకేషనల్ కోర్స్ ఎంఎల్‌టిలో 98.80 శాతం సాధించిన నందిని, వలిగొండ ఎస్‌వి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ బైపిసిలో 96.59 శాతం సాధించిన గంజి సరస్వతి, యాదగిరిగుట్ట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ హెచ్‌ఈసిలో 93.40 శాతం సాధించిన అభిలాషలను జిల్లా కలెక్టర్ హనుమంతరావు వారి తల్లిదండ్రులతో సహా శాలువాలు కప్పి మెమెంటోలను అందించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇంటర్మీడియట్ విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని మండలాల కళాశాల ప్రిన్సిపల్స్‌తో జిల్లా కలెక్టర్ హనుమంతరావు సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ వీరారెడ్డి, ఆర్డీవో కృష్ణారెడ్డి, డిఆర్‌డిఓ నాగిరెడ్డి, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రమణి, ఎస్సీ షెడ్యూల్ కులాల శాఖ అభివృద్ధి అధికారి వసంతకుమారి, ఇంచార్జ్ విద్యాశాఖ అధికారి ప్రశాంత్ రెడ్డి, విద్యార్థులు వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## ఏరియా ఆసుపత్రి తనిఖీ



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: పట్టణంలోని ఏరియా ఆసుపత్రిని సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ గురువారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన డాక్టర్లు అటెండెన్స్ రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా 8 మంది డాక్టర్లు గైర్హాజరైనట్లు గుర్తించారు. ముందస్తు సమాచారం లేకుండా ఆసుపత్రిలో డాక్టర్లు దుమ్మా కొట్టడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అదేవిధంగా పేషెంట్ వార్డుకు వెళ్లి రోగులతో మాట్లాడి మౌలిక వసతులు, వైద్య సేవలపై ఆరా తీశార. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న డాక్టర్లపై జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందచేస్తానన్నారు. ఆసుపత్రిలోని వివిధ అంశాలపై సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ చర్చించారు.

## శ్రమశక్తి అవార్డు అందుకున్న కార్మికులు



ప్రజాపక్షం/గోదావరిఖని: మేడే దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందజేసే శ్రమశక్తి అవార్డులను రామగుండం ప్రాంత సింగరేణి కార్మికులు అందుకున్నారు. గురువారం హైదరాబాద్ రవీంద్రభారతిలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి నుంచి గోదావరిఖని ప్రాంతంలో పనిచేస్తున్న సింగరేణి కార్మికులు అరగంటి కృష్ణ, మహ్మద్ అక్రం, రాజేందర్‌లు శ్రమ శక్తి అవార్డులను అందుకున్నారు. అవార్డు అందుకున్న కార్మికులను రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు హర్కార వేణు గోపాల్‌రావు, ఐఎన్‌టియుసి సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్‌లు అభినందించారు.

## పలు చోట్ల మేడే జెండా ఆవిష్కరణలు



ప్రజాపక్షం/గోదావరిఖని : గోదావరిఖని ప్రాంతంలోని సింగరేణి 11ఎ, 7ఎల్ ఈపి, 1, 2, 2ఎ, 5వ ఇంక్లయిన్ బొగ్గు గనుల వద్ద, పట్టణంలోని గంగానగర్, విఠల్ నగర్, ప్రశాంత్‌నగర్, ద్వారకనగర్, చంద్రశేఖర్‌నగర్, కాకతీయనగర్, మల్లి ఖార్జుననగర్, సీతానగర్, జీఎం కాలనీ, అశోక్‌నగర్, గాంధీనగర్‌లలో ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో గురువారం మేడే జెండాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్ టియు రాష్ట్ర అధ్యక్షులు ఐ.కృష్ణ మాట్లాడుతూ మేడే అమరవీరుల స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఉద్యమాలను తీవ్రతరం చేయాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు నాయకులు ఈదు నూరి నరేష్,రామకృష్ణ,ఐ.రాజేశం, కొంగ్ర మొగిలి, ఎం.దుర్గయ్య, బతుకుల రాజన్న, చింతల శేఖర్, ఎస్.ప్రసాద్, ఎడ్ల రవికుమార్, కె.ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

## అత్యుత్తమ ఫలితాలు సాధించిన 'ఆల్ఫోర్స్'



ప్రజాపక్షం/రామడుగు: పదో తరగతి ఫలితాల్లో అల్ఫోర్స్ పాఠశాల విద్యార్థులు అ త్యుత్తమ మార్కులను సాధించినట్లు తెలిపారు. రామడుగు మండలం గోపాల్ రావు పేట గ్రామంలోని అల్ఫోర్స్ పాఠశాలలో పది ఫలితాలలో 600మార్కులకు గాను బక్కశెట్టి హర్షిని 574, కె.భాను ప్రకాష్ 573, ఎం.శరణ్య568,జె.సాయిచరణ్568,కె.సంజన, జి.మన్విత566 మార్కులు సాధించారు. 500కు పైగా 72 మంది వంద శాతం ఉత్తీర్ణతతో విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని పాఠశాల చైర్మన్ నరేందర్ రెడ్డి తెలిపారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను చైర్మ న్ వూట్కూరి నరేందర్‌రెడ్డి శాలువా కప్పి ఘనంగా సన్మానించి అభినందించారు.

## అక్షర విద్యార్థుల ప్రభంజనం



ప్రజాపక్షం/రామడుగు: పదవ తరగతి ఫలితాలో అక్షర హైస్కూల్ గోపాల్ రావు పేట విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలను సాధించారు. అక్షర హైస్కూల్‌లో 95 విద్యా ర్థులు పరీక్షకు హాజరు కాగా 500 పైగా మార్కులు 63 మంది విద్యార్థులు సాధించగా, 550 ఆపైన 22 మంది విద్యార్థులు సాధించారు. విద్యార్థులను కరస్పా ండెంట్, ప్రిన్సిపాల్ మినుకుల మునీందర్ పుష్పగుచ్చాలతో అభినందించారు. కార్యక్రమంలో డైరెక్టర్ మినుకుల రాధ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఫైరింగ్ క్యాంపులో సెయింట్ జార్జ్ సిబిఎస్ఇ విద్యార్థుల ప్రతిభ



ప్రజాపక్షం/కొత్తపల్లి : కరీంనగర్‌లోని సెయింట్‌జార్జ్ ఇంటర్నేషనల్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు కేశవ కీర్తన్, నేహవర్ధన్, సాయిరాజ్‌లు ఎన్‌సిసి 9టి బెటాలియన్ కరీంనగర్‌లో జరిగిన ఫైరింగ్ సెలక్షన్స్‌లో పాల్గొని రెండవ లెవెల్ కు ఎంపికైనట్లు చైర్మన్ డాక్టర్ ఫాతిమారెడ్డి తెలిపారు. ఈ రెండవ లెవెల్ మే 3న ఎలగందులలో జరుగుతుందని, అందులో అద్భుతమైన ప్రదర్శన కనబరిచి తదుపరి లెవెల్స్‌కు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. విద్యార్థులను, ఎన్‌సిసి బృందాన్ని, ఎన్‌సిసి కేర్ టేకర్ దివ్యను అభినందించారు.

## శ్రీగ్లోబల్ హైస్కూల్ అద్భుత ఫలితాలు

- విద్యార్థులను అభినందించిన యాజమాన్యం
- బి.పర్ణిక కు 581 మార్కులతో సత్తా



ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి : పదవ తరగతి ఫలితాలలో శ్రీగ్లోబల్ హైస్కూల్ బుగ్గారం విద్యార్థులు ఉత్తమ ఫలితాలతో సత్తా చాటారు. అదేవిధంగా చట్ట మనీంద్ర 511 మార్కులతో అద్భుత ఫలితాలు సాధించినందుకు పాఠశాల ప్రిన్సిపల్ డాక్టర్ నక్కరాజు విద్యార్థులను పుష్పగుచ్చం అందించి అభినందించారు. జగిత్యాల లోని అక్స్ ఫర్డ్ హైస్కూల్లో చదివిన బి. పర్ణిక 581 మార్కులు సాధించి పాఠశాల పేరు నిల బెట్టింది. స్కూల యాజమాన్యంతో పాటు పేరెంట్స్ డాక్టర్, సృజన అభినందిం చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు.

## వేగవంతంగా ధాన్యం కొనుగోళ్లు

- జిల్లా అదనపు కలెక్టర్ వేణు



ప్రజాపక్షం/ముత్తారం : వరి ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ దాసరి వేణు సంబంధిత అధికారులకు ఆదేశించారు. గురువారం ముత్తారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రాథమిక వ్యవ సాయ సహకార సంఘం,ఐకెపి ఆధ్వర్యంలో చేపడుతున్న కొనుగోలు విషయంపై సంబంధిత అధికారులతో అదనపు కలెక్టర్ వేణు మాట్లాడారు. కొనుగోలు కేంద్రానికి ధాన్యాన్ని తీసుకువచ్చే రైతులు వరి ధాన్యం శుభ్రపర్చి ఆరబెట్టిన, 17 శాతం తేమ వచ్చిన ధాన్యాన్నే తూకం వేయాలన్నారు. అంతేగాకుండా కేంద్రాల్లో ఉన్న వరి ధాన్యాన్నివెంటనే తూకం వేసి రైస్ మిల్లులకు తరలించడంతో పాటు రైతుల వివరా లు ట్యాబ్‌లో నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ మధుసూదన్‌రెడ్డి, ఆర్‌ఐలు రాజాబాబు, శ్రీధర్, ఐకెపి సిసిలు పాల్గొన్నారు.

## భూ భారతిపై అవగాహన

ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి : రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన భూ భారతి 2025 చట్టంపై పోలీస్ అధికారులకు అవగాహన పెంచే ఉద్దేశంతో జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం ప్రత్యేక శిక్షణా శిబిరం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పి అశోక్ కుమార్ ,అదనపు ఎస్‌పి, డిఎస్‌పిలు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌లు, ఎస్‌ఐలు పాల్గొన్నారు. జగిత్యాల ఆర్‌డిఒ మధుసూదన్ భూ భారతి లోని ముఖ్య అంశాలను, ప్రయోజనాలను ప్రజెంటేషన్ రూపంలో వివరించారు. ప్రభుత్వ భూ ముల రక్షణ, ప్రజల హక్కుల హామీ, భూ వివాదాల పరిష్కారంలో పారదర్శకత పెంపు వంటి అంశాలపై స్పష్టతనిచ్చారు. భూ సమస్యల గురించి వచ్చి ఫిర్యాదుల పట్ల పోలీస్ శాఖ వ్యవహరించాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు.

## మహిళల ఆర్థిక స్థిరత్వమే ప్రభుత్వ లక్ష్యం

రాష్ట్ర ఐటి శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు



ప్రజాపక్షం/పెద్దపల్లిప్రతినిధి : మహిళలు ఆర్థిక స్థిరత్వం సాధించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తుందని రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు అన్నారు. గురువారం మంత్రి డి.శ్రీధర్ బాబు మంథని పట్టణంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ తో కలిసి విస్తృతంగా పర్యటించారు. మంథని మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో శ్రీపాద కుట్టు మిషన్ కేంద్రం, ఇందిరా మహిళా శక్తి ద్వారా ఏర్పాటు చేసిన 2.5 లక్షల విలువ గల మొబైల్ క్యాంటీన్, మార్కెట్ ఏరియాలో 5 లక్షల విలువగల నైనిక నైటీస్ అండ్ ఫ్యాషన్ వేర్ మ్యాచింగ్ సెంటర్ మంత్రి ప్రారంభిం చారు. పాత పాల కేంద్రంలో ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రం ఏర్పాటుకు అను వైన స్థలం పరిశీలించారు. మొబైల్ క్యాంటీన్ ప్రారంభించిన మంత్రి అధికారులతో కలిసి టిఫిన్ చేసి చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ మహిళలకు ఆదాయం మార్గాలు పెరగాలి, వారి కుటుంబాలు ఆర్థికంగా పటిష్టం కా వాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాన్ని ప్రారంభించిందని అన్నారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా మహిళలచే కుట్టు మిషన్ కేంద్రాలు, మొబైల్ క్యాంటీన్, వివిధ వ్యాపార యూనిట్ల స్థాపనకు కృషి చేస్తు న్నామన్నారు. మంథని పట్టణంలో మున్సిపల్ కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి శ్రీపాద కుట్టు మిషన్ కేంద్రం ద్వారా 10 మంది మహి ళలకు ఉపాధి లభిస్తుందని, ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ మహిళా సంఘాలకు ప్రభుత్వం అప్పగించిందని మంత్రి తెలిపారు. మహి ళలకు ఉపాధి కల్పించాలని ప్రయత్నంతో మంథని లో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు పక్కాప్రణాళికలతో ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్ర మంలో మంథని ఆర్డీఓ సురేష్, మున్సిపల్ కమిషనర్ మనోహర్, తహసీల్దార్ కుమార స్వామి, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, పాల్గొన్నారు.

## సామాజిక న్యాయం చేసేందుకే రిజర్వేషన్లు

- కులగణన చేపట్టడాన్ని స్వాగతిస్తున్నాం
- ప్రభుత్వ విప్ లక్ష్మ ణ్, మాజీ మంత్రి జీవన్‌రెడ్డి



ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి : సామాజిక న్యాయం చేసేందుకే రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ప్రవేశపెట్టిన రిజర్వేషన్స్‌తోనే నిమ్న వర్గాలు ఫలాలు పొందుతున్నారని రాష్ట్ర ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే, డిసిసి అధ్యక్షులు అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్, మాజీ మంత్రి, తాజా మాజీ ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డిలు అన్నారు. అఖిల భారత కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాహుల్ గాంధీ ఆలోచనకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం కులగణనపై తీసుకున్న నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తూ గురువారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద రాహుల్ గాంధీ,మల్లికార్జున ఖర్గే, సీఎం రేవంత్ రెడ్డి,పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ల చిత్రపటాలకు నిర్వహించిన పాలాభిషేకం కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూ రి లక్ష్మ ణ్ కుమార్ ,మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ డిసీసీ అధ్యక్షులు లక్ష్మ ణ్ కుమార్, మాజీ మంత్రి జీవన్ రెడ్డిలు మాట్లాడుతూ రాహుల్ గాంధీ గత ఎన్నికల ప్రణాళికలో కుల గణన చేపడుతామని హామీ ఇవ్వడం తోపాటు కుల గణన చేపట్టాలనే రాహుల్ గాంధీ డిమాండ్‌కు కేంద్ర ప్రభుత్వం తలొగ్గి కుల గణన చేపడుతామని ప్రకటించడం పై హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. కులగణన తోనే ఆర్థికంగా, సామాజికంగా వెనకబడినవారికి జనాభా వివరాలు వెల్లడవుతాయని చెప్పారు.విద్యా ఉద్యోగ అవ కాశాలు కేవలం ప్రభుత్వ కార్యాలయాలోనే కాకుండా ప్రైవేట్ పాఠశాలల్లో సైతం అమలు చేయాలని,ప్రైవేట్ పాఠశాలల్లో సైతం రిజర్వేషన్లు అమలయ్యేలా కలెక్టర్లు చొరవ చూపాలన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ ఎంపిటిసి గాజంగి నందయ్యా, కళ్లెపెల్లి దుర్గయ్య,బండ శంకర్, గాజుల రాజేందర్, బీరం రాజేష్,మన్సూర్ అలీ, నేహాల్, అల్లాల రమేష్ రావు,పుప్పాల అశోక్,నక్క జీవన్, బారీ,గుండా మధు,పూర్ణ చందర్‌రెడ్డి, గిరిధర్, రఘువిర్ గౌడ్, తోట నరేష్,గోపు రాజిరెడ్డి,ధ్యావర శ్రీనివాస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## హక్కుల సాధనకు సమరశీల పోరాటం తప్పదు

సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు పైడిపల్లి రాజు



ప్రజాపక్షం/కొత్తపల్లి :చికాగో వీధుల్లో కార్మిక వర్గం చిందించిన నెత్తుటి చారికలు నేటికీ స్ఫూర్తిదాయకమని, పోరాటాల ఫలితంగా సాధించుకున్న ఎనిమిది గంటల పనిదినం వంటి హక్కులను కాపాడుకోవాల్సిన బాధ్యత నేటి కార్మికులపై ఉందని సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు ఉద్ఘాటించారు. మేడే సందర్భంగా బొమ్మకల్‌లో కాల్వ నర్సయ్య యాదవ్ చిత్రపటం వద మేడే వేడుకలో అరుణ పతాకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ నాటి పో రాటాలతో సాధించుకున్న విజయాలను పాలకుల కార్మిక వ్యతిరేక విధానాలతో కార్మిక హక్కులను కాలరాస్తున్నాయని, ఈ క్రమంలో కార్మికవర్గమంతా ఐక్య పోరా టాలకు సిద్ధం కావాలన్నారు. బొమ్మకల్ సిపిఐ కార్యదర్శి కాల్వ శ్రీనివాస్ యాదవ్, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు న్యాలపట్ల రాజు, పిఏసిఎస్ మాజీ వైస్ చైర్మన్ బీరం ఆంజనేయులు, హమాలీ నాయకులు మేకల చంద్రయ్య, తదితరులున్నారు.

## కార్మికుల పక్షాన ప్రశ్నించే గొంతుక ఎర్రజెండా

139 మీటర్ల మేడే పతాకంతో ఖనిలో ర్యాలీ

మేడే వేడుకల్లో పాల్గొన్న ఎఐటియుసి నాయకులు





ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : కార్మికుల పక్షాన నిలబడి వారి హక్కుల సాధనకై పాలకులను, యా జమాన్యాలను నిలదీసే బలమైన గొంతుక ఎర్ర జెండా ఎఐటియుసి అని, ఎర్ర జెండా ఎంత బలపడితే కార్మిక వర్గానికి సరైన న్యాయం జరు గు తుందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యునియన్ ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, ఆర్జీ వన్ బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషంలు పేర్కొన్నారు. గురువారం మేడే సందర్భంగా సింగరేణి ఆర్జీ వన్ ఏరి యా లోని గనులు, డిపార్ట్మెంట్, ఓసిపి 5, గోదావరిఖని భాస్కర్ రావు భవన్‌లో జరిగిన మేడే పతాకాలను ఆవిష్కరణ చేసిన అనంతరం వారు మాట్లాడుతూ చికాగో అమ రుల స్ఫూర్తితో భారతదేశంతోపాటు ప్రపంచ వ్యాప్తంగా జరిగిన ఉద్యమాలకు పా లక ప్రభుత్వాలు దిగిరాక తప్పలేదని, బ్రిటీష్ రాజ్యంలో, ఆ తర్వాత స్వతంత్ర భార తంలో పాలకులతో పోరాడి, త్యాగాలు చేసి సాధించుకున్న కార్మికుల హక్కులను ఏకమొత్తంగా బిజెపి ప్రభుత్వం రద్దు చేస్తోందని, మేడే స్ఫూర్తిగా సాధించుకున్న ఎనిమిది గంటల పనిదినాన్ని, యూనియన్లు ఏర్పాటు చేసుకునే హక్కును, సమ్మె చేసే హక్కును కూడా హరించి యాజమాన్యాలకు కార్మికుల శక్తిని దోచిపెట్టే కుట్ర లకు పాల్పడుతోందన్నారు.రైతు వ్యతిరేక చట్టాలను తీసుకువస్తూ గోస పెడుతోందని, పోరాడి సాధించుకున్న 44 చట్టాలను బడా పారిశ్రామిక సంస్థల యజమానులకు అనుకూలంగా నాలుగు కోడులుగా మార్పు చేసిందని వారు ఆరోపించారు. ప్రజల కోసం కా కుండా ఆర్థిక బకాసురులకు, ఆర్థిక నేరగాళ్లకు మోడీ ప్రభుత్వం కొమ్ము కాస్తోందని వారు విమర్శించారు. దేశ సంపద, కార్మిక చట్టాల పరిరక్షణ ఉద్యమ దినంగా దేశ వ్యాప్తంగా మేడేను జరుపుకుంటున్నామని, మేడే పతాకావిష్కరణ అనంతరం గోదావరిఖని భాస్కర్ రావు భవన్ నుంచి రీగల్ షుమార్టు వరకు 139 మీ టర్ల మేడే పతాకంతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి ఉపాధ్యక్షులు మాదన మహేష్, సహాయ కార్యదర్శి రంగు శ్రీను, బోగ సతీష్ బాబు, కే.శ్రీనివాస రావు, సిద్దమల్ల రాజు, సిర్ర మల్లికార్జున్, ఎం.చక్రపాణి, దొంత సాయన్న, పెర్క మహేందర్, గండి ప్రసాద్, సోహేల్, చెప్యాల భాస్కర్, మానాల శ్రీనివాస్, పొన్నాల వెంకటయ్య, కారంపూడి వెంకన్న, గుర్రం ప్రభుదాస్, గొడిశల నరేష్, బలుసు రవి, బండి మల్లేష్, దాసరి శ్రీనివాస్, సూర్య, ప్రీతం, ఆఫీస్ కార్యదర్శి తొడుపునూరి రమేశ్ కుమార్ పాల్గొన్నారు.

## మేడే స్ఫూర్తితో పోరాడుదాం

సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం



ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : మేడే స్ఫూర్తితో కార్మికుల సమస్యలపై పోరాడాలని సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం అన్నారు. గురువారం ప్రపంచ కార్మి కుల దినోత్సవం మేడే సందర్భంగా భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యం లో పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించుకోవడం జరిగింది. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథి గా సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి తాండ్రా సదానందం హాజరై జెండా ఆవిష్కరణ అనంతరం కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ మేడే స్ఫూర్తితో కార్మికుల సమస్యలపై పోరాడాలని కార్మికులకు పిలుపునిచ్చారు. సమాన పనికి సమానం వేతనం ఇవ్వాలనీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలని డిమాండ్ చేశారు. కాం ట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికుల రెగ్యులరై జేషన్, ప్రభుత్వ హాస్పటల్‌లో ఏజెన్సీ లను రద్దు చేసి ప్రభుత్వమే కార్మికులను రిక్రుట్ మెంట్ చేసుకోవాలని, సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రతకై, జీవించడానికి సరిపడే వేతనాలు, పెన్షన్ పెంపు, కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ అమలు నిలుపుదల కోసం మేడే స్ఫూర్తిగా పోరాడాలని కార్మికులకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో చంద్రగిరి ఉదయ్ ఆరెపల్లి మానస్ కుమార్ బండారి సదానందం ఆరెపల్లి మనోజ్ మాచర్ల లక్ష్మ ణ్ మాచర్ల శంకర్ జబీ. సలీమ్. అమాన్ వంశీ అరుణ్ బోయిని రమేష్ కార్మికులు పాల్గొన్నారు.

## కార్మికుల హక్కుల కోసం పోరాటం

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కొయ్యడ సృజన్ కుమార్



ప్రజాపక్షం/రామడుగు : చికాగో అమరుల స్ఫూర్తితో కార్మికుల హక్కుల సాధన కోసం కార్మికలోకం ఉద్యమించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కొయ్యడ సృజన్ కుమార్ పిలుపునిచ్చారు. గురువారం మేడే పురస్కరించుకుని రామడుగు మండలంలో అనేక గ్రామాల్లో ఎర్ర జెండాలు ఎగురవేశారు. ఈ సందర్భంగా సృజన్ కుమార్ మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో కార్మికులు అనేక సమస్యలను, సవాళ్లను ఎదుర్కోవాల్సిన సమయం ఆసన్నమైందని, 44 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్‌లుగా తేవడంతో కార్మికులు శ్రమదోపిడీకి గురవుతారని, రక్షణ లేకుండా సం క్షేమ ఫలాలు అందకుండా పోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రమదోపిడీ లేని వ్యవస్థ కోసం, హక్కుల సాధన కోసం సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులు ఐక్యంగా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి గొడిశాల తిరుపతి గౌడ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు మచ్చ రమేష్, ఉమ్మెంతుల రవీందర్ రెడ్డి, సీనియర్ నాయకులు గంటె రాజేశం, వేముల మల్లేశం, శంకరయ్య, నాంపెల్లి, పాల్గొన్నారు.

## ఆల్ఫోర్స్ మహిళా డిగ్రీ,పిజి కళాశాలకు జాతీయ అవార్డు



ప్రజాపక్షం/కరీంనగర్: ఢిల్లీలోని ఆసియా టుడే మీడియా సంస్థ నిర్వహించిన 'ప్రపంచ విద్యా సమ్మిట్ 2025' కార్యక్రమంలో 'తెలంగాణలో ఉత్తమ మహిళా డిగ్రీ కళాశాల'గా కరీంనగర్‌లోని ఆల్ఫోర్స్ మహిళా డిగ్రీ, పిజి కళాశాలను గుర్తించి జాతీ య అత్యుత్తమ అవార్డుతో గౌరవించింది. 30న ఢిల్లీలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర సహాయ మంత్రి భూషణ్ చౌదరి, ఫిజి కమిషన్ కౌన్సెలర్ నీలేష్ కుమార్, డిప్యూటీ స్పీకర్ మోహన్ సింగ్ బిస్ట్ చేతుల మీ దుగా కళాశాల కరెస్పాండెంట్ వూట్కూరి రవీందర్‌రెడ్డి అందుకున్నారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డి మా ట్లాడుతూ అల్ఫోర్స్ మహిళా డిగ్రీపిజి కళాశాల కరీంనగర్ విద్యారంగంలో అఖండ ప్రతిష్టను సంపాదించుకుంటూ మరో గౌరవాన్ని తన ఖాతా లో వేసుకుందని తెలిపారు. తెలంగాణ తరపునతమ కళాశాలకు అవార్డు రావడం గర్వ ంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. కళాశాల విద్యార్థినుల సర్వోత్త మ వికాసానికి వేదిక అన్నారు. గడిచిన సంవత్సరాల్లో విద్య,నైపుణ్యం, శాస్త్రీయ దృష్టి, నైతిక విలువలు, ప్రాంగణ నియామకాలు, విద్యార్థుల ఉత్తీర్ణత శాతం, విద్యార్థి అధ్యాపకుల నిష్పత్తి, కళాశాల సా ధించిన ప్రగతిని పరిగణలోకి తీసుకుని త గిన గుర్తింపునివ్వడం జరిగిందన్నా రు.రాష్ట్రీయ, అంతర్రాష్ట్రీయ పురస్కారాలను అందుకుంటూ తెలంగాణ రాష్ట్రానికి గ ర్వకారణంగా నిలుస్తోందన్నారు. భవిష్యత్తులో మహిళా విద్యావికాసానికి మరింత సమర్థవంతంగాసేవలందించేందుకు కట్టుబడి ఉన్నామన్నారు.

## కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్రం

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కసిరెడ్డి సురేందర్ రెడ్డి



ప్రజాపక్షం/కొత్తపల్లి : కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభు త్వం కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఐ జిల్లా కార్య వర్గ సభ్యుడు కసిరెడ్డి సురేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మేడే సందర్భంగా కరీంనగర్ రూరల్ మండలంలోని చామనపల్లి గ్రామంలో హమాలీ కార్మికులు ఏర్పాటు చేసిన జెండాను సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, నగునూరులో ఏఐటియుసి జెండాను హమాలీ సంఘం అధ్యక్షుడు నెల్లి రాజేశం ఎగురవేశారు. ఈ సందర్భంగా కసిరెడ్డి సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ కార్మికులకు అండగా సిపిఐ ఉం టుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఐ రూరల్ మండల కార్యదర్శి సాయవేణి రాయమల్లు, మెరుగు కొమురయ్య, దొమ్మాటి నాంపల్లి, అదే విధంగా నగునూరులో పరిష పోషయ్య, దొంతి ఆంజనేయులు, నెల్లి రవీందర్, రమేష్ తదితరులున్నారు.

## పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



ప్రజాపక్షం/కరీంనగర్ : కరీంనగర్‌లోని 21వ డివిజన్‌లో సిసి రోడ్లు, డ్రైనేజీల నిర్మా ణానికి స్థానిక డివిజన్ మాజీ కార్పోరేటర్ జంగిలి సాగర్‌తో కలిసి పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గంగుల శంకుస్థాపన చేశారు. సుమారు రూ.కోటి 23 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో ఈ పనులను చేపట్టారు. అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గంగుల కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గంగులతో పాటు నగర బిఆర్ఎస్ అధ్యక్షుడు చల్ల హరిశంకర్, 21 డివిజన్ మాజీ కార్పొరేటర్ జంగిలి సాగర్, మాజీ కార్పోరేటర్లు ఐలేందర్ యాదవ్, గందె మహేష్, మున్సిపల్ అధికారులు, పలువురు బిఆర్ఎస్ నాయకులు తదితరులున్నారు.

## ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అభినందనలు

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : ప్రభుత్వ ఇటీవల విడుదల చేసిన పదవ తరగతి, ఇంటర్ ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ప్రత్యేక అభినందనలు తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ను సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ఇటీవల ఫలితాలు పొందిన మంథని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల/కళాశాల, మైనారిటీ బాలికల గురుకుల కళాశాల 10వ తరగతి , ఇంటర్ విద్యార్థులు కలిసారు.జిల్లా కలెక్టర్‌మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందిం చారు. మంథని లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల 10వ తరగతి ఫలితాల్లో 100% ఉత్తీర్ణత సాధిం చిందని, అత్యుత్తమ మార్కులు సాధించిన ఎం అజయ్ కుమార్ 573,ఆర్ అభినవ్ 566, ఆర్‌కౌశిక్ భార్గవ్ 563,పి .చందు 561,డి.శివ చరణ్ తేజ 558 మార్కులు విద్యార్థులను,ఫలితాలు రావడానికి కష్టపడ్డ ఉపాధ్యాయుని ఉపాధ్యాయులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. అదే విధంగా ప్రభుత్వం ప్రకటించిన ఇంటర్మీడియట్ ఫలితాలలో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాల బాలురు (మంథని)96%ఉత్తీర్ణతతోరాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించినట్లు పేర్కొన్నా రు. జె.శ్రీనివాస్ ఎంపిసిలో 983మార్కులు, జే.సంతోష్ 963 అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను, ఉపాధ్యాయుని, ఉపాధ్యా యులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. ఇంటర్ పరీక్ష ఫలితాలో మొదటి సంవత్సరం, రెండవ సంవత్సరం టాపర్లుగా నిలిచిన విద్యార్థులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనాథ్,మైనార్టీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అస్మాజబీన్, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన డిసిసి అధ్యక్షుడు

**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్:** సిఎంఆర్ఎఫ్ పేదలకు వరమని డిసిసి అధ్యక్షుడు కూచాడి శ్రీహరి రావు అన్నారు.నిర్మల్ జిల్లా కేంద్రంలోని డీసీసీ క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్మల్ నియోజకవర్గంలోని 43 మంది లబ్ధిదారులకు రూ.18 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలనే సంకల్పంతో ప్రభుత్వం వైద్య రంగాన్ని బలోపేతం చేస్తూనే,నిరుపేద రోగులకు వైద్య ఖర్చుల భారం పడకుండా సకాలంలో సీఎంఆర్ఎప్ ఫండ్ కింది నిధులు విడుదల చేస్తోందని తెలిపారు. ప్రైవేట్, కార్పొరేట్ అస్పత్రుల్లో ఖరీదైన వైద్యచికిత్స చేసుకోలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్న ఎన్నో కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఆసరాగా నిలుస్తుందన్నారు. బాధితులు అవసరమైన సమయంలో సిఎం రిలీఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల అధ్యక్షులు ఇంద్రకరణ్‌రెడ్డి,బ మధుకర్ రెడ్డి, నర్సయ్య, శ్రీనివాస్ రెడ్డి, భీమ్‌రెడ్డి, అబ్దుల్ హాది, చిన్ను, శ్రీనావాస్, రవికూమార్, తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ, ఎఐటియుసి ఆధ్వర్యంలో ఘనంగా మేడే దినోత్సవం

**ప్రజాపక్షం/బాన్సువాడ:** గురువారం బాన్సువాడ పట్టణంలోని సిపిఐ కార్యాలయం ముందు కార్మిక వర్గ పోరాట దినం అయిన మేడేను సిపిఐ, ఏఐటియుసి ఆధ్వర్యంలో ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సిపిఐ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి, తెలంగాణ రాష్ట్ర బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుబాస్ రాములు మేడే జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆనాడు కార్మికులు 8 గంటల పని దినం కావాలని, 1886 సంవత్సరంలో అమెరికాలోని చికాగో నగరంలో సమ్మె చేస్తున్న కార్మికులపై యాజమాన్యాలు పోలీసులతో కార్మికులపై తుపాకితో కాల్పులు జరపడం వలన ఎంతోమంది అమరులయ్యారని వారి రక్తంతో తడిసిన గుడ్డలతోనే కార్మికులు ఎర్రజెండా ఎగిరేశారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో తోటపల్లి శ్రీనివాస్, శివాజీ, రాజు, కుమార్ దేవాంగ, కుమ్మరి రాములు, కొత్త సాయిలు, ఒడ్డు సాయిలు, ఒల్లెపు గంగాధర్, మొగులయ్య, హన్మాండ్లు, కృష్ణ, పోశెట్టి, నాగమణి, పాల్గొన్నారు.

## విజయం సాధించాలంటే పట్టుదల అవసరం



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్:** కష్టపడితే ఏదైనా సాధ్యం విజయానికి పట్టుదలే పునాది అని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పేర్కొన్నారు. పదో తరగతి ఫలితాల్లో నిర్మల్ జిల్లా విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ప్రభుత్వ బాలుర గిరిజన ఆశ్రమ పాఠశాల, ఖానాపూర్‌కు చెందిన జాదవ్ ఈశ్వర్ 561 మార్కులతో జిల్లా టాపర్‌గా నిలవగా, భుక్యాగౌతమ్ 558 మార్కులు సాధించి ప్రతిభను చాటాడు,గురువారం జిల్లా కలెక్టర్ విద్యార్థులను స్వయంగా తన ఛాంబరులో శాలువాలతో సత్కరించి మిఠాయిలు తినపిస్తూ అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పదో తరగతి ఫలితాల్లో జిల్లా విద్యార్థుల విజయం గర్వించదగిన విషయమన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కృషికి ఇది నిదర్శనమని వారికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన విద్యా విధానం వల్లే ఈ ప్రతిభ వెలుగులోకి వచ్చింది అని వివరించారు. ఈ ఫలితాలు జిల్లా యంత్రాంగానికి నూతన ఉత్తేజానిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంబాజీ, సీపీఓ జీవరత్నం, వ్యాయామ ఉపాధ్యాయులు భూక్యా రమేష్, ఇతర ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/కోటగిరి:** వర్ని మండల కేంద్రంలో పలువురు కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ లబ్ధిదారులకు చెక్కులను తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. 147మంది కళ్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కులను పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్ని ఎంఎసీ ఛైర్మన్ సురేష్ బాబా, కోటగిరి ఎఎంసి ఛైర్మన్ గైక్వాడ్ హనుమంతు, ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు, నాయకులు పాల్గొన్నారు.

## స్టేట్ ర్యాంక్ సాధించిన శ్రీతేజను సన్మానించిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/ కాగజ్ నగర్ :** పిపిఆర్ మెమోరియల్ లైబ్రరీలో చదివి స్టేట్ ర్యాంక్ సాధించిన గోమాస శ్రీతేజకు అండగా నిలుస్తాం అని సిర్పూర్ శాసనసభ్యుడు డా. పాల్వాయి హరీష్ బాబు అన్నారు. గురువారం కాగజ్ నగర్ పట్టణంలోని సర్‌సిల్క్ లో ఉన్న ఎంఎల్‌ఏ నివాసంలో విద్యార్థిని శ్రీతేజను సన్మానించి అభినందనలు తెలిపారు. తీరందాస్ బస్తికి చెందిన గోమాస విజయ్ కుమార్ కుమార్తె శ్రీతేజ, కాగజ్ నగర్ లోని వివేకానంద జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపిసి గ్రూపులో రాష్ట్ర స్థాయిలో రెండవ ర్యాంకు సాధించినట్టు తెలిపారు. పట్టణంలోని పిపిఆర్ మెమోరియల్ లైబ్రరీలో చదివి ఈ స్థాయికి చేరుకున్న శ్రీతేజ అనేకమందికి ప్రేరణగా నిలుస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని కుటుంబ సభ్యులు, సమాజంలో విశేషంగా సేవలందిస్తున్న వ్యక్తులు పాల్గొన్నారు.

## అభ్యంతరకర పోస్టులు పెడితే చర్యలు తప్పవు

సిఐ దేవేందర్ రావు హెచ్చరిక



**ప్రజాపక్షం/చెన్నూరు:** సోషల్ మీడియాలో అభ్యంతరకరమైన పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవని చెన్నూరు సిఐ దేవేందర్ రావు హెచ్చరించారు. చెన్నూరు పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యక్తులను లేదా వర్గాలను కించపరిచేలా, నిందించేలా ఫేస్‌బుక్, వాట్సాప్ గ్రూపుల్లో పోస్టులు చేయవద్దని సూచించారు. అభ్యంతరకర పోస్టులు పెట్టినా, వాటిని షేర్ చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, అలాంటి పోస్టులకు వాట్సాప్ గ్రూప్ అడ్మిన్‌లే బాధ్యత వహించాల్సి వస్తుందని, ప్రజలు సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మవద్దని కోరారు.

## రేషన్ బియ్యం విక్రయిస్తే రేషన్ కార్డు రద్దు

**ప్రజాపక్షం/తాండూర్:** అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యం విక్రయిస్తే వారి రేషన్ కార్డులు రద్దు చేయబడతాయని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సబావత్ మోతిలాల్ హెచ్చరించారు.తాండూర్ మండలం అచలాపూర్ గ్రామానికి చెందిన 11 మంది రేషన్ కార్డుదారులు ప్రభుత్వ సన్న బియ్యం విక్రయించినట్లు సమాచారం అందిందని ఆయన తెలిపారు. దీంతో సంబంధిత లబ్ధిదారుల రేషన్ కార్డులను రద్దు చేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. అచలాపూర్‌కు చెందిన కుంకుమొట్టి మహేష్‌కు ఈ 11 మంది బియ్యం విక్రయించినట్లు గుర్తించామని, మహేష్ నివాసంలో తనిఖీలు చేయగా సన్న బియ్యం నిల్వలు లభ్యమయ్యాయని మోతిలాల్ వెల్లడించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆ రేషన్ కార్డులను రద్దు చేశామని తెలిపారు. నిరుపేదల కోసం చౌక ధరల దుకాణాల ద్వారా పంపిణీ చేస్తున్న సన్న బియ్యం ఎవరైనా విక్రయిస్తే వారి కార్డులు రద్దు చేయడంతో పాటు, బియ్యం విక్రయించిన వారు మరియు కొనుగోలు చేసిన వారిపై చట్ట ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని అదనపు కలెక్టర్ మోతిలాల్ స్పష్టం చేశారు.

# కార్మిక హక్కుల సాధనకు సమరశీల పోరాటం

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్




**ప్రజాపక్షం/నస్పూర్:** చికాగో వీధుల్లో కార్మిక వర్గం చిందించిన నెత్తుటి చారికలు నేటికీ స్ఫూర్తిదాయకమని, పోరాటాల ఫలితంగా సాధించుకున్న ఎనిమిది గంటల పని దినం వంటి హక్కులను కాపాడుకోవాల్సిన బాధ్యత నేటి కార్మికులపై ఉందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్ ఉద్ఘాటించారు. మే డే సందర్భంగా ఆర్‌కె 6 గని వద్ద జరిగిన వేడుకలో అరుణపతాక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలవేన శంకర్ మాట్లాడుతూ అప్పటి దుర్మార్గపు ప్రభుత్వం కార్మికుల గొంతు నొక్కాలని ప్రయత్నించినా, కార్మిక ఐక్య పోరాటం ముందు తలవంచక తప్పలేదని గుర్తు చేశారు. న్యాయమైన వేతనాలు, పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు, జీతంతో కూడిన సెలవులు, మహిళా కార్మికులకు ప్రసూతి సెలవులు, కార్మిక సంక్షేమ చట్టాలు వంటి ఎన్నో విజయాలు ఆ పోరాటాల ఫలితమేనని అన్నారు. నేడు పరిస్థితులు మళ్లీ మారుతున్నాయని, పాలకుల కార్మిక వ్యతిరేక విధానాలు కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కార్మిక వర్గం మరింత ఐక్యంగా, సమైక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. సాంకేతికత యుగంలో కార్మికులు కొత్త నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలని, తద్వారా ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. సంఘటిత, అసంఘటిత రంగాల తేడా లేకుండా కార్మికులందరూ ఒకే తాటిపై నిలబడి తమ హక్కుల కోసం గళం విప్పాలని పిలుపునిచ్చారు. సమానత్వం కోసం జరిగే ఈ పోరాటంలో ప్రతి ఒక్క కార్మికుడు భాగస్వామ్యం కావాలని ఆకాంక్షించారు. పర్యావరణ పరిరక్షణ నేటి తక్షణ అవసరమని గుర్తించి పరిశ్రమలు పర్యావరణ అనుకూలంగా మారాల్సిన అవసరం ఉందని, కార్మికులు కూడా ఆ దిశగా తమ వంతు సహకారం అందించాలని కోరారు. ప్రస్తుతం దేశంలో మతోన్మాద బిజెపి ప్రభుత్వం కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తూ, కార్మికుల హక్కులను హరిస్తోందని తీవ్రంగా విమర్శించారు. ఆటో రిక్షా కార్మికుల నుండి మొదలుకొని అడ్డా కూలీల వరకు ప్రతి ఒక్క కార్మికుడు ప్రపంచ కార్మికులారా ఏకంకండి అనే చారిత్రాత్మక నినాదంతో స్ఫూర్తి పొంది, సమానత్వం కోసం, తమ హక్కుల కోసం ఐక్య పోరాటం చేయాలని గట్టిగా పిలుపునిచ్చారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక, కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు కార్మిక వర్గం సిద్ధంగా ఉండాలని అన్నారు. కార్మిక శక్తికి తిరుగులేదని నిరూపించే సమయం ఆసన్నమైందని ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి ఆర్‌కె 6 మైన్ ఫిట్ కార్యదర్శి సదానందం, ఏరియ వైస్ ప్రెసిడెంట్ కొటేషన్ రావు, గొర్రె నరసయ్య, సురేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు కారుకూరి నాగేష్, చిలక రామచందర్ ఫిట్ కమిటి కమిటీ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

## మేడేను ఘనంగా జరుపుకున్న ఆర్‌టిసి ఉద్యోగులు



**ప్రజాపక్షం/బాన్సువాడ:** బాన్సువాడ ఆర్‌టిసి డిపో ఆధ్వర్యంలో గురువారం మేడేను పురస్కరించుకొని ఆర్‌టిసి ఉద్యోగులు కార్మిక జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా మేడేను కార్మిక దినోత్సవం జరుపుకోవడం జరుగుతుందని, అన్ని రంగాల్లో కార్మికుల కృషితోనే దేశం అభివృద్ధి బాటలో నడుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డిపో ఎస్‌డబ్ల్యు కార్యదర్శి మల్లయ్య, కుమార్ దేవంగా, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గోలి లక్ష్మణ్, ఏఆర్ గౌడ్, బిహెచ్ గౌడ్, గోపాల్, సాయిలు, ఖదీర్, దుర్గయ్య, ఉద్యోగస్తులు పాల్గొన్నారు.

## ఘనంగా మేడే ఉత్సవాలు



**ప్రజాపక్షం/మందమర్రి:** మందమర్రిలో ఎఐటియుసి యూనియన్ ఆధ్వర్యంలో ప్రపంచ కార్మికుల దినోత్సవం మే డేను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన కొర్మి రాజ్ కుమార్ మాట్లాడుతూ 1886లో అమెరికాలోని చికాగో నగరంలో హే మార్కెట్‌లో 8 గంటల పని హక్కుల కోసం వేలాది మంది కార్మికులు ప్రదర్శన చేస్తుండగా పోలీసులు కాల్పులు జరపడంతో వందలాది మంది కార్మికులు అమరులయ్యారని గుర్తు చేశారు. కార్మికులు తమ రక్తంతో ఎర్రజెండాను ఎగురవేశారని ఆయన తెలిపారు. సింగరేణి కాలరీస్‌లో ఎఐటియుసి యూనియన్ ఎల్లప్పుడూ కార్మికులకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భీమనాథుని సుదర్శన్, సోమిశెట్టి రాజేష్, కంది శ్రీనివాస్, పెద్దపల్లి బానయ్య తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ ఆధ్వర్యంలో పలు చోట్ల అరుణ పతాకం ఆవిష్కరణ



**ప్రజాపక్షం/బెల్లంపలి:** మే డే సందర్భంగా బెల్లంపల్లి పట్టణంలో భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆధ్వర్యంలో పలు చోట్ల ఘనంగా అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. పట్టణ పార్టీ కార్యాలయంలో పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమౌళి, భగత్ సింగ్ విగ్రహం వద్ద రాష్ట్ర సమితి సభ్యులు మిట్టపల్లి వెంకటస్వామి, ఏరియా హాస్పిటల్ వద్ద జిల్లా కార్యవర్గ సభ్యులు దాగం మల్లేష్, భవన నిర్మాణ సంఘం కార్యాలయంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జాడి పోచం, రైల్వే స్టేషన్ వద్ద మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు బొల్లం సోనీ, ఇంక్లైన్ వద్ద పట్టణ కార్యవర్గ సభ్యులు బొంకూర్ రామచందర్, రైల్వే రడగంబాల వద్ద శాఖ కార్యదర్శి రాజన్న, పాత బెల్లంపల్లిలో జిల్లా సమితి సభ్యులు మేకల రాజేశం అరుణ పతాకాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా పట్టణ కార్యదర్శి ఆడపు రాజమౌళి, రాష్ట్ర సమితి సభ్యులు మిట్టపల్లి వెంకటస్వామి, జిల్లా కార్యవర్గ సభ్యులు దాగం మల్లేష్ మాట్లాడుతూ కార్మిక వర్గ పోరాటాల ఫలితంగా సాధించుకున్న 44 కార్మిక చట్టాలను మోదీ ప్రభుత్వం నాలుగు కోడ్‌లుగా మార్చి కార్మిక హక్కులను హరిస్తోందని, దీనికి వ్యతిరేకంగా కార్మిక వర్గం ఐక్యంగా పోరాడాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి బొంతల లక్ష్మీనారాయణ, జిల్లా సమితి సభ్యులు అక్క పెల్లి బాబు, డిఆర్ శ్రీధర్, గుండా చంద్ర మాణిక్యం, బియ్యాల ఉపేందర్, మేకల రాజేశం, పట్టణ సహాయ కార్యదర్శి కొంకుల రాజేష్, ఏఐటియుసి బ్రాంచి సహాయ కార్యదర్శి దాసరి తిరుపతి గౌడ్, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు బొల్లం సోనీ, పట్టణ కార్యవర్గ సభ్యులు మంతెన రమేష్, రత్నం రాజం, రామచందర్, బొల్లం తిలక్ అంబేద్కర్, దాసరి అనిల్ కుమార్, కాసిపేట మైన్ 1 పిట్ కార్యదర్శి మీనుగులక్ష్మీ నారాయణ, కాసిపేట మైన్ 2 పిట్ కార్యదర్శి గొల్ల శ్రీనివాస్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి భోగే ఉపేందర్



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్:** కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని రెబ్బెన మండలంలో గ్రామ పంచాయతీ కార్మికులు గురువారం సిఐటియు యూనియన్ నుండి ఎఐటియుసిలో చేరారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) మండల అధ్యక్షుడు రాచకొండ రమేష్ మే డే జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ మాట్లాడుతూ ఎఐటియుసి చేస్తున్న పోరాటాలకు ఆకర్షితులై సిఐటియు నుండి సుమారు 100 మంది గ్రామ పంచాయతీ కార్మికులు ఎఐటియుసిలో చేరడం జరిగిందని తెలిపారు. గ్రామ పంచాయతీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, గ్రీన్ ఛానల్ ద్వారా ప్రతినెల 1వ తేదీ లోపు వేతనాలు చెల్లించాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, జిఓ నెంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లించి ఇఎస్ఐ, పిఎఫ్, ఇన్సూరెన్స్, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. మే డే స్ఫూర్తితో ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి రత్నం దేవాది, వర్కింగ్ ప్రెసిడెంట్ దుర్గం వెంకటేశ్, సీనియర్ నాయకులు నాగవెల్లి సుధాకర్, గ్రామ పంచాయతీ కార్మికులు శ్రీనివాసు, శంకరి, ప్రవీణు, సునీలు, శంకర్, లక్ష్మణ్, బాపు, రాజేశ్వరి, రాజమ్మ, దుర్గ, పోచుబాయి, శోభ, శేఖర్, నర్సయ్య, వెంకటేష్, ధర్మయ్య, ననాజీ, ఆత్మా రావు, ఓదెలు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కార్మిక దినోత్సవ వేడుకలు



**ప్రజాపక్షం/గజ్వేల్:** నియోజకవర్గ పరిధిలో 139 వ కార్మిక దినోత్సవం సందర్భంగా ఎఐటియుసి భవన నిర్మాణ కార్మిక సంఘం సిద్దిపేట జిల్లా సెక్రెటరీ శివలింగు కృష్ణ ఆధ్వర్యంలో గ్రామాలల్లో ఎఐటియుసి జెండా ఆవిష్కరించారు. జాలిగామా, బయ్యారం, లింగరాజుపల్లి, గజ్వేల్ ఆర్ అండ్ ఆర్ కాలనీ పల్లెపహాడ్, వేములఘట్, సింగారం గ్రామాలలో కార్మిక దినోత్సవం వేడుకలు నిర్వహించి కార్మికుల హక్కులపై చైతన్యం చేశారు. ముఖ్యంగా కార్మికుల అభ్యున్నతికి కృషిచేస్తూ పోరాట పటిమ చాటుతామని అన్నారు. నిరంతర శ్రమను నమ్ముకున్న కార్మికులకు ప్రభుత్వాలు కూడా సానుకూల ధోరణితో వ్యవహరించాలని కోరారు.

## కార్మిక శక్తి లేనిదే సమాజం ముందుకు వెళ్ళదు

ఎఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి ఎల్ ఉపాలి



**ప్రజాపక్షం/ఖానాపూర్ :** కార్మిక శక్తి లేనిదే సమాజం ముందుకు వెళ్ళదని ఎఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి ఎల్ ఉపాలి అన్నారు. ఆయన ఆధ్వర్యంలో ఖానాపూర్ పట్టణంలో ర్యాలీ నిర్వహించి మేడే దినోత్సవం ఘనంగా నిర్వహించారు.అనంతరం ఎఐటియుసి జండా ఎగరవేశారు. ఈ సందర్భంగా ఎఐటియుసి యూనియన్ నిర్మల్ జిల్లా సహాయ కార్యదర్శి ఎల్ ఉప్పాలి మాట్లాడుతూ మన హక్కులను మనం కాపాడుకోవాలంటే మునుముందు పోరాటాలు చేయవలసిన అవసరం ఎంతో ఉందని పేర్కొన్నారు. కార్మిక, కర్షకులు అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ ముందుకు వెళ్లడం ప్రస్తుతం అత్యంత అవసరమని పేర్కొన్నారు. కార్మిక వర్గం పక్షాన నిలబడి వారికి మేలు చేయడమే లక్ష్యంగా సిపిఐ పార్టీ లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో భవాని మన కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కడకుంట రవి, చిలుకూరి ఇస్తారి, భీమయ్య, నరసింహులు, రాజలింగం, పిట్టల భీమేష్,పిల్లి రమేష్, పిట్టల చిన్న భీమేష్, తదితరులు పాల్గొన్నారు.

## శ్రామిక ప్రజల సమస్యలపై ఐక్యంగా ఉద్యమిద్దాం



**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్:** చికాగో పోరాట స్ఫూర్తితో రైతాంగ, కార్మిక, ప్రజా సమస్యలపై ఐక్యంగా ఉద్యమిద్దామని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. మంగళవారం భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో 139 వ మేడే సందర్భంగా అంబేడ్కర్ కాలనీలో గల హమాలీ యూనియన్ కార్యాలయం వద్ద సిపిఐ జెండా ఎగురవేసిన అనంతరం మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందన్నారు. కార్మికులు పోరాడి తెచ్చుకున్న కార్మిక చట్టాలను రద్దు చేయడం అంటే కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్నట్టు స్పష్టంగా అర్థమవుతుందన్నారు. 1886 లో అమెరికా దేశంలోని చికాగో నగరంలో జరిగిన పోరాటం మూలంగానే కార్మికులకు 8 గంటల పనివిధానం అమలైందని, ఆ పోరాట స్ఫూర్తితోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న రైతాంగ, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై అందరు ఐక్యంగా ఉండి పోరాటం నిర్వహించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి వై.ఓమయ్య, బి. రఘు రాం, అలీ, ఇమ్రాన్, ఫిరోజ్, అంజలి, దేవేందర్, రాధాకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రి వద్ద మేడే వేడుకలు

**ప్రజాపక్షం/గజ్వేల్:** అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర డిప్యూటీ కార్యదర్శి పాశికంటి నర్సింలు మేడే జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ గజ్వేల్ నియోజకవర్గ కార్యదర్శి కానుగుల రమణాకర్ పాల్గొని మాట్లాడారు. శ్రమజీవుల కష్టానికి మేడే గుర్తింపు కాగా, కార్మిక పోరాటానికి మేలుకొలుపు అని స్పష్టం చేశారు. ప్రతి కార్మికుడు సంఘటితంగా ఉద్యమించి హక్కులను సాధించుకోవాలని పిలుపు నిచ్చారు. తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర డిప్యూటీ కార్యదర్శి నర్సింలు మాట్లాడుతూ, మన హక్కుల కొరకు మనమే పోరాడాలని, కలిసికట్టుగా ఉండాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం తరపున కార్మిక గుర్తింపు కార్డు ప్రతి ఒక్కరు తీసుకోవాలని, కేంద్ర ప్రభుత్వం ద్వారా బ్యాంకులో ఇన్సూరెన్స్ కొరకు సంవత్సరానికి రూ.12, లేదా రూ.321లతో రూ.5 లక్షల బీమా తీసుకోవాలని కోరారు. సమాన పనికి, సమాన వేతనం ఇవ్వాలని, పారిశుధ్య కార్మికులకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను వెంటనే రెగ్యులర్ చేసి వారి జీవితంలో వెలుగు నింపాలని స్పష్టం చేశారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా సెక్రెటరీ శివలింగ కృష్ణ, నాయకులు మెట్టు శ్రీను, కొండకింది పోచయ్య, స్టూడెంట్ ఆర్గనైజేషన్ నాయకులు మల్కగల్లి యశ్వంత్, వైద్య సిబ్బంది సువర్ణ, స్వరూప రాణి, దేవసాని వాసుదేవ్, బి.సురేందర్, రాము, తిరుపతిరెడ్డి, సమీర్ పాల్గొన్నారు.



## ఐక్యతకు ప్రతీక మేడే



**ప్రజాపక్షం/ఆర్మూర్:** పట్టణంలో 139వ మేడే సందర్భంగా భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ జిల్లా నాయకులు ఆరేపల్లి సాయిలు ఆధ్వర్యంలో గురువారం మేడే వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. వ్యవసాయ మార్కెట్ యార్డులో సిపిఐ అనుబంధ కార్మిక సంఘం ఏఐటియుసి జెండా ఎగురవేశారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తాలో సిపిఐ జెండాను జిల్లా నాయకులు సాయిలు ఎగురవేసి అనంతరం మాట్లాడారు. కార్మికుడు తన చెమట చుక్కలను, రక్త మాంసాలను కరిగించి పనిచేస్తేనే ఈ ప్రపంచం ముందుకు సాగుతుందన్నారు. వారి శ్రమకు తగిన గుర్తింపు ఇస్తు జరుపుకునే పండుగే కార్మిక దినోత్సవమన్నారు. మేడే కార్మికుల ఐక్యత, పోరాటాలకు నిదర్శనంగా నిలుస్తుందన్నారు. మేడేను అంతర్జాతీయ కార్మిక దినోత్సవం అని కూడా పిలుస్తారన్నారు. నాడు కార్మికుల శ్రమను గుర్తించలేని పెట్టుబడిదారి కార్పొరేట్ కంపెనీలకు ఎదురునిలిచి 8 గంటల పని కొరకు పోరాట ఫలితంగానే నేడు కార్మికులు తమ శ్రమను నమ్ముకుని చాలీచాలని జీతాలతో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, గ్రామ పంచాయతీ ఆశ వర్కర్స్, అంగన్‌వాడి, మధ్యాహ్న భోజన కార్మికులు జీవిస్తున్న వారి శ్రమను మాత్రం ఈ ప్రభుత్వాలు గుర్తించడం లేదన్నారు. కార్యక్రమంలో మౌలానా, సోమా, శ్రీను, ఫెరోజ్, శ్రీకాంత్, రహీం, పరశురాం, మంగ, జమున, దుర్గం రాజేందర్, నవాబు, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫోకస్

# వ్యవసాయం

## పశుగ్రాస విత్తనాల దిగుమతులపై పరిమితులు



జన్యుపరంగా మార్పు చెందిన (జిఎం) అల్ఫాల్ఫా (లూసర్న్) పశుగ్రాస విత్తనాలను దేశంలోకి ప్రవేశించకుండా పరిమితం చేయడానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈ పంటపై దిగుమతి సుంకాలను తగ్గించాలని భారతదేశాన్ని అమెరికా కోరుతోంది. అయితే భారత్ నుంచి ఎగుమతి అవుతున్న వస్తువులపై అమెరికా టారిఫ్‌ను పెంచేసిన నేపథ్యంలో, అల్ఫాల్ఫా పశుగ్రాస విత్తనాలపై సుంకాలు తగ్గించడం అసాధ్యంగా మారింది. కాగా, కేంద్ర ప్రభుత్వ నిర్ణయం ఇప్పుడు జిఎం విత్తనాలు లేదా వ్యవసాయ ఉత్పత్తుల అంశాన్ని మరోసారి తెరపైకి తెచ్చింది. పర్యావరణ (రక్షణ) చట్టం, 1986 ప్రకారం జన్యుపరంగా మార్పు చెందిన విత్తనాలు లేదా జంతువుల ప్రవేశాన్ని నియంత్రించే అధికారం భారత ప్రభుత్వానికి ఉంది. అమెరికా పశుగ్రాసం అల్ఫాల్ఫా శాస్త్రీయ నామం మెడికాగో సాటివా. అల్ఫాల్ఫా అనేదిఅరబిక్ పదం అల్‌ఫాస్ఫాసా నుండి వచ్చింది, దీని అర్థం ఉత్తమ మేత. ఇది విటమిన్లు (ఎ, సి, కె, బి విటమిన్లు), ఖనిజాలు (కాల్షియం, మెగ్నీషియం, పొటాషియం), మొక్కల ఆధారిత ప్రోటీన్లు , ఫైబర్, యాంటీఆక్సిడెంట్లతో నిండిన అత్యంత పోషకమైన మొక్క . దీనిని పశుగ్రాసంగా విస్తృతంగా ఉపయోగిస్తారు. ఆరోగ్య ప్రయోజనాల కోసం మానవులు కూడా దీనిని వినియోగిస్తారు. ఇది పప్పుదినుసు మొక్క కావడంతో , వాతావరణం నుండి నత్రజనిని నేలలోకి స్థిరీకరించే సామర్థ్యం దీనికి ఉంది. అమెరికా ప్రపంచంలోనే అతిపెద్ద అల్ఫాల్ఫా ఉత్పత్తిదారు. ఇక్కడ దీనిని ఎక్కువగా వర్షాధార పరిస్థితులలో పండిస్తారు. ఇప్పుడు అమెరికా నుంచి దిగుమతయ్యే అల్ఫాల్ఫా విత్తనాలపై సుంకాలను తగ్గించాలన్న ప్రతిపాదనకు భారత్ ఎంతవరకూ సానుకూలంగా స్పందిస్తుందో చూడాలి.

# తగ్గుతున్న వ్యవసాయిక ఆదాయం



ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాల్లోనూ వ్యవసాయ ఆదాయం తగ్గుతున్నది. వ్యవసాయ రంగాన్ని వేధిస్తున్నది. గత కొన్ని దశాబ్దాలుగా భారతదేశంతో పాటు అనేక అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఎదురవుతున్న ఒక ప్రధాన సమస్య ఇది. దీనికి సంబంధించిన ముఖ్య కారణాలు, ప్రభావాలు, పరిష్కార మార్గాలను సమీక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వ్యవసాయ ఆదాయం తగ్గడానికి ముఖ్య కారణాల్లో ఉత్పత్తి ఖర్చుల పెరుగుదల ప్రధానమైనది. ఎరువులు, విత్తనాలు, నీటి పంపకాలు, పనివారు ఖర్చులు ఎక్కువ కావడం. అప్పులు తీసుకుని వ్యవసాయం చేయడం వల్ల లాభం తగ్గిపోతున్నది. పంట ధరల అస్థిరత కూడా ఆదాయ క్షీణతకు కారణమవుతున్నది. మార్కెట్లో పంటలకు సరైన ధర రాకపోవడం. కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) అందుబాటులో లేకపోవడం లేదా అమలులో లోపాలు వంటి సమస్యలు రైతులను వేధిస్తున్నాయి. వర్షాభావం, వరదలు, మిగతా ప్రకృతి విపత్తులు వంటి వాతావరణ మార్పులు పంట నష్టాన్ని పెంచుతున్నాయి. పంటలకు సోకుతున్న తెగుళ్లు..వ్యాధులు కూడా రైతు ఆదాయ క్షీణతకు కారణమవుతున్నాయి. పెరుగుతున్న తెగుళ్లు, పురుగుమందులపై వ్యతిరేకత వల్ల దిగుబడి తగుతున్నది. రైతు ఆదాయాన్ని దెబ్బతీస్తున్న సమస్యల్లో చిన్న కమతాల అంశం కూడా ఉంది. రైతుల భూములు చిన్నవుగా ఉండడం వల్ల స్థిర ఆదాయం పొందలేకపోతున్నారు. మధ్యవర్తులు, దళారులు రైతుల ఆదాయాన్ని గండికొడుతున్నాయి. రైతులు నేరుగా మార్కెట్‌కి వెళ్లలేక, మధ్యవర్తులపై ఆధారపడడం వల్ల ఆదాయం తగ్గిపోతున్నది. ఫలితంగా రైతుల అప్పుల భారం పెరుగుతున్నది. కుటుంబాల జీవన ప్రమాణం తగ్గుతున్నది. గ్రామీణ ప్రాంతాల్లో వలసలు, నిరుద్యోగిత పెరుగుతున్నది. కొన్ని సందర్భాల్లో రైతుల ఆత్మహత్యలకు దారితీస్తోంది. ఈ సమస్యకు పరిష్కార మార్గాలను అన్వేషించాల్సిన అవసరం ఉంది. అందులో ముందుగా, ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడం ప్రధానమైనది. సేంద్రీయ సాగు, మైక్రో ఇరిగేషన్ వంటి తక్కువ ఖర్చు విధానాలను ప్రోత్సహించాలి. పంటలకు సరైన ధర, న్యాయమైన ఎంఎస్‌పి అమలు, ఇ–నామ్ వంటి డిజిటల్ మార్కెట్లకు చేరువ చేయాలి. ఇన్సూరెన్స్,సబ్సిడీలను అందుబాటులోకి తేవాలి. పంట నష్టాలకు బీమా వంటి పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలి. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను ప్రోత్సహించాలి. పంటలకు విలువ జోడించేందుకు ప్రాసెసింగ్ యూనిట్లు, స్మార్ట్ గోదాములు మొదలైనవి అభివృద్ధి చెందితే, రైతు ఆదాయం పెరుగుతుంది. సాంకేతిక విద్యను రైతులకు అందించడం అత్యవసరం. వారికి ఎఐ, ఎల్‌ఒటి వంటి ఆధునిక వ్యవసాయ పద్ధతులపై శిక్షణ ఇప్పించాలి. స్థూలంగా చెప్పాలంటే, వ్యవసాయ ఆదాయం తగ్గుదల అనేది ఒక సంక్లిష్ట సమస్య. దీని పరిష్కారం కోసం ప్రభుత్వ మద్దతు, రైతుల అవగాహన, సాంకేతికత వినియోగం అన్నీ సమన్వయంగా అవసరం.

## ఆధునిక వ్యవసాయం నేటి అవసరం

'ఆధునిక వ్యవసాయం' అంటే పాత పద్ధతులకంటే మెరుగైన, సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా సాగు చేసే వ్యవసాయాన్ని ఉద్దేశిస్తారు. అత్యాధునిక సాంకేతిక విజ్ఞానంట్రాక్టర్లు, కంబైన్ హార్వెస్టర్లు, డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింక్లర్ వ్యవస్థల అభివృద్ధికి తోడ్పడుతాయి. ఎక్కువ దిగుబడి, రోగనిరోధకత కలిగిన వి. జెనెటిక్ మోడిఫైడ్ పంటల వినియోగం కూడా ఆధునిక వ్యవసాయ విధానాల్లో ప్రధానమైనది. ఆర్గానిక్, సస్టైనబుల్ పద్ధతులను కూడా అవలంభించడం ఆధునిక వ్యవసాయంలో భాగమైంది. భూమి పాడవకుండా, పర్యావరణ హితమైన విధానాలతో సాగు చేయడం ఈ విధానాల్లో సాధ్యమవుతుంది.డిజిటల్ వ్యవసాయం ఇటీవల కాలంలో విస్తృతమవుతున్నది. డ్రోన్లు, శాటిలైట్ పిక్చర్లు, మొబైల్ యాప్స్ ద్వారా పంట పరిస్థితిని మానిటరింగ్ చేస్తున్నారు. ఫెర్టిగేషన్, హైడ్రోపోనిక్స్, ఏరోపోనిక్స్ వంటి ఆధునిక సాగు సాంకేతికతలతో బహుముఖ ప్రయోజనాలు ఉన్నాయి. దిగుబడిలో పెరుగుదల నీటి, ఎరువుల వినియోగంలో తగ్గింపు, శ్రమ ఆదా వంటి అంశాలు కూడా ఆధునిక వ్యవసాయంలో కీలకమైనవి. మార్కెట్‌కు వేగంగా ఫలితాలు అందించడం ఓ చిన్న ఉదాహరణ. పూర్వంలో రైతులు వర్షానికే ఆధారపడి సాగు చేసేవారు. ఇప్పుడు డ్రిప్ ఇరిగేషన్ ద్వారా అవసరమైనన్ని నీటి బొట్లు మాత్రమే ఇవ్వడం వల్ల నీటి వృథా తగ్గింది. పంటలు మెరుగ్గా పెరుగుతున్నాయి.



## భూసార పరిరక్షణలో కృత్రిమ మేధస్సు..



ఇటీవల కాలంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్/ ఎఐ) అన్ని రంగాల్లోనూ ప్రధాన పాత్ర పోషిస్తోంది. వ్యవసాయ రంగానికి సంబంధించి, భూసార పరిశీలన, పునరుత్పత్తి, వ్యవసాయ వ్యవస్థల పరిరక్షణకు ఎఐ ఆధారిత పద్ధతులు ఒక నవీన మార్గాన్ని అందిస్తున్నాయి. ఎఐ ఆధారిత సెన్సార్లు, ఉపగ్రహ చిత్రాల ద్వారా భూమి నాణ్యత, తేమ స్థాయి, ఎరువుల అవసరం మొదలైన వివరాలను సులభంగా విశ్లేషించవచ్చు. ఉదాహరణకు డ్రోన్ లేదా జిఐఎస్ పద్ధతులతో భూమి లోపల జీవసారం స్థాయిని గుర్తించగలగడం. అదే విధంగా ఎఐ మోడళ్లను ఉపయోగించి భవిష్యత్తులో ఎక్కడ భూసార క్షయం జరగొచ్చో ముందుగానే అంచనా వేయవచ్చు. ముందస్తుగా నియంత్రణ చర్యలు చేపట్టడం సాధ్యమవుతుంది. ఎఐ వాడటం వల్ల రైతులు ఎక్కడ ఎన్ని ఎరువులు, నీరు వాడాలో ఖచ్చితంగా నిర్ణయించగలుగుతారు. ఇది భూమిని అధికంగా వినియోగించకుండా పరిరక్షిస్తుంది. ఎఐ సాంకేతికత భూమి పై ఒత్తిడిని తగ్గిస్తుంది. భూసార నష్టం నివారిస్తుంది. ఎఐ ఆధారిత భూగర్భ పటాలు తయారు చేసి, ఏఏ ప్రదేశాల్లో నేల బలహీనంగా ఉందో గుర్తించవచ్చు. భవిష్యత్తులో పంటల ప్రణాళికకు ఎఐ సహకరిస్తుంది. రిమోటు సెన్సింగ్, డేటా విశ్లేషణ, రిమోటు సెన్సింగ్‌తో కూడిన ఇమేజ్ ప్రాసెసింగ్ ద్వారా వాస్తవిక భూసార స్థితిని నిరంతరం ట్రాక్ చేయవచ్చు. ఉదాహరణకు గూగుల్ ఎర్త్, సెంటినల్ శాటిలైట్ ఇమేజరీ ఆధారంగా భూసార క్షయాన్ని గుర్తించడం తదితరాలు. నిపుణుల సలహాల ఆటోమేషన్ ఎఐ చాట్బాట్లు లేదా మొబైల్ యాప్స్ రైతులకు వ్యక్తిగత సలహాలు ఇస్తున్నాయి. పంటల కోసం సరైన భూమి ఎంపిక, ఎరువుల మోతాదులు మొదలైన అంశాలపై వివరాలను అందిస్తున్నాయి. ఎఐ వ్యవసాయ రంగాన్ని 'ప్రతిస్పందనాత్మకంగా' మారస్తుంది. భూమి మార్పులకు వేగంగా స్పందించే వ్యవస్థగా మారుతుందది. ఇది భూసార పరిరక్షణలో ఎఐ సాంకేతికతను ఒక విప్లవాత్మక మార్పుగా చెప్పవచ్చు.

## వాణిజ్య పంటలతో అధిక లాభాలు..



సాంప్రదాయ సేద్యంతో పోలిస్తే, వాణిజ్య పంటలకు అత్యధిక డిమాండ్ ఉంది. వాణిజ్య పంటలు అనేవి ప్రధానంగా మార్కెట్‌లో అమ్మేందుకు, లాభం కోసం పండించే పంటలు. ఇవి రైతుల ఆర్థిక ఆదాయాన్ని పెంచడం కోసం సాగు చేస్తారు. తినడానికి మాత్రమే కాకుండా పరిశ్రమలకు ముడి పదార్థాలుగా కూడా ఇవి ఉపయోగపడతాయి. పత్తి (Cotton), జౌళి (Jute), చెరకు (Sugarcane), పొగాకు (Tobacco), కాఫీ (Coffee), టీ (Tea), మిర్చి (Chilli), నూనె గింజలు (Oilseeds — సన్ఫ్లవర్, గ్రౌనట్, సోయాబీన్ మొదలైనవి), మసాలా పంటలు (Spices/ మిరియాలు, ఏలకులు మొదలైనవి) వంటివి ప్రధాన వాణిజ్య పంటలు. వాణిజ్య పంటలు మార్కెట్ అవసరాల ఆధారంగా సాగు చేయబడతాయి. వీటి సాగుకు అధిక పెట్టుబడి అవసరం. ఎక్కువ మొత్తంలో నీరు, ఎరువులు అవసరపడవచ్చు. విదేశీ మారకం సంపాదనకు సహాయపడతాయి.

# క్రీడ

## తప్పని పరిస్థితుల్లో తుది జట్టులో మార్పులు చేయాల్సి వచ్చింది

### హసరంగా, సందీప్ శర్మ ఆడటం లేదు: రియాన్ పరాగ్



ఐపిఎల్ 2025 సీజన్‌లో భాగంగా ముంబై ఇండియన్స్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. పిచ్ కండిషన్స్ నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకున్నానని రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ రియాన్ పరాగ్ తెలిపాడు. తప్పని పరిస్థితుల్లో తుది జట్టులో మార్పులు చేయాల్సి వచ్చిందన్నాడు. సందీప్ శర్మ, వానిందు హసరంగా గాయపడటంతో వారి స్థానాల్లో ఆకాశ్ మధ్వాల్, కుమార్ కార్తీకేయ ఆడుతున్నట్లు రియాన్ పరాగ్ చెప్పాడు. మేం ముందుగా బౌలింగ్ చేస్తాం. డ్యూ వచ్చే అవకాశం ఉంది. సాధారణంగా ఇక్కడ మ్యాచ్ సాగుతున్నా కొద్దీ వికెట్‌లో మార్పు ఉంటుంది. పిచ్ కండిషన్స్‌ను అందిపుచ్చుకోవాలని అనుకుంటున్నాం. గెలుపు, ఓటములతో సంబంధం లేకుండా మేం మా ఆటను ఆడుతున్నాం. ఫలితం ఎలా ఉన్నా ఒకేలా ఉండాలని ద్రవిడ్ సర్ చెప్పారు. గత మూడు మ్యాచ్‌లకు ముందే ఒక్కో మ్యాచ్ గెలుస్తూ ముందుకు సాగాలని చెప్పారు. మా సామర్థ్యం మేరకు రాణిస్తే విజయం దక్కుతుంది. జట్టులో ప్రతీ ఒక్కరికి పూర్తి స్వేచ్ఛ ఇచ్చాం. తుది జట్టులో మార్పులు జరిగాయి. గాయంతో హసరంగా దూరమవ్వగా.. కుమార్ కార్తీకేయ జట్టులోకి వచ్చాడు. సందీప్ శర్మ వేలు విరగడంతో ఆకాశ్ మధ్వాల్ బరిలోకి దిగాడు.'అని రియాన్ పరాగ్ చెప్పుకొచ్చాడు. మరోవైపు టాస్ గెలిస్తే తాము కూడా బౌలింగ్ ఎంచుకునేవాళ్లమని ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా తెలిపాడు. 'మేం కూడా ముందుగా బౌలింగ్ చేయాలనుకున్నాం. ఎప్పుడూ మెరుగైన క్రికెట్ ఆడాలనే లక్ష్యంతోనే ఉంటాం. మెరుగై ప్రదర్శన చేయడంపైనే మా జట్టులో చర్చ జరిగింది. గత మ్యాచ్ తరహాలోనే రాణించాలి. ఆటలో ఎలాంటి మార్పు అవసరం లేదు. ఫియర్ లెస్ గేమ్ ఆడాలనుకుంటున్నాం. ఎంత లక్ష్యం అనేది అనవసరం. వికెట్ తగ్గ మార్క్ లక్ష్యం అందుకోవాలి. పిచ్ కండిషన్స్‌ను అందిపుచ్చుకొని రాణించడం ముఖ్యం. డ్యూ అంతగా రాదని భావిస్తున్నా. మేం ఎలాంటి మార్పులు లేకుండా విన్నింగ్ కాంబినేషన్‌తో బరిలోకి దిగుతున్నాం.'అని హార్దిక్ పాండ్యా చెప్పుకొచ్చాడు.

**తుది జట్లు**

**రాజస్థాన్ రాయల్స్ :** యశస్వి జైస్వాల్, వైభవ్ సూర్యవంశీ, నితీష్ రాణా, రియాన్ పరాగ్(కెప్టెన్), ధృవ్ జురెల్(కీపర్), షిమ్రాన్ హెట్మెయర్, జోఫ్రా ఆర్చర్, మహేశ్ తీక్షణ, కుమార్ కార్తికేయ, ఆకాష్ మధ్వల్, ఫజల్‌హక్ ఫరూఖీ

**ముంబై ఇండియన్స్:** ర్యాన్ రికెల్టన్(కీపర్), రోహిత్ శర్మ, విల్ జాక్స్, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా(కెప్టెన్), నమన్ ధీర్, కార్బిన్ బాష్, దీపక్ చాహర్, ట్రెంట్ బౌల్ట్, జస్ప్రీత్ బుమ్రాబుమ్రా.

## క్రికెట్‌లో ఏజ్ ఫ్రాడ్ విజేందర్ సింగ్ ట్వీట్ వివాదం

14 ఏళ్ల వయస్సులోనే 35 బంతుల్లోనే శతకం బాది అతిపిన్న వయస్సులోనే సెంచరీ చేసిన భారతీయ ఆటగాడిగా వైభవ్ సూర్యవంశీ రికార్డును సాధించాడు. అనంతరం అతడి వయస్సుపై చాలా మంది కామెంట్లు చేశారు. అతడి 14 కంటే ఎక్కువగానే ఉంటుందని.. కానీ తక్కువగా చూపిస్తున్నాడని విమర్శలు గుప్పించారు. తాజాగా క్రికెటర్లు తక్కువ వయస్సును చూపి ఆడుతున్నారని భారత మాజీ బాక్సర్ విజేందర్ సింగ్ చేసిన ట్వీట్ వివాదం అవుతోంది. ఆయన ఐపిఎల్ స్టార్ ఆటగాడు వైభవ్ సూర్యవంశీని ఉద్దేశించి టార్గెట్ చేసి ఉంటారని నెటిజన్లు భావిస్తున్నారు. ఈ అంశంపై నెట్టింట చర్చ జరుగుతోంది. 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడుతున్న సంగతి తెలిసిందే. అయితే ఈ బీహార్ కుర్రాడు 35 బంతుల్లో సెంచరీ కొట్టి రికార్డులకెక్కాడు. తాజాగా బాక్సర్ విజేందర్ సింగ్ తన ట్వీట్‌లో క్రికెటర్లను విమర్శించాడు. కొంత మంది క్రికెటర్లు వయస్సు తక్కువ చెప్పి ఆడుతున్నారని తన ట్వీట్‌లో వ్యాఖ్యాన్నించాడు.

## మహిళల టీ–20 ప్రపంచ కప్ షెడ్యూల్ విడుదల



మహిళల టీ20 ప్రపంచ కప్ తేదీలను ఐసిసి ప్రకటించింది. ఈ టోర్నమెంట్‌లో ప్రపంచంలోని అగ్రశ్రేణి జట్లు ఒకదానితో ఒకటి తలపడతాయి. మహిళల టీ20 ప్రపంచ కప్ 2026 జూన్ 12 నుంచి ప్రారంభం కానుంది. ప్రపంచ కప్ ఫైనల్ జులై 5న లండన్‌లోని లార్డ్స్ క్రికెట్ గ్రౌండ్‌లో జరగనుంది. ఈ టోర్నమెంట్‌లో మొత్తం 33 మ్యాచ్‌లు ఉంటాయి. ఇది 24 రోజుల పాటు కొనసాగుతుంది. ఈ సారి 12 జట్లు పాల్గొంటాయి. 2026లో ఇంగ్లాండ్‌లో జరగనున్నమహిళల టీ20 ప్రపంచ కప్ కోసం సన్నాహాలు ప్రారంభమయ్యాయి. మే 1న లార్డ్స్‌లో జరిగిన కార్యక్రమంలో వేదికలు, తేదీలను ప్రకటించారు. బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్, సౌతాంప్టన్‌లోని హాంప్‌షైర్ బౌల్, లీడ్స్‌లోని హెడింగ్లీ, మాంచెస్టర్‌లోని ఓల్డ్ ట్రాఫోర్డ్ లండన్‌లోని కెన్నింగ్టన్ ఓవల్, బ్రిస్టల్‌లోని కౌంటీ గ్రాండ్ కూడా ఈ టోర్నమెంట్‌కు వేదికలుగా ఉంటాయి. భారత్, న్యూజిలాండ్, పాకిస్థాన్, దక్షిణాఫ్రికా, శ్రీలంక, వెస్టిండీస్, ఇంగ్లాండ్ ఆస్ట్రేలియా ఇప్పటికే ప్రపంచ కప్‌లో తమ స్థానాన్ని నిర్ధారించుకున్నాయి. మిగిలిన జట్లను వచ్చే ఏడాది జరిగే క్వాలిఫయర్స్ నుంచి ఎంపిక చేస్తారు. ఐసిసి చైర్మన్ జైషా మాట్లాడుతూ.. 'వేదిక నిర్ధారణ ఒక ముఖ్యమైన క్షణం. మనం 2026 ఐసిసి మహిళల టీ20 ప్రపంచకప్ వైపు అడుగులు వేస్తున్నాం. ఈ టోర్నమెంట్ ప్రపంచంలోని అత్యుత్తమ క్రీడాకారిణులను ఒక చోట చేర్చుతుంది. ఇది నైపుణ్యం, క్రీడాస్ఫూర్తికి ఒక వేడుక అవుతుంది.' అని అన్నారు. యూకేలో అన్ని జట్లకు ఎల్లప్పుడూ అపారమైన మద్ధతు లభించిందని ఆయన చెప్పుకొచ్చారు. గతంలో కూడా మనం దీనిని చూశామన్నారు. 2017లో లారడ్స్‌లో జరిగిన మహిళల ప్రపంచ కప్ ఫైనల్ ఒక చిరస్మరణీయ క్షణమని గుర్తు చేసుకున్నారు. మహిళా క్రికెట్ అభివృద్ధిలో ఇది ఒక మైలురాయి అని అన్నారు. ఫైనల్ కు లారడ్స్ కంటే మెరుగైన ప్రదేశం మరొకటి ఉండదని తాను భావిస్తున్నానన్నారు. 2017 మహిళల క్రికెట్ ప్రపంచ కప్ ఫైనల్ మహిళల క్రికెట్‌ను కొత్త శిఖరాలకు తీసుకెళ్లిందని జైషా అన్నారు.

**ఫార్మాట్ ఇలా..**

12 జట్లను రెండు గ్రూపులుగా విభజించనున్నారు. ఒక్కొక్క గ్రూపులో ఆరు జట్లు ఉంటాయి. దీని తర్వాత నాకౌట్ దశ, ఫైనల్ ఉంటుంది. న్యూజిలాండ్ డిఫెండింగ్ ఛాంపియన్లు. గత ఏడాది అక్టోబర్‌లో దుబాయ్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో లారా వోల్వార్డ్ట్ నేతృత్వంలోని దక్షిణాఫ్రికాను 32 పరుగుల తేడాతో ఓడించారు. భారతదేశం ఇంకా ఈ టైటిల్ గెలవలేదు. 2020లో మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో ఆస్ట్రేలియాతో భారత్ ఫైనల్ ఆడింది.

# రీల్



## ఒకే ఫ్రేమ్‌లో దిగ్గజ లెజెండ్స్


టాలీవుడ్ లెజెండరీ హీరో మెగాస్టార్ చిరంజీవి ప్రస్తుతం పలు సాలిడ్ ప్రాజెక్ట్‌లు చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే మెగాస్టార్‌కి ఈ మధ్య కాలంలో పలు అరుదైన గౌరవాలు కూడా వరించిన సంగతి తెలిసిందే. అలాగే ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఎంటర్‌టైన్‌మెంట్ రంగం పరంగా వేవ్స్ అంటూ స్టార్ట్ చేసి ఇండియన్ ఎంటర్‌టైన్‌మెంట్‌ని అత్యాధునిక సదుపాయాలతో గ్లోబల్ లెవెల్లో పరిచయం చేసే ప్రయత్నం చేస్తున్నారు. ఇలా ఈ మధ్యలో టెలివిజన్ యాడ్స్ కూడా వస్తుండగా ఈ వేవ్స్ సమిట్ నేడు ముంబై జాస్మిన్ హాల్‌లో అట్టహాసంగా నేడు జరిగింది. అయితే ఈ ఈవెంట్ కోసం దేశ వ్యాప్తంగా అనేకమంది బిగ్ స్టార్స్ కూడా వచ్చారు. ఇలా మెగాస్టార్ చిరంజీవి కూడా హాజరు కాగా తనతో పాటుగా సూపర్ స్టార్ రజినీకాంత్ అలాగే మోహన్ లాల్ ఇంకా బాలీవుడ్ స్టార్ నటుడు అక్షయ్ కుమార్‌లు కూడా వచ్చారు. ఇలా ఈ అందరి బిగ్ స్టార్స్ సమాహారం కలిసిన కొన్ని రేర్ పిక్స్ సోషల్ మీడియాలో సినీ వర్గాల్లో వైరల్‌గా మారాయి. మరి చిరు మిడిల్‌లో కనిపిస్తూ ఈ ఇతర బిగ్ స్టార్స్ అంతా కనిపించడం ఇపుడు బ్యూటిఫుల్ మూమెంట్‌గా మారింది.

## తారక్ పుట్టినరోజు ఎన్‌టిఆర్, నీల్.. సినిమా టైటిల్

మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్‌టిఆర్ హీరోగా ఇపుడు చేస్తున్న అవైటెడ్ చిత్రాల్లో దర్శకుడు ప్రశాంత్ నీల్‌తో చేస్తున్న భారీ చిత్రం అందరికీ తెలిసిందే. ఎన్‌టిఆర్ కెరీర్‌లో 31వ సినిమాగా ప్లాన్ చేసిన ఈ ప్రాజెక్టుపై ఎనలేని అంచనాలు ఉన్నాయి. అయితే ఈ చిత్రం నుంచి మేకర్స్ రీసెంట్ గానే రెండు సాలిడ్ అప్డేట్స్ కూడా ఇచ్చేసారు. సినిమా తాలూకా కొత్త రిలీజ్ డేట్ అలానే గ్లింప్స్ రిలీజ్‌లని ఖరారు చేశారు. అయితే సినిమాకి డ్రాగన్ అనే టైటిల్ ని లాక్ చేసినట్టుగా ఎప్పుడు నుంచో రూమర్స్ ఉన్నాయి. మరి ఈ టైటిల్ సహా గ్లింప్స్ ఇంకా క్రేజీ మాస్ పోస్టర్స్ అన్నీ కూడా తారక్ పుట్టినరోజు కానుక గానే బయటకి రానున్నట్టుగా ఇపుడు తెలుస్తుంది. మరి టైటిల్ డ్రాగన్ అనే ఉంటుందా లేక మరో టైటిల్ పెడతారా అనేది వేచి చూడాల్సిందే.

## హాలీవుడ్ స్టైల్‌లో 'హిట్ 3'

నాచురల్ స్టార్ నాని నటించిన 'హిట్ 3: ది థర్డ్ కేస్' సినిమా గ్రాండ్‌గా విడుదలైన విషయం తెలిసిందే. ఈ క్రైమ్ థ్రిల్లర్ సినిమా రిలీజైన తొలి రోజు నుంచే సూపర్ టాక్ తెచ్చుకుంది. శైలేష్ కొలను డైరెక్షన్‌లో వచ్చిన ఈ సినిమా, నాని కెరీర్‌లో మరో ట్రెండ్ సెట్టర్‌గా నిలిచేలా కనిపిస్తోంది. శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటించగా, మిక్కీ జెమేయర్ సంగీతం సినిమాకు బూస్ట్ ఇచ్చింది. యాక్షన్, సస్పెన్స్, ఎమోషన్స్‌తో నిండిన ఈ సినిమా యూత్, ఎన్‌ఆర్‌ఐ ప్రేక్షకులను బాగా ఆకర్షిస్తోంది. 'హిట్' ఫ్రాంచైజ్‌లో మూడో సినిమాగా వచ్చిన 'హిట్ 3' బంపర్ ఓపెనింగ్స్ సాధించింది. పలుచోట్ల బుకింగ్స్ ఆలస్యమైనా, ఇప్పుడు ఫాస్ట్ ఫిల్లింగ్‌తో జోరు చూపిస్తోంది. సినిమాలో నాని పవర్‌ఫుల్ ఆఫీసర్ రోల్, ట్రైలర్‌లో చూపించిన థ్రిల్లింగ్ సీన్స్ ప్రేక్షకులను థియేటర్లకు రప్పిస్తున్నాయి. ఈ సినిమా యంగ్ జనరేషన్‌కు కనెక్ట్ అయ్యేలా ఉందని ఫ్యాన్స్ ఫీలవుతున్నారు. సినిమా హైలైట్ ఏం టంటే, దీని హాలీవుడ్ స్టైల్ బ్యాక్‌డ్రాప్. సినిమా విజువల్స్, యాక్షన్ సీక్వెన్స్‌లు హాలీవుడ్ రేంజ్‌లో ఉన్నాయని టాక్ వచ్చింది. ఈ స్టైలిష్ అప్రోచ్ యూత్, ఎన్‌ఆర్‌ఐ ఆడియన్స్‌కు బాగా నచ్చింది. యూఎస్‌లో సినిమా ఓపెనింగ్స్ సూపర్ పాజిటివ్ టాక్‌తో మొదలయ్యాయి. నెక్ట్స్ జనరేషన్ యూత్‌కు సినిమా ఫుల్ కిక్ ఇచ్చిందని సోషల్ మీడియాలో రివ్యూస్ వస్తున్నాయి. నాని ఈ సినిమాతో టాలీవుడ్‌లో కొత్త ట్రెండ్ సెట్ చేశాడని అంటున్నారు. సినిమాలో నాని నటన, స్టైలిష్ లుక్‌తో అదరగొట్టాడు. హాలీవుడ్ లెవెల్ ప్రొడక్షన్ వాల్యూస్ సినిమాకు ప్లస్ అయ్యాయి. యాక్షన్ ఎపిసోడ్స్‌లో సర్‌ప్రైజ్ ఎలిమెంట్స్, క్యామియోలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. యుఎస్‌లో ఈ సినిమా నెక్ట్స్ జనరేషన్ ఆడియన్స్‌కు బాగా కనెక్ట్ అయింది. ఫస్ట్ డే షోస్‌లో హౌస్‌ఫుల్ బోర్డులు, సోషల్ మీడియాలో పాజిటివ్ రివ్యూస్ సినిమా సక్సెస్‌ను సూచిస్తున్నాయి. ఈ టాక్ కొనసాగితే, సినిమా వీకెండ్ కలెక్షన్స్ భారీగా ఉంటాయని ట్రేడ్ అంచనా. 'హిట్ 3' బాక్సాఫీస్ వద్ద బంపర్ ఓపెనింగ్స్ సాధించడంతో నాని ఫ్యాన్స్ ఫుల్ జోష్‌లో ఉన్నారు. ఇక ఫ్యామిలీ ఆడియన్స్‌కు ఏ స్థాయిలో రీచ్ అవుతుంది అనేది చూడాలి. కానీ యూత్, మాస్ ఆడియన్స్‌ను రీచ్ చేస్తూ సినిమా కలెక్షన్స్ రాబట్టే అవకాశం ఉంది. సినిమా కంటెంట్ బలంగా ఉండటంతో ఈ లక్ష్యం సాధ్యమేనని నాని టీమ్ ధీమాగా ఉంది. మొత్తంగా, 'హిట్ 3' హాలీవుడ్ స్టైల్‌తో టాలీవుడ్‌లో కొత్త ట్రెండ్ సృష్టించింది. నాని ట్రెండ్ సెట్టింగ్ పెర్ఫార్మెన్స్, సినిమా స్టైలిష్ మేకింగ్ యూత్, ఎన్‌ఆర్‌ఐలను ఆకట్టుకుంటోంది. యుఎస్‌లో సూపర్ ఓపెనింగ్స్, ఇండియాలో పాజిటివ్ టాక్‌తో సినిమా బాక్సాఫీస్ వద్ద దూసుకెళ్ళడం పక్కా అని అంటున్నాడు. మరి ఈ వీకెండ్‌లో సినిమా ఎలాంటి రికార్డులు క్రియేట్ చేస్తుందో చూడాలి.





# స్థానికం
REGIONAL NEWS

వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్

## కార్మికులకు సేవలు అందించేందుకు న్యాయ సేవా సంస్థ



ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి: న్యాయ సేవాసంస్థ ఆధ్వర్యంలో మేడే సందర్భంగా మహబూబాబాద్ జిల్లా సిపిఐ కార్యాలయంలో జరిగిన కార్మికుల సమావేశంలో న్యాయసేవాసంస్థనుద్దేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయ సేవాసంస్థ నాయవాది, మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షులు దాసరి నాగేశ్వరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ న్యాయ సేవా సంస్థ ద్వారా కార్మిక లోకానికి ఉచితంగా సలహాలు, ఉచితంగా న్యాయ సేవలు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి, సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అజయ్ సారథి రెడ్డి, న్యాయసేవా సంస్థ న్యాయవాదులు భూక్య మోహన్‌నాయక్, కట్కూరి శ్రీనివాస్ చక్రవర్తి, జరుకుల సురేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల అవిశ్రాంత పోరాటాల ఫలితమే 8 గంటల పని విధానం

హనుమకొండ జిల్లా ఎఐటియుసి కార్యదర్శి జక్కు రాజ్ గౌడ్



ప్రజాపక్షం/హైదరాబాద్ : కార్మికుల అవిశ్రాంత పోరాటాల ఫలితమే 8 గంటల పని విధానం వచ్చిందని,హనుమకొండ జిల్లా ఎఐటియుసి కార్యదర్శి జక్కు రాజ్ గౌడ్ అన్నారు. హనుమకొండ జిల్లా ఎఐటియుసి ఆధ్వర్యంలో బాలసముద్రం పార్టీ కార్యాలయంలో అంతర్జాతీయ మేడే దినోత్సవం ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లా కార్యదర్శి జక్కు రాజు గౌడ్, హనుమకొండ జిల్లా ఎఐటియుసి అధ్యక్షులు వేల్పుల సారంగపాణి, సహాయ కార్యదర్శి రాము రాజేష్ ఖన్నాలు అరుణ పతాకాని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన హనుమకొండ జిల్లా ఎఐటియుసి కార్యదర్శి జక్కు రాజ్ గౌడ్ మాట్లాడుతూ కార్మికులు అనేక త్యాగాలతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కాలరాస్తూ కేంద్ర బిజెపి ప్రభుత్వం యాజమానులకు పెట్టుబడుదారులకు అనుకూలంగా 4 లేబర్ కోడ్ల రూపంలో తీసువచ్చి కార్మికులను కట్టు బానిసలుగా యాజమాన్యాల చేతుల్లో బంధీలుగా చేస్తూ తీరని అన్యాయం చేసిందన్నారు ఈ విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 20 నాతలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని మేడే సందర్భంగా కార్మికులకు, ఉద్యోగులకు పిలుపునిచ్చారు. ఎఐటియుసి హనుమకొండ జిల్లా మల్లయ్య, సమ్మయ్య, కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## వాడవాడలా రెపరెపలాడిన ఎర్రజెండా



ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :భూపాలపల్లి పారిశ్రామిక ప్రాంతంలో పట్టణ కేంద్రంలో 139వ ప్రపంచ కార్మిక దినోత్సవ సందర్భంగా ఎఐటియుసి, సిపిఐ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సుమారు 22 సెంటర్లలో139 వ మేడే పతాక ఆవిష్కరణ చేశారు. భూపాలపల్లి ఏరియాలోని అన్ని గనులు కేటీకే 1 మాటేటి శ్రీనివాస్, కేటీకే 5 దోర్నాల తిరుపతి, కేటీకే6 ఇంక్లైన్ ఎం.మనోజ్ కుమార్, ఓసి2 ఎండి కరీముల్లా, కేటీకే 8 ఎం విజేందర్, ఏరియా వర్క్ షాప్ కొమరయ్య, ఏరియా హాస్పిటల్ తాళ్ల పోషం, రామప్ప కాలనీ నరేష్, కారల్ మార్క్స్ కాలనీ శ్రీకాంత్, సతీష్, కృష్ణ కాలనీ జి.సత్యనారాయణ, కృష్ణ కాలనీ టి2 క్వార్టర్స్ నల్ల సత్తయ్య,1000 క్వార్టర్స్ లక్ష్మణరావు, ఎంసీ క్వాటర్స్ ఆసిఫ్ పాషా, ఆర్టీసీ బస్టాండ్ ఎం.విజేందర్, జి.శ్రీనివాస్ పైలట్ కాలనీ కొరిమి సుగుణ, జయశంకర్ బొమ్మ బిల్డింగ్ కన్స్ట్రక్షన్స్ వర్కర్స్ చిలకాని రాజయ్య, జంగేడు మొండేయ్య, భగత్ సింగ్ నగర్ సోతుకు ప్రవీణ్ కుమార్, సుభాష్ కాలనీ కొరిమి సుగుణ, ఎఐటియుసి ఆఫీస్ మోటపలుకుల రమేష్, సుధాకర్ రెడ్డి, మాతంగి రామచందర్, సతీష్, ప్రవీణ్, టీఎస్ జెన్కో కెటిపిపి కోల శ్యామ్, లారీ అసోసియేషన్ సిహెచ్ వీరస్వామి, ఓసిటు ఎస్వీసి సెగ్గం రాజేష్ లు 139వ మే డే సందర్భాన్ని పురస్కరించుకొని అన్ని బొగ్గు గనులపై కార్మిక వాడల్లో ఘనంగా మేడే వేడుకలు నిర్వహించి పతాకావిష్కరణ చేశారు.

## క్రీడా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి : కలెక్టర్ సత్య శారద



ప్రజాక్షం /వరంగల్ ప్రతినిధి : వేసవి ఉచిత క్రీడా శిబిరాలను చిన్నారులు, క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. జిల్లా యువజన, క్రీడాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి శిబిరాలను గురువారం జిల్లా కేంద్రంలోని ఓ సిటీ స్టేడియంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భం గా కలెక్టర్ మాట్లాడుతూ చిన్నారులు తమకు నచ్చిన క్రీడా అంశాన్ని ఎంపిక చేసుకొని అందులో రాణించాలన్నారు. మే 1 నుండి జూన్ 6 వరకు జరిగే వివిధ క్రీడా అంశాల్లో కోచ్‌లు, సీనియర్ క్రీడాకారులు పర్యవేక్ష ణలో మెలకువలు నేర్చుకొని ఆటలో రాణించాలన్నారు. శిబిరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరంగల్ జిల్లా లో 10 గ్రామీణ ప్రాంతాలలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నేటి నుంచి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్బన్ వేసవి క్రీడా శిక్షణ శిబిరాల శిక్షకులకు క్రీడా సామగ్రిని జిల్లా కలెక్టర్ చేతుల అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆదనవు కలెక్టర్‌సంధ్యా రాణి, జిల్లా యువజన క్రీడల అధికారి సత్య వాణి, తహసీల్దార్ ఇక్బాల్, ఒలంపిక్ అసోసియేషన్ సెక్రటరీ కైలాష్ యాదవ్, ఓయాసిస్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ చైర్మన్ పరంజ్యోతి , జెఎన్టియు స్పోర్ట్స్ బోర్డ్ కన్వీనర్ దిలీప్ జిల్లా కిక్ బాక్సింగ్ అసోసియేషన్ సెక్రటరీ సంజీవ్ , క్రీడాకారులు తల్లిదండ్రులు వాకర్స్ పాల్గొన్నారు.

## చదువులో రాణించే పిల్లలను తల్లిదండ్రులు ప్రోత్సహించాలి

జిల్లా ఎస్‌పి సుధీర్ రాంనాథ్ కేకన్



ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:చదువులో రాణించే పిల్లలను తల్లి దండ్రుగా మరింత ప్రోత్సహించాల్సిన బాధ్యత మనపై ఉంటుందని మహబూబాబాద జిల్లా ఎస్‌పి సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో డిసిఆర్‌బి విభాగంలో విధులు నిర్వహిస్తున్న పిసి ఎన్ నరేష్ కుమార్తె అక్షర తాజాగా వెలువడిన ఎస్‌ఎస్‌సి ఫలితాల్లో అత్యుత్తమ ఫలితాలు సాదించి 581మార్కులతో మహబూబాబాద్ జిల్లాలోనే 5వ స్థానంలో నిలిచి తన ప్రతిభను చాటిచెప్పి పోలీసు శాఖకే గర్వకారణంగా నిలిచిందని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి కార్యాలయంలో అక్షరను ఘనంగా సత్కరించారు. పోలీస్ శాఖలో పనిచేస్తున్న కుటుంబం నుండి విద్యారంంలో ఇంత గొప్ప విజయాన్ని సాధించడం పోలీసు శాఖకే గర్వించదగ్గ విషయమన్నారు. డిసిఆర్‌బి సిబ్బంది పాల్గొన్నారు.

# ఆదర్శ కమ్యూనిస్టు గంగిల్ల లింగారెడ్డి

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు



ప్రజాపక్షం/హసన్‌పర్తి : ఆదర్శ కమ్యూనిస్టు కామ్రేడ్ గంగిల్ల లింగారెడ్డి అని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండలం ఎల్లాపూర్‌లో కామ్రేడ్ గంగిల్ల లింగారెడ్డి విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లింగారెడ్డి విగ్రహాన్ని తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు ఆవిష్కరించిన అనంతరం మాట్లాడుతూ లింగారెడ్డి జీవితాంతం సిపిఐలో పనిచేసి అందరిలో స్ఫూర్తిని నింపాడని అన్నారు. నేడు ఎర్రజెండా వైపు ప్రపంచం చూస్తున్నదని అన్నారు. ప్రపంచంలో నేడు నేపాల్, చైనా, క్యూబా, వియత్నాం దేశాలలో కమ్యూనిస్టు రాజ్యం విలసిల్లుతున్నదన్నారు. భవిష్యత్తులో కూడా మనదేశంలో కమ్యూనిస్టులకే భవిష్యత్తు ఉంటుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరిట వేయిలాది, మావోయిస్టులతో చర్చలు జరిపేందుకు ముందుకు రావాలన్నారు. గతంలో సుదీర్ఘ ఆందోళన చేపట్టి రైతాంగం మోడీ మెడలు వంచిందని, దాంతో రైతుల వ్యతిరేక చట్టాలు వెనక్కి తీసుకున్నారని అన్నారు. నేడు కార్మిక వర్గం సంపద సృష్టిస్తుంటే మోడీ ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెడుతున్నదని అన్నారు. వారికి రూ.16 లక్షల కోట్లను రైటాఫ్ లోన్స్ పేరుతో రద్దు చేసిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను మోడీ ప్రభుత్వం బలహీన పరుస్తున్నారని, వాటిని కాపాడుకోవాలన్నారు. కాశాయీకరణ, కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జరిగిన సభకు సిపిఐ జిల్లా నాయకులు నేదునూరి రాజమౌళి అధ్యక్షత వహించగా సభలో మాజీ ఎమ్మెల్యే పోతరాజు సారయ్య, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నేదునూరి జ్యోతి, జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, బికేఎంయు జాతీయ నాయకులు మోతె లింగారెడ్డి,సీనియర్ నాయకులు గోలి రాజిరెడ్డి, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, ఎన్.అశోక్ స్టాలిన్, మద్దెల ఎల్లేష్, తోట భిక్షపతి, అయిల్నే జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్. శ్రీహరి, మండల కార్యదర్శి మెట్టు శ్యామ్ సుందర్ రెడ్డి, పోషకులు, విగ్రహదాత గంగిల్ల భాస్కర్ రెడ్డి, నాయకులు మునిగాల భిక్షపతి, మాలోతు శంకర్, బొట్టు బిక్షపతి, శాఖ కార్యదర్శి షేక్ బాబు, మద్రి శ్రీనివాస్, కొత్త గట్టు శ్యామ్ సుందర్, గోపు బుచ్చిరెడ్డి, జానకి, నిరూప, రత్నాకర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రేణికుంట్ల దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. మేడే సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పోతరాజు సారయ్య కామ్రేడ్ గంగిల్ల లింగారెడ్డి విగ్రహం వద్ద సిపిఐ పతాకాన్ని ఎగురవేయగా సీనియర్ నాయకులు గోలి రాజిరెడ్డి సిపిఐ కార్యాలయం వద్ద పార్టీ జెండాను ఎగురవేశారు.

## 8 గంటల పని విధానం కోసం జరిగిన పోరాటమే మేడే:మంత్రి సీతక్క



ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి: 8 గంటల పని విధానం కోసం జరిగిన పోరాటమే మే డే అని మంత్రి సీతక్క అన్నారు. గురువారం ఎఐటియుసి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని జిల్లా వైద్యశాఖ, వ్యవసాయ మార్కెట్ యార్డు, మజీద్ సెంటర్‌లలో పాటుగా ములుగు మండలంలోని ప్రతి గ్రామంలో మేడే జెండాలను ఆవిష్కరించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క పాల్గొని ఏరియా వైద్యశాలలో మేడే జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 8గంటల పని విధానం కోసం జరిగిన పోరాటం నుండి ఉద్భవించిన జెండానే మే డే అన్నారు. ఏఐటియుసి ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం మేడే కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం కార్మికులకు ఉపయోగపడే 44, కార్మిక చట్టాలను 4 కోడ్‌లుగా కుదించడం వలన లక్షలాది మంది కార్మికులకు తీరని అన్యాయం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ మాట్లాడుతూ కార్మిక వర్గం ఐక్యంగా కనీస వేతనాల కోసం, అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్, ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ జగదీష్, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండి అంజద్ పాష, సిపిఐ మండల కార్యదర్శి ముత్యాల రాజు, ఎఐటియుసి నాయకులు ఇంజం కొమురయ్య, బోడ రమేష్, మెడికల్ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కొత్తూరు శ్రీనివాస్, కార్యదర్శి పెదకాసు వినోద్, అజిత, భాస్కర్, అనిల్, సివిల్ సప్లయి హామాలీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కేతపాక సుమన్, రొంటాల రమేష్, మొలుగూరి రాంబాబు, బిక్షపతి, రఘు,భిక్షపతి, పైడి, లావుడ్య రాములు, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల ఐక్యతకు నిదర్శనం మేడే : మంత్రి కొండా సురేఖ

వరంగల్ లక్ష్మీ పురం మార్కెట్లో మేడే వేడుకల్లో మంత్రి కొండా సురేఖ




ప్రజాపక్షం / వరంగల్ ప్రతినిధి : దేశానికి వెన్నెముక శ్రామిక శక్తియని, వారి అవిశ్రాంత, అంకిత భావానికి ఐక్యత, పోరాటాలకు గుర్తింపుగా కార్మిక దినోత్సవం నిలుస్తుందని రాష్ట్ర అటవీ, పర్యావరణ దేవాదాయశాఖ మంత్రివర్యులు కొండా సురేఖ అన్నారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని (మే 1) పురస్కరించుకొని వరంగల్ నగర పరిధి లక్ష్మీ పురం మార్కెట్ లో ఘనంగా నిర్వహించిన మేడే వేడుకల్లో మంత్రి కొండా సురేఖ పాల్గొని కార్మిక జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రపంచ కార్మిక, కర్షక, శ్రామికులకు మే డే శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా.సత్య శారద, అదనపు కలెక్టర్ సంధ్యా రాణి, కార్పొరేటర్లు చింతాకుల అనిల్ కుమార్, ప్రవీణ్ కుమార్, కార్మిక సంఘాల నాయకులు, మహిళా, హమాలీ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ మే డే స్ఫూర్తితో తెలంగాణ ప్రజాప్రభుత్వం కార్మికుల సంక్షేమం కోసం పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నదని తెలిపారు. సమాజ శ్రేయస్సు కోసం, తమ కుటుంబం కోసం కార్మికులు సాధించిన విజయాలు సహకారం మరిచిపోలేనిదని అన్నారు. కార్మికుడు తన చెమట చుక్కలను, రక్త మాంసాలను కరిగించి పని చేస్తేనే ఈ ప్రపంచం ముందుకు సాగుతుందన్నారు. మే డే ఒక చారిత్రాత్మక చైతన్య దినమని, చికాగోలో ఉన్న కొంత మంది ప్రాణత్యాగం చేసి ప్రపంచంలోని కార్మిక వర్గాలకు కొత్త వెలుగును ప్రసాదించిన రోజని, ప్రజల శ్రమను రోజుల తరబడి దోచుకున్న సమయంలో ఈ చాకిరీ మేం చేయలేమని పనిముట్లు కింద పడేసి ఎనిమిది గంటల పని దినం కోసం పోరాడి చివరకు ప్రాణాలను సైతం తృణ ప్రాయంగా త్యజించడం కార్మిక వర్గ పోరాట పటిమకు నిదర్శనమన్నారు. 24 గంటలలో ఎనిమిది గంటలు పని, ఎనిమిది గంటలు విశ్రాంతి, ఎనిమిది గంటలు రిక్రియేషన్ అన్న పద్ధతిని కార్మికులు పోరాటం ద్వారా సాధించుకున్నారని మంత్రి తెలిపారు. అంతకు ముందు మంత్రి. కలెక్టర్ తో కలసి మార్కెట్ కలియతిరిగి ఏమైనా సమస్యలు ఉన్నాయా అంటూ కూరగాయల వ్యాపారులను ఆడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా కార్మిక విశ్రాంతి భవనం ఏర్పాటు చేయాలని కార్మికులు మంత్రిని వినతి పత్రాన్ని అందించగా మంత్రి సానుకూలంగా స్పందించారు.

## కార్మిక హక్కులకై పోరాడండి



ప్రజాపక్షం/వెంకటాపురం : కార్మికులందరూ తమ హక్కులకై నిరంతర పోరాటాలకు సిద్ధంగా ఉండాలని ఎఐటియుసి ములుగు జిల్లా అధ్యక్షులు పోలం కొండయ్య మేస్త్ర కోరారు. కార్మిక దినోత్సవం మే డే ని పురస్కరించుకొని గురువారం వెంకటాపురం మండల కేంద్రంలో ఎఐటియుసి ఆధ్వర్యంలో జెండా ఎగురవేశారు. ఆయన మాట్లాడుతూ అసంఘటిత రంగ కార్మికుల సం క్షేమం కోసం, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, భవన నిర్మాణ కార్మికుల కోసం మరింత మెరుగైన ప్రయోజనాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో కనకదుర్గ గుడి సెంటర్ నుంచి శివాలయం వరకు కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేస్తూ బైక్ ర్యాలీ నిర్వహించారు. భవన నిర్మాణ కార్మిక సంఘం (ఎఐటియుసి అనుబంధం) మండల కార్యదర్శి బుర్రి క్రాంతి కుమార్, ఉపాధ్యక్షులు సకినాలకృష్ణ, తన్నీరు వెంకటేశ్వర్లు, యనమల రాజు, సిపిఐ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పది ఫలితాలలో నారాయణ విజయబేరి




ప్రజాపక్షం/హన్మకొండ టౌన్ : హన్మకొండ జిల్లా నక్కలగుట్టలో ఉన్న నారాయణ స్కూల్‌లో పదో తరగతి విద్యర్థులు జిల్లా వ్యాప్తంగా ప్రభంజ నం సృష్టించినారు. నారాయణ ఇన్‌స్టిట్యూషన్స్ వరంగల్ ఒలింపిడ్ 20 24–25 బ్యాచ్ ఎస్సెస్సీ ఫలితాల్లో 100శాతం విజయం సాధించినట్లు ప్రిన్సిపల్ వి అలేఖ్య తెలిపారు, నారాయణ ఇన్‌స్టిట్యూషన్స్ తమ 2024౽–25 విద్యా సంవత్సరపు ఎసెస్సీ విద్యార్థులు అందరూ ఉత్తీర్ణులు కావడం పట్ల గర్వంగా తెలియజేస్తుందని, మొత్తం 31మంది విద్యార్థులు ఉత్తీర్ణులై, 100శాతం ఫలితాలను సాధించారు అని, అంతే కాకుండా...15 మంది విద్యార్థులు 550 మార్కులు పైగా సాధించారని,26 మంది విద్యార్థులు 520 మార్కులుపైగా పొందారాని,28 మంది విద్యార్థులు 500 మార్కులు పైగా స్కోర్ చేశారన్నారు, ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా డిజిఎం రిజ్వానా ఇమ్రాన్, ఆర్ ఐ శ్రీనివాస్ చారి, ప్రిన్సిపల్ వి అలేఖ్య, అకాడమీక్ డీన్ రాజశేఖర్ ఏవో ఎండి ఆదిల్, కో ఆర్డినేటర్స్ సాయి కృష్ణ, శిరీష, శ్యమల, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తల్లీ దండ్రులు ఉన్నారు.

# నియంతృత్వ పాలకుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు పంజాల రమేష్



ప్రజాపక్షం / నర్సంపేట : కార్మిక వర్గ వ్యతిరేక నియంతృత్వ పాలకుల పట్ల కార్మికులు, ప్రజలు అప్రమత్తంగా ఉండి పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు పంజాల రమేష్ అన్నారు. 139వ మేడే సందర్భంగా సిపిఐ నర్సంపేట మండల సమితి ఆధ్వర్యంలో మాదన్నపేట రోడ్డు సిపిఐ కాలనీలో, అంబేద్కర్ సెంటర్లో, ఎఫ్‌సిఐ గోదాం వద్ద బజారు హమాలీ కార్మికులు ఎర్రజెండాలు ఎగురవేసి మే డే ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడతూ ఆనాడు చికాగో నగరంలో మరణించిన అమరవీరులకు జోహార్లు అర్పించి, ఆ అమరవీరులు చిందించిన రక్తంలో ఎరుపెక్కిన జెండాను మరింత ఎరుపెక్కించి కార్మికుల హక్కుల కోసం సాగే పోరాటాలలో కార్మికులు ముందుండి పోరాడాలని, ఆనాడు సాధించుకున్న ఎనిమిది గంటల పని దినాన్ని ఈనాటి బిజెపి ప్రభుత్వం మోదీ సర్కార్ 44 కార్మిక చట్టాలను నాలుగు చట్టాలుగా తీసుకొచ్చి కార్మికుల హక్కులను కాలరాసే ప్రయత్నం కొనసాగిస్తున్నారని, కార్పొరేట్ సంస్థలకు అనుకూల విధానాలను తీసుకొస్తూ 12 గంటల పని విధానాన్ని అమలు చేయటానికి ప్రభుత్వం ప్రయత్నిస్తుందని, ఇలాంటి విధానాలను కార్మికులు కార్మికులు వ్యతిరేకిస్తున్న మోదీ ప్రభుత్వం పెడచెవిన పెడుతుందని ప్రభుత్వ విధానాలు మార్చుకోకపోతే రానున్న రోజుల్లో బిజెపి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాల్సి ఉంటుందని ప్రభుత్వాలను ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అక్కపెల్లి రమేష్. మండల కార్యదర్శి గడ్డం యాకయ్య, జిల్లా సమితి సభ్యులు మియాపురం గోవర్ధన్, మహిళా సమైక్య జిల్లా అధ్యక్షురాలు పాలక కవిత, యువజన సమైక్య జిల్లా అధ్యక్షులు అయిత యాకుబ్ , సిపిఐ నాయకులు గడ్డం నాగరాజు, పిట్టల సతీష్ ,బాదరబోయిన యాదగిరి, బర్ల సందీప్, సాంబరాజు, వెంకన్న, శైలజ, మమత, మంజుల, గుంటి ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# మేడే స్ఫూర్తితో హక్కులకై ఉద్యమించాలి

ఎఐటియుసి బ్రాంచ్ సెక్రెటరీ రమేష్




ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :చికాగో నగరంలో కార్మికులు చిందించిన అమరవీరుల త్యాగాల మేడే స్ఫూర్తితో హక్కులకై ఉద్యమించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి బ్రాంచ్ సెక్రెటరీ మోటపలుకుల రమేష్ అన్నారు. ప్రపంచ కార్మిక దినోత్సవ సందర్భంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఎఐటియుసి కొముర‌య్య భవన్‌తో పాటు 22 సెంటర్లలో మేడే వేడుకలను ఎఐటియుసి, సిపిఐ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎఐటియుసి కొమురయ్య భవన్ నుండి కారల్ మార్క్స్ కాలనీ, రాజీవ్, అంబేద్కర్, జయశంకర్ సెంటర్ల మీదుగా తహసీల్దార్ కార్యాలయం మీదుగా ఎఐటియుసి కార్యాలయం వరకు 500మందితో భారీ ర్యాలీ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎఐటియుసి బ్రాంచ్ సెక్రెటరీ రమేష్ ముఖ్య అతిథిగా హాజరైనారు. బస్టాండ్ ఆవరణంలో అమరవీరుల స్తూపం వద్ద ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, చికాగో నగరంలో చిందించిన అమరుల త్యాగం ఫలాలే కార్మికులు 12 గంటల పని దినాలని వ్యతిరేకిస్తూ ఎనిమిది గంటల పని కావాలని జరిగిన పోరాటంలో అమరులైనారని, వారి పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. బ్రిటిష్ కాలం నుండి ఎన్నో పోరాటాలతో సాధించుకున్న 44 కార్మిక హక్కులను కేంద్రంలో మోదీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్ లుగా విభజించి కార్మిక హక్కులను హరించి వేస్తుందన్నారు. కార్మికుల పక్షాన నిరంతరం ఎర్రజెండా పక్షాన పోరాటాలు ఎఐటియుసి నిర్వహిస్తుందని కార్మిక హక్కుల రక్షణ ధ్యేయంగా ఎఐటియుసి పనిచేస్తుందని, ఈ సందర్భంగా కార్మికుల అందరికీ రమేష్ మేడే సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి ఎఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి మోటపలుకుల రమేష్, బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ మాతంగి రామచందర్, అసిస్టెంట్ బ్రాంచ్ కార్యదర్శిలు గురిజేపల్లి సుధాకర్ రెడ్డి జి.శ్రీనివాస్, ఎం.విజేందర్, ఆసిఫ్ పాషా, కాంట్రాక్ట్ కార్మికుల ఇంచార్జి నూకల చంద్రమౌళి, సిపిఐ పట్టణ కార్యదర్శి ప్రవీణ్ కుమార్, జిల్లా కమిటీ సభ్యులు క్యాతరాజు, సతీష్, కొరిమి సుగుణ నేరెళ్ల జోసెఫ్ శ్రీకాంత్, కార్మికులు ఎఐటియుసి నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## లేబర్ కోడ్స్ రద్దుకై పోరాడుదాం

ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి




ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ : గురువారం హనుమకొండ లోని హరిత కాకతీయ హోటల్ ముందు హరిత కాకతీయ హోటల్ టూరిజం వర్కర్స్ యూనియన్, ఎఐటియుసి, ఆధ్వర్యంలో సిహెచ్ శ్యాంప్రసాద్ చేతుల మీదుగా మే డే, జెండా ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా ఎఐటియుసి హనుమకొండ జిల్లా అధ్యక్షులు వేల్పుల సారంగపాణి, హరిత హోటల్ డిప్యూటీ మేనేజర్ సి.హెచ్ .శ్రీధర్ రెడ్డి ముఖ్య అతిదిగా పాల్గొని మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను మోదీ పాలనలో పోరాడుతూ కాపాడుకోవలసిన గత్యంతరం ఏర్పడిందన్నారు. కేంద్రంలో మూడవ సారి అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్స్ ను దొడ్డి దారిలో ఆమోదించుకొని అమలు చేయజూస్తుందన్నారు. కార్మిక చట్టాలను రద్దు చేస్తూ నాలుగు లేబర్ కోడ్స్ ను తీసుకురావడం యాజమాన్యాల కొమ్ము కాయడమే అన్నారు. లేబర్ కొడ్స్ అమలయితే కార్మికులు సంఘం పెట్టుకోవడానికి సమ్మె చేయడానికి హక్కులు కఠినతరం అవుతాయన్నారు. ఎనిమిది గంటల పని దినం పోయి 12 గంటల పని దినం వస్తుందని, కార్మికుల హక్కులు కాలరాయపబడి దుర్భర పరిస్థితులలోకి నెట్టబడతారన్నారు. కాబట్టి లేబర్ కోడ్స్ రద్దు కోసం దేశవ్యాప్తంగా అన్ని ఉద్యోగ, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న మే 20 సార్వత్రిక సమ్మెలో మున్సిపల్ కార్మికులందరు అధిక సంఖ్యలో పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. మోదీ ప్రభుత్వం ఎప్పటికైనా నాలుగు లేబర్ కోర్సును తక్షణమే రద్దు చేయాలని, పాత కార్మిక చట్టసలనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ మేడే అవిష్కరణ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, నాయకులు మంద కుమార్ మాదిగ, సాంభశివరెడ్డి,తాళ్లపేల్లి అజయ్ కుమార్, సి.హెచ్, శ్యాం ప్రసాద్, సదానం దం, నరేష్, రమేష్, తిరుపతి, అన్నమ్మ, రూప, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## పదో తరగతి ఫలితాలలో 'ఆర్బిట్' ప్రభంజనం



ప్రజాపక్షం/హసన్ పర్తి : మున్సిపల్ కార్పొరేషన్ 65వ డివిజన్ ఎల్లాపూర్ గ్రామం పరిధి ఆర్బిట్ ఇ టెక్నో పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు బుధవారం వెలువడిన పదవతరగతి వార్షిక పరీక్ష ఫలితాలలో అత్యధిక మార్కులు సాధించారని ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ చిట్టిరెడ్డి భగవాన్ రెడ్డి తెలిపారు. అత్యధిక మార్కుల సాధించిన విద్యార్థులలో ఎం. వినీల్ రెడ్డి581, టి. సంజనారెడ్డి580, ఏ. విశాల్ రెడ్డి 573 మార్కులు సాధించారని, 120 మంది విద్యార్థులలో 90 మార్కులకు పైగా సాధించారని ప్రిన్సిపాల్ తెలిపారు.



# స్థానికం

REGIONAL NEWS

ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్ తెలిపారు. గురువారం 139వ మేడేను పురస్కరించుకుని ఖమ్మం నగరంలోని 14, 15 డివిజన్ కొత్తగూడెం సిపిఐ శాఖ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సిపిఐ కార్యాలయం వద్ద అరుణ పతాకాన్ని ఎగుర వేశారు. ఈ సందర్భంగా పగడాల మల్లేష్ మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న హక్కులను పాలకులు కాలరా



స్తున్నారని తెలిపారు.పోరాటాలతోనే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. నాయకులు ,కొత్తగూడెం శాఖ కార్యదర్శి , 15వ డివిజన్ కార్యదర్శి జొన్నలగడ్డ వెంకటేశ్వర్లు, కొ త్తగూడెం, ధంసలాపురం మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు,తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ కార్మిక దినోత్సవం



**ప్రజాపక్షం/ అశ్వారావుపేట:** ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా అశ్వారావుపేట సిపిఐ, ఎఐటియుసి మండల సమితి ఆధ్వర్యంలో మేడే వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. సిపిఐ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ఎఐటియుసి కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొని సయ్యద్ మియాజాని భవన్ వద్ద ఎఐటియుసి జెండాను ఆవిష్కరించి సిపిఐ కార్యాలయం నుండి బస్టాండ్ సెంటర్, ప్రధాన కూడళ్లో భారీ ర్యాలీ నిర్వహించారు. అదేవిధంగా మండలంలోపలు గ్రామాల్లో ఎఐటియుసి జెండాలను ఆవిష్కరించి మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సిపిఐ అశ్వారావుపేట నియోజకవర్గ కార్యదర్శి సయ్యద్ సలీం మాట్లాడుతూ ప్రపంచ కార్మికుల దినోత్సవం ఇప్పటికి 139 సంవత్సరాలు పూర్తి చేసుకుందని ఆయన అన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 20న నిర్వహించనున్న దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి , టౌన్ సెక్రటరీ నూకవరపు విజయ్‌కాంత్, ఎఐటియుసి మండల కార్యదర్శి పటాన్‌జలాల్, రాష్ట్ర సమితి సభ్యులు అబ్బాస్, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శులు , ఎఐటియుసి, సిపిఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా 'మేడే'ఉత్సవాలు



**ప్రజాపక్షం/మణుగూరు:**మణుగూరు మండల ం, పట్టణంలో సిపిఐ ఆధ్వర్యంలో మేడే 139 వ ఉత్సవాలు గ్రామ గ్రామాన, బస్తీలలో, వాడలలో పెద్ద ఎత్తున జెండా పండుగను నిర్వహించారు. మండలం పట్టణంలో సుమారు 60 మేడే జెండాలను ఎగురవేశారు. గురువారం బొగ్గు ముఠా కార్యాలయం దగ్గర జరిగిన సమావేశంలో జెండా ఆవిష్కరించి, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.అయోధ్య హాజరై మాట్లాడుతూ 1886 ముందు కార్మికులను వెట్టి చాకిరీ చేయిస్తూ 18 గంటల పని విధానం అమలు చేసేవారని, కార్మికుల శ్రమను దోచుకుంటూ బానిసత్వంగా మార్చేవారని,ఈ విధానాలను నిరసిస్తూ కార్మికులు ఐక్యంగా అమెరికాలోని చికాగో నగరంలో పెద్దఎత్తున ఆందోళన చేశారని, అనేకమంది ఈ ఆందోళనలో కాల్పుల్లో గాయపడి మరణించారన్నారు. మరణించినటువంటి అమరవీరుల రక్తంతో చెందిన జెండానే మేడే అని అన్నారు. దిగివచ్చిన ప్రభుత్వం కార్మికుల పని గంటలు, డిమాండ్లను ప్రభుత్వం అంగీకరించ డం జరిగిందని, నాటినుండి మే డే ఫస్ట్‌ను కార్మిక దినంగా ప్రపంచ కార్మికుల పండుగగా జరుపుకుంటారని అన్నారు. కార్యక్రమంలో మహిళా సమెక్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మి కుమారి, పినపాక నియోజకవర్గం కార్యదర్శి ఎస్. పుల్లారెడ్డి,మండల కార్యదర్శి జంగం మోహన్ రావు, పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, జిల్లా సమితి సభ్యులు ఎస్ కే సర్వర్, సోందే కుటుంబరావు, ఎఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి, వై.రామ్ గోపాల్, ఎఐటియుసి మణుగూరు మ ండల అధ్యక్ష కార్యదర్శులు రాయల భిక్షం, గ డ్డం వెంకటేశ్వర్లు, మాజీ ఎంపిపి ఎడారి రమేష్, మహిళా సమైక్య మండల అధ్యక్ష కార్యదర్శులు , మాజీఎంపిటిసిలు,కార్యవర్గసభ్యులుఆటో యూ నియన్ అధ్యక్ష కార్యదర్శులు వంక, టాటా మ్యా జిక్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు , యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వేసవి క్రీడా శిక్షణ శిబిరం ప్రారంభం



**ప్రజాపక్షం/ మధిర :** మధిరలోని ఇండోర్‌స్టేడియంలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని ఎంఇఓ వై.ప్రభాకర్, మున్సిపల్ కమీషనర్ సంపత్‌కుమార్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, సూరంశెట్టి కిషోర్, టౌన్ అధ్యక్షులు మిరియాల రమణగుప్తలు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి సెలవుల దృష్ట్యా జరిగే కబడ్డీ, బ్యాట్మెంటన్ క్రీడా శిక్షణా శిబిరాన్ని విద్యార్థినీ, విద్యార్థులు, క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమం మాజీ కౌన్సిలర్ మల్లాది వాసు, కాంగ్రెస్ నాయకులు పాటిబండ్ల సత్యంబాబు, కర్నాటి రామారావు, షేక్.బాజి, అడ్మినిస్ట్రేటర్ కమ్ ఇన్‌చార్జి చిన్ని షటిల్ బ్యాట్మెంటన్ కోచ్ సునీల, కబడ్డీ కోచ్ ప్రవీణ్‌కుమార్, సీనియర్ పిటి తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/ మధిర రూరల్ :** విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని రొంపిమళ్ళ గ్రామంలో గురువారం జరిగింది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రొంపిమళ్ళ గ్రామానికి చెందిన శీలం మల్లికార్జున్‌రెడ్డి(33) అనే వ్యక్తి తన ఇంట్లో కూలర్ సంబంధించిన ప్లగ్‌ను పెడుతున్న క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందినట్లు తెలిపారు. మృతునికి ఇంకా వివాహం కాలేదని, గతంలో తండ్రి మృతి చెందడంతో తల్లితో కలిసి నివాసముంటున్నట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న రూరల్ ఎస్సై లక్ష్మీ భార్గవి సంఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మధిర ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుని తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## 'ఉషు' పోటీల్లో అభిషేక్‌కి సిల్వర్‌మెడల్



**ప్రజాపక్షం/కొణిజర్ల :**తెలంగాణ మూడవ రాష్ట్రస్థాయి స్థాయి సబ్ జూనియ ర్స్, జూనియర్స్, సీనియర్స్ ఉషు పోటీలు రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలో ని ర్వహించారు. ఈపోటీల్లో ఖమ్మం జిల్లా నుంచి పాల్గొన్న క్రీడాకారులు 21 మె డల్స్ సాధించారని ఖమ్మం జిల్లా ఉషు కోచ్ పరిపూర్ణాచారి తెలిపారు. అం దులో భాగంగా కొణిజర్ల మండలానికి చెందిన వేములకొండ అభిషేక్ గౌడ్ అండర్ 12 సబ్ జూనియర్ 52 కిలోల విభాగంలో రాష్ట్రస్థాయి ద్వితీయ బహుమతి సిల్వర్ మెడల్ సాధించినట్లు తెలిపారు. వేములకొండ అభిషేక్ గౌడ్ ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో జాతీయ కోచ్ పరిపూర్ణాచారి దగ్గర శిక్షకుడిగా ఉన్నాడు. వేములకొండ అభిషేక్ ను ఖమ్మం జిల్లా యువజన క్రీడల అధికారి టి సునీల్ కుమార్‌రెడ్డి, ఉషుకోచ్ పరిపూర్ణాచారి అభినందించారు.

### సిపిఐ, ఎఐటియుసి ఆధ్వర్యంలో మేడే

# వాడవాడలా 'అరుణ' పతాకావిష్కరణ

హక్కులను కాలరాస్తున్న పాలకులు

పోరాటాలతోనే ప్రజాసమస్యల పరిష్కారం

: బాగంహేమంతరావు



**ప్రజాపక్షం/ఖమ్మం :** 139వ మేడేను భారత కమ్యూనిస్టు పార్టీ, ఎఐటియుసి ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలో గురువారం ఘనంగా నిర్వహించారు. సిపిఐ , ఎఐటియుసి నాయకులు ర్యాలీగా తిరుగుతూ అరుణ పతాకాలను ఆవిష్కరించారు. నగరంలోని ఇందిరా నగర్ పర్ణశాల వద్ద గల ఎఐటియుసి, సిపిఐ పైలాన్ వద్ద సిపిఐ పతాకాన్ని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు ఆవిష్కరించగా ఎఐటియుసి పతాకాన్ని ఎఐటియుసి జాతీయసమితి సభ్యులు బిజి క్లైమెంట్ ఆవిష్కరించారు. డబుల్ బెడ్‌రూం వద్ద బాగం హేమంతరావు, ఖానాపురం హవేలీ శాఖ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ నగర్‌లో జరిగిన మేడే వేడుకల్లో అరుణ పతాకాన్ని ఏనుగు గాంధీ ఆవిష్కరించగా, హవేలీ సిపిఐ కార్యాలయం వద్ద ఎస్‌కె జానిమియా ఆవిష్కరించారు. నగర పరిధిలోని కొత్తగూడెంలో సిపిఐ పతాకాన్ని జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్ ఆవిష్కరించగా నిజాంపేట వద్దఎఐటియుసి నాయకులు శింగు నర్సింహారావు ఎఐటియుసి పతాకాన్ని ఆవిష్కరించారు. ఇండస్ట్రియల్ ఏరియాలో సిపిఐ పతాకాన్నిఎఐటియుసి జిల్లా అధ్యక్షులు గాదె లక్ష్మి నారాయణ ఆవిష్కరించగా బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన మేడే వేడుకల్లో శింగు నర్సింహారావు, ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన మేడే వేడుకల్లో ఆటో వర్కర్స్ యూనియన్ నాయకుడు పి. మోహన్‌రావు అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. లెనిన్ నగర్, రమణ గుట్ట ప్రాంతంలో జరిగిన మేడే వేడుకల్లో అరుణ పతాకాలను మహ్మద్ సలాం, మేకల శ్రీనివాసరావు ఆవిష్కరించారు. బస్‌డిపో వద్ద ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన మేడే వేడుకల్లో అరుణ పతాకాన్ని బాగం హేమంతరావు ఆవిష్కరించారు. పాత బస్టాండ్ వద్ద గల గిరిప్రసాద్ విగ్రహం వద్ద అరుణ పతాకాన్ని సిపిఐ నాయకులు ఆవిష్కరించారు. త్రీటౌన్ ప్రాంతంలో జరిగిన మేడే వేడుకల్లో నూనె శశిధర్ అరుణ పతాకాన్ని ఆవిష్కరించగా వన్‌టౌన్ ప్రాంతంలో పలు చోట్ల మేడే వేడుకలను నిర్వహించారు. మేడే వేడుకలను పురస్కరించుకుని ఎఐటియుసి, సిపిఐ ఆధ్వర్యంలో పర్ణశాల వద్ద బహిరంగ సభ నిర్వహించారు. ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు అధ్యక్షతన జరిగిన సభలో బాగం హేమంతరావు మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న హక్కులను నేటి పాలకులు కాలరాస్తున్నారని ఆయన తెలిపారు. శ్రమ దోపిడీ తీరు మారుతుందని ఆయన తెలిపారు. ఒకప్పుడు సంక్షేమానికి ముఖ్యంగా ఉత్పత్తి కారకులైన కార్మికుల సంక్షేమానికి పాలకులు పెద్ద పీట వేసేవారని కానీ దశాబ్ద కాలంగా కార్మికుల సంక్షేమం కోసం లక్ష కోట్లు కేటాయిస్తే కార్పొరేట్ శక్తులకు సంబంధించిన రుణాలను మాఫీ చేయడానికి రూ. 16.50 లక్షల కోట్లు వెచ్చించారని ఆయన తెలిపారు. మోదీ అంటే కార్పొరేట్ శక్తుల చుట్టమని కార్మిక, శ్రమ జీవులకు శత్రువన్నారు. మోదీ తాను ఏది అనుకుంటే అది అమలు జరపడానికి సిద్ధమవుతున్నారని మోదీకి సైతం చెక్ పెట్టే సమయం ఆసన్నమైందన్నారు. మే 20న జరిగే సార్వత్రిక సమ్మెకు రైతులు, కార్మికులు, యువజన విద్యార్థులు, ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలు మద్దతు పలికి ప్రభుత్వ ఏకపక్ష విధానాలను తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లా సమితి సభ్యులు ఏనుగు గాంధీ ఆహుతులను వేదికపైకి ఆహ్వానించగా ఈ సభలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, ఎస్‌కె జానిమియా, జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, పోటు కళావతి, బిజి క్లెమెంట్, మహ్మద్ సలాం, తాటి వెంకటేశ్వరరావు, సిహెచ్ సీతామహాలక్ష్మి , రావి శివరామకృష్ణ, మేకల శ్రీనివాసరావు, పగడాల మల్లేష్, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు గాదె లక్ష్మి నారాయణ, ఎఐవైఎఫ్, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శులు నానబాల రామకృష్ణ, ఇటికాల రామకృష్ణ, సిపిఐ జిల్లా సమితి సభ్యులు , పలువురు నగర సమితి సభ్యులు, వివిధ ప్రజా సంఘాల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలు



**ప్రజాపక్షం/పాల్వంచ:**కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలు చేద్దామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. 139వ మేడే సందర్భంగా పాల్వంచ పట్టణ, మండల పరిధిలోని 60 సెంటర్లలో ఎఐటియుసి అనుబంధ ప్రజా సంఘాల కార్యాలయాల వద్ద అరుణపతాకాలను ఆవిష్కరించారు. అనంతరం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సభలో కూనంనేని మాట్లాడుతూ ఎనిమిది గంటల పనివిధానం కోసం చికాగోలో పెద్ద ఎత్తున సాగిన పోరాటంలో ఎందరో కార్మికులు తమ ప్రాణాలను సైతం లెక్కపెట్టకుండా పోరాటం చేశారన్నారు. అనేక పోరాటాలతో సాధించుకున్న కార్మిక చట్టాలను సవరించి యాజమాన్యాలకు, కార్పోరేట్ శక్తులకు, పెట్టుబడివర్గాలకు అనుకూలంగా మార్చేందుకు కుట్రలు పన్నిందిని , ఈ కుట్రలను తిప్పికొట్టాలన్నారు. కనీసవేతన చట్టం, పారిశ్రామిక చట్టాలను సవరణ చేయడంతో పాటు సంస్కరణల పేరుతో ఉద్యోగులు, కార్మికులను తొలగించేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయని చెప్పారు. వీటిని సమర్థవంతంగా ఎదుర్కొని తిప్పికొట్టాలన్నారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా మాట్లాడుతూ చట్టసభల్లో ఉన్న మందబలంతో కార్మిక, ఉద్యోగ, ప్రజా, రైతు వ్యతిరేక చట్టాలను తీసుకొచ్చారని, లాభాల్లో నడుస్తున్న సింగరేణి గనులు, రవాణా, టెలీకం, రైల్వే, బ్యాకులు, పాలసీ, రక్షణ రంగం, ఇస్రో లాంటి తదితర ప్రభుత్వ రంగ సంస్థలను కూడా అదాని, అంబాని లాంటి పెట్టుబడిదారులకు అప్పణంగా కట్టబెట్టిందని విమర్శించారు. ప్రజల కోసం కాకంపడా ఆర్థిక బకాసురులకు, ఆర్థిక నేరగాళ్లకు మోదీ ప్రభుత్వం కొమ్ముకాస్తోందని ఆరోపించారు.ప్రజాస్వామ్య శక్తుల చేతుల్లో మగ్గుతున్న శ్రామిక వర్గానికి అండగా ఉండేది ఎర్రజెండానేఅన్నారు. 139వ ఏడే స్ఫూర్తితో ప్రజాస్వామ్య రక్షణకు, కార్మికహక్కులు, ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణ కోసం కమ్యూనిస్టు పార్టీ నిర్వహించే పోరాటాల్లో ప్రజలు భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు , మండల కార్యదర్శి వీశంశెట్టి పూర్ణచంద్రరావు, జిల్లా సమితి సభ్యులు , సిపిఐఎఐటియుసి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గాలి దుమారానికి కూలిన ఇల్లు



**ప్రజాపక్షం/కొణిజర్ల:**గాలి దుమారానికి మండలపరిధిలోని తుమ్మలపల్లి గ్రామంలో ఇళ్లు కూలిపోయి ఇంటి పైకప్పు రేకులు లేచిపోయి కొద్ది కొద్ది గాయాలతో బయటపడ్డారు. బుధవారం అర్ధరాత్రి భీభత్సమైన గాలి తో తేలికపాటి జల్లు కురిసంది. భారీ ఈదురు గాలులకు గ్రామంలోని పూర్ణకంటి కృష్ణ పూరిల్లు ఒక్కసారి కుప్పకూలింది. అప్పుడు వారు ఆఇంట్లో నిద్రిస్తున్నారు. పైకప్పులోని వాసాలు ఒక్కసారి విరిగిపోయి పూర్తిగా కిందకు వచ్చాయి. కొద్దిగ గట్టిగా ఉన్న వాసాలు బలంతో మంచంపై సుమారు రెండడుగుల వరకు విరిగిన వాసాలు మీదకు వచ్చాయి. ఇంకా కొంచెం బలంగా విరిగి ఉంటే భార్యాభర్తలు ఇద్దరు కర్రలు వారి శరీరభాగాలోకి దూరిపోయేవి. వారికి పెద్ద ప్రమాదం తప్పడంతో ఒక్కసారిగా భయంతో కేకలు వేస్తు బయటకు పరుగులు తీశారు. అదే గ్రామంలో కొత్తపల్లి సుహాసిని, ప్రభాకర్ ల ఇంటిపై ఉన్న రేకులు గాలిదుమారానికి లేచిపోయాయి. సెంటు భూమి లేని నిరుపేదరాలు రేకులతో నిర్మించుకున్న ఇల్లున్న కొత్తపల్లి సుహాసినికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాలేదని ఆవేదన వ్యక్తం చేసింది. తమకు ప్రభుత్వం వారు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని వేడుకొంటోంది.

## పోరాటాలకు పునరంకితం కండి

సిపిఐ సీనియర్ నేత

పువ్వాడ నాగేశ్వరరావు



**ప్రజాపక్షం/ఖమ్మం :** 139వ మేడే స్ఫూర్తితో భవిష్యత్తు పోరాటాలకు పునరంకితం కావాలని సిపిఐ సీనియర్ నేత పువ్వాడ నాగేశ్వరరావు తెలిపారు. అనన్య త్యాగాలు, పోరాటాలు, బలిదానాలతో అనేక హక్కులు సాధించుకున్నామని ప్రతి హక్కు వెనక పోరాటం దాగి ఉందని ఆయన తెలిపారు. 139వ మేడేను పురస్కరించుకుని గురువారం స్థానిక సిపిఐ కార్యాలయంలో అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పువ్వాడ మాట్లాడుతూ స్వాతంత్రానికి పూర్వం స్వాతంత్ర్యం తర్వాత కార్మికుల పక్షాన నిలబడి పోరాడింది సిపిఐ, ఎఐటియుసి మాత్రమేనన్నారు. ప్రస్తుత పాలకులు సంపన్న వర్గాల సేవలో తరిస్తున్నారని పేదలను పూర్తిగా విస్మరించారని ఆయన ఆరోపించారు. పేదలు మరింత పేదలవుతున్నారని సంపద కొద్దిమంది చేతుల్లో పోగుబడుతుందని ఇది దేశ భవిష్యత్తుకే ప్రమాదకరమన్నారు. ప్రజల హక్కుల పరిరక్షణ కార్మిక హక్కుల సాధన ఎర్ర జెండాతోనే సాధ్యమవుతుందని ఎర్ర జెండా నేతృత్వంలో జరిగే పోరాటాలకు దన్నుగా నిలవాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు.కార్యక్రమంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు బిజి క్లైమెంట్, మహ్మద్ సలాం, తాటి వెంకటేశ్వరరావు, పోటు కళావతి, సిహెచ్ సీతామహాలక్ష్మి , మేకల శ్రీనివాసరావు, ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు పిల్లి రమేష్,జిల్లా సమితి సభ్యులు ఉన్నం రంగారావు,తాటి నిర్మల, యానాలి సాంబశివరెడ్డి, ఎస్‌కె సైదా తదితరులు పాల్గొన్నారు.

## చిందిన నెత్తుటి చుక్కల సాక్షిగా హక్కులు సాధించుకోవాలి



**ప్రజాపక్షం/భద్రాచలం:**చిందిన నెత్తుటి చుక్కల సాక్షిగా శ్రామిక హక్కులు సాధించుకోవాలని, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నల్లచట్టాలను భేషరతుగా వెనక్కు తీసుకోవాలని, శ్రామికవర్గానికి ఏకైక అండ ఎర్రజెండా మాత్రమే అని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రావులపల్లి రవికుమార్ అన్నారు. మే డేని పురస్కరించుకుని గురువారం భద్రాచలం డివిజన్ వ్యాప్తంగా ఎర్రజెండాలను రెపరెపలాడాయి. ఆయా కేంద్రాల్లోని సిపిఐ, ఎఐటియుసి జెండాలను ఎగురవేశారు. భద్రాచలం నియోజకవర్గ కేంద్రంలోని పలు చోట్ల మేడే వేడుకలు అరుణ వర్ణమయ్యాయి. ప్రధానంగా సిపిఐ డివిజన్ కార్యాలయం ఎదుటు,కారు స్టాండ్, బస్టాండ్ అవుట్ గేట్ ఆటో స్టాండ్ రావులపల్లి రవికుమార్ ఎర్రజెండా ఎగురవేశారు.పట్టణ సమితి ఆధ్వర్యంలో సీనియర్ నాయకులు మీసాల భాస్కర్ రావు, ఇండస్ట్రీయల్ ఏరియాలో వాతాడి దుర్గారావు, జగదీష్ కాలనీలో గుంజా రామారావు, లంబాడీ కాలనీలోఏసు, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వద్ద సిపిఐ, ఎఐటియుసి ఎర్రజెండాలు ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ టౌన్ కన్వీనర్ మారెడ్డి శివాజీ, ఎఐటియుసి కన్వీనర్ కంబంమెట్టు శ్రీనివాస్, మహిళా సమాఖ్య కన్వీనర్ బైరు వరలక్ష్మి , వెంకన్నతో పాటు కారు, ఆటో స్టాండ్ కార్మికులు, ఏరియా ఆస్పత్రి శానిటేషన్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## సరిహద్దుల్లో మావోయిస్టుల ఘాతుకం

రోడ్డు పనులు గుమస్తా కాల్చి వేత

జెసిబికి నిప్పు



**ప్రజాపక్షం/భద్రాచలం:** ఛత్తీస్‌గఢ్ ఝార్ఖాండ్ సరిహద్దుల్లో మావోయిస్టులు గురువారం ఘాతుకానికి పాల్పడ్డారు. రెండురాష్ట్రాలను కలుపుతూ వేసే రోడ్డు పనుల గుమస్తాను అతిదగ్గరి నుండి మావోయిస్టులు కాల్చిచంపినట్లు తెలుస్తోంది. ఛత్తీస్‌గడ్‌లోని బలరాంపూర్ సరిహద్దుల్లో ఈ ఘాటుకం చోటు చేసుకుంది. ఆదే ప్రాంతంలో ఉన్న రోడ్డు పనులు నిర్వహించే జేసిబి వాహనాన్ని కూడా తగులపెట్టారు. దీంతో ఇటు ఛత్తీస్‌గఢ్ పోలీసు బలగాలు అప్రమత్తం మయ్యాయి. ఝార్ఖాండ్ పోలీసులతో అనుసంధానం చేసుకుంటూ పరిస్థితిని నిషితంగా పరిశీలిస్తూ ముందుకు సాగుతున్నారు.ఇదిలా ఉండగా కరెగుట్టల్లో వేలాది మంది బలగాలు బేస్ క్యాంపులు ఏర్పాటు చేసుకుని కూంబింగ్ నిర్వహిస్తున్న వేళ్త పొరుగునే మావోయిస్టులు విధ్వంసానికి పాల్పడి బలగాలకు సవాల్ విసిరారు. దీంతో ఇటు తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఝార్ఖాండ్, ఒడిస్సా, ఆంధ్రప్రదేశ్ పోలీసులు అప్రమత్తమయ్యారు. ఆయా అంతరాష్ట్ర రహదారులను తమ ఆదీనంలోనికి తీసుకుని పెద్ద ఎత్తున నిఘా పటిష్టం చేశారు. రహదారులు పొడవునా గస్తీ కాస్తున్నారు. వచ్చిపోయే వాహనాల తనిఖీలు చేపట్టారు. మావోయిస్టులు తెలంగాణ వైపుకు వచ్చే అవకాశాలు ఉంటాయనే అనుమానాలతో గోదావరి తీర ప్రంతాల్లోని ఫెర్రీ పాయింట్లు, రహదారులపైకి చేరుకునే కచ్చారోడ్లపై గేడకన్ను వేశారు.

**కూంబింక్‌కు సవాల్:**కరెగుట్టల్లో బేస్ క్యాపు ఏర్పాటుచేసుకుని జాతీయజెండా ఎగురవేసి పెద్ద ఎత్తున కూంబింగ్ నిర్వహిస్తున్న వేళ సరిహద్దుల్లో మావోయిస్టులు విధ్వంసానికి పాల్పడి పోలీసులకు సవాల్ విసిరారు. ఓ పక్క శాంతి చర్చలకు తాము సిద్దమే అని చెబుతున్నప్పటికీ ప్రభుత్వం నుండి ఎలాంటి స్పందన లేకపోవడంతో మావోయిస్టు పార్టీ అంతర్మదన యుద్ధంలో భాగంగా వ్యక్తిని హతమార్చినట్లు అనుమార్చి, జెసిబికి నిప్పంటించినట్లు విప్లవోద్యమ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పటికే 90 కిమీ మేరా ఉన్న కర్రెగుట్టలను బలగాలు తమ ఆదీనంలోనికి తీసుకున్నాయి. ములుగుజిల్లా సరిహద్దు కేంద్రంగా చేసుకుని ఛత్తీస్‌గఢ్‌లోని కొత్తపల్లి మొదలుకుని బీమారంపాడు, కస్తూరిపాడు, చిన్నఉట్లపల్లి, పెద్ద ఉట్లపల్లి, పూజారికాంకేరి, కుంజపర్తి, నచ్చి ఎలిమిడి, నడిపెల్లి గల్గమ్, రుద్రారం వరకు 90 కి.మీ విస్తీర్ణంలో ఈ కర్రెగుట్టలు ఉంటాయి. వీటని భద్రతా బలగాలు జల్లడపడుతున్నారు. ఇప్పటికే కిలోమీటర్ల పడువున్న ఉన్న బంకర్లను గుట్టలపైగుర్తించిన బలగాలు మావోయిస్టులు ఇటుగానే ఉన్నారనే అనుమానాలతో గత పదిరోజులుగా తీవ్రసోదాలు సాగిస్తున్నారు. ఈ క్రమంలో అడుగడుగునా ఎదురవుతున్న అడ్డంకులను చేదించుకుంటూ ముందుకు సాగుతున్నారు. ఇప్పటికే 115కి పైగా ఐఇడి బాంబులను నిర్వీర్యం చేశారు. ప్రషర్ కుక్కర్ బాంబులు, బీర్ బాటిల్ బాంబులు కూడా తారసపడుతుండటంతో వాటిని సైతం చాకచక్యంగా నిర్వీర్యం చేస్తూ జాగిలాల సహకారంతో ముందడుగు వేస్తున్నారు. కానీ పది రోజులుగా మావోయిస్టుల ఆచూకి మాత్రం లభ్యం కాలేదు. కర్రెగుట్టల్లో ఉన్నట్లు బలగాలను నమ్మించి అటు నుండి వేరే ప్రాంతానికి వారుజారుకున్నట్లు కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలా ఉండగా 2026 మార్చి నాటికి దేశంలో మావోయిస్టు పార్టీ లేకుండా చేస్తామని కేంద్ర హోం మంత్రి అమీత్ షా పలుమార్లు ప్రకటించిన విషయం విదితమే. దీంతో దండకారణ్యంలో యుద్ధ వాతావరణం అలుముకుంది. ఏ క్షణం ఏం జరుగుతుందో తెలియక అటవీ ప్రాంతాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీస్తున్నారు.

## కార్మికుల హక్కుల సాధనలో 'ఎఐటియుసి' పాత్ర మరువలేనిది



**ప్రజాపక్షం/ మధిర :** భారతదేశంలో 1920లో ఎఐటియుసి ఆవిర్భావం తర్వాత కార్మిక హక్కుల కోసం శ్రమదోపిడీకి వ్యతిరేకంగా అనేక చారిత్రత్మాక పోరాటాలు చేసి కార్మికుల హక్కుల సాధించటంలో ఎఐటియుసి పాత్ర మరువలేనిదని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవిబాబు, మం దడపు రాణి అన్నారు. ఈ సందర్భంగా స్థానిక ఎ ఐటియుసి కార్యాలయం నందు జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో వారు మా ట్లాడుతూ ప్రస్తుతం దేశంలో ఉన్న కార్మిక వర్గాలు అనుభవిస్తున్న హక్కుల్లో ఏ ఒక్కటి కూడా పోరాటాలు జరగకుండా సాధించుకోలేదని తెలిపారు. నేడు భారతదేశంలో మోదీప్రభుత్వం వచ్చిన త ర్వాత 44 కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసి 4 లే బర్ కోడ్స్ తీసుకువచ్చి కార్మిక వ్యతిరేకినని మోదీ ప్రభుత్వం నిరూపించుకుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా, కా ర్మికులకు వ్యతిరేకంగా అనుసరిస్తున్న తీరుకు నిరసగా ఈనెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేసేందుకు కార్మిక సోదరులందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి ,ఎఐటియుసి డివిజన్ కార్యద ర్శి , సిపిఐ జిల్లా సమితి స భ్యులు, ఎఐటియుసి మండలకార్యదర్శి,మున్సిపల్‌వర్కర్,ఆటో యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ‘మేడే’ స్ఫూర్తితో పోరాటాలు

### ప్రపంచ కార్మిక దినోత్సవంలో కార్మిక నాయకుల పిలుపు

### ఘనంగా మేడే ఉత్సవాలు

### వాడవాడలా ఎగిరిన ఎర్రజెండా





ఖమ్మం..

**ప్రజాపక్షం/ఖమ్మం :** మేడే స్ఫూర్తితో సమరశీల పోరాటాలకు సన్నద్ధం కావాలని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు కార్మికులకు పిలుపునిచ్చారు. ఖమ్మం జిల్లా కామంచికల్‌లో మేడేను పురస్కరించుకుని సిపిఐ ఆధ్వర్యంలో గురువారం సిపిఐ, ఎఐటియుసి కార్యకర్తలు ఎర్ర చొక్కాలు ధరించి భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన మేడే సభలో హేమంతరావు మాట్లాడుతూ అనేక పోరాటాల ఫలితంగా కార్మిక హక్కుల సాధన జరిగిందని హేమంతరావు తెలిపారు. కాళంగి మోహన్‌రావు అధ్యక్షతన జరిగిన సభలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర సమితి సభ్యులు సిద్దినేని కర్ణకుమార్, జిల్లా నాయకులు పుచ్చకాయల కమలాకర్, మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఉసికల రవి, సీతారాములు, బొప్పి గాంధీ, షాహీన్, నర్సింహారావు, వేములపల్లి రాధాకృష్ణ, నువ్వుల మోహన్‌రావు, మీరా, దాసరి అశోక్, సురేష్, శారద, బొప్పి నాగేశ్వరరావు, గుండ్ర భరత్, శంకర్ పాల్గొన్నారు.

**చర్లపల్లి :** కార్మికులకు కనీస వేతనం రూ.20 వేల రూపాయలు ఇవ్వాలని, కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు విఎస్ బోస్ అన్నారు. మేడేను పురస్కరించుకుని చర్లపల్లి పారిశ్రామికవాడలోని హెచ్‌పి గ్యాస్,ఇండియన్ గ్యాస్ లోడింగ్ అన్‌లోడింగ్ కార్మికులు,పెద్ద చర్లపల్లి చౌరస్తాలో మున్సిపల్ కార్మికుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జెండా ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో దర్శనం కృష్ణ, ఎల్ నవీన్, కె రాము, విఠల్, పోచ్చయ్య గౌడ్, కరుణాకర్‌రెడ్డి, శివరాములు, నరేష్, శ్రీనివాస్‌రెడ్డి, తూర్పాటి యాదగిరి పాల్గొన్నారు.

**మంచిర్యాల :** కార్మికవర్గాన్ని బానిసలుగా చూస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకం గా పోరాడాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్ పిలుపునిచ్చారు. మేడే సందర్భంగా మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఎఐటియుసి జెండాను మేకల దాసు, సిపిఐ కార్యాలయం వద్ద అరుణ పతాకాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో రామడుగు లక్ష్మణ్, మేకల దాసు, కలిందర్ అలీ ఖాన్, మిట్టపల్లి పౌలు, మిట్టపల్లి శ్రీనివాస్, తిరుమల, అరుణ, అటుకాపురం రాయమల్లు, మధు, సత్యనారాయణ, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

**నాగర్‌కర్నూల్:** మేడే కార్మికుల శ్రమకు చరిత్రగా నిలుస్తుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు ఎం.బాల్‌నర్సింహ్మ అన్నారు. జిల్లాకేంద్రంలో ఎఐటియుసి ఆధ్వర్యంలో మేడే జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా కార్యదర్శి శివశంకర్, ఆనంద్‌జి, వార్ల వెంకటయ్య, మర్యాద వెంకటయ్య, బిజ్జ శ్రీనివాస్, బండి లక్ష్మిపతి, శ్రీను, గోపిచారి, కొత్తరామస్వామి, వెంకటస్వామి, శివకృష్ణ, బాలపీరు, లక్ష్మయ్య, సర్దార్, భీమయ్య పాల్గొన్నారు.

**జగిత్యాల :** కార్మికులకు మెరుగైన జీవనం సాగాలంటే కనీస వేతనం అమలు కావాలని ఎఐటియుసి జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ముక్రం అన్నారు. మేడే సందర్భంగా జగిత్యాల జిల్లా బీట్ బజార్ ఎఐటియుసి కార్యాలయంలో జగిత్యాల టౌన్ ఇంచార్జి వెన్న మహేష్‌తో కలిసి కార్మిక జెండా ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో ఎన్నం రాజగంగు, ముసిపట్ల లక్ష్మి నారాయణ, అంకం అనసూర్య, గుడిసెల రాధా, సత్తెక్క, పొన్నం రాజమల్లయ్య, మాడిశెట్టి కిరణ్, అల్తాఫ్, వెంకట్, రజాక్, చందు, సాజిత్, మోయిజ్, నారాయణ, అప్సర్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

**శంకరపట్నం :** ప్రపంచ కార్మిక దినోత్సవం మే డే సంధర్భంగా కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలంలోని సిపిఐ కార్యాలయంలో బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్క్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్టల సమ్మయ్య ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి సిపిఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి హాజరై జెండా ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి రేగుల కుమార్, ఉపాధ్యక్షులు కన్నం సదానందం, మేకల పరమేష్, మూర్తుల శ్రీనివాస్, బొజ్జ కొమురయ్య, కన్నయ్య, బొజ్జ ఐలయ్య, ఆరెపల్లి తిరుపతి పాల్గొన్నారు.

**మహబూబాబాద్ :** మేడే సంబురాలు ఎఐటియుసి, సిపిఐ ఆధ్వర్యంలో మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. వేలాది మంది కార్మికులు, సిపిఐ శ్రేణులు ర్యాలీ లో పాల్గొన్నారు. సిపిఐ జిల్లాకార్యాలయం వద్ద కార్మిక జండాను జిల్లా కార్యిదర్శి బి.విజయసారధి ఎగురవేశారు. ఈ సందర్భంగా పెరుగు కుమార్, రేషపల్లి నవీన్ అధ్యక్షతన జరిగిన సభలో విజయసారధి మాట్లాడుతూ మేడే స్ఫూర్తితో కార్మికులు పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బి.అజయ్‌సారథిరెడ్డి, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి , కట్లోజు పాండురంగాచారి, వీరవెల్లి రవి, ఎండి ఫాతిమా, వెలుగు శ్రావణ్, మంద శంకర్,ఆబోతు అశోక్, జలగం ప్రవీణ్, కొండమీది రవి, రాము, వంకాయలపాటి చిరంజీవి, ఎండి మహమూద్, రాము, దస్తగిరి, ఫాతిమా, కిషన్ తోట రాజకుమారి, చీర లక్ష్మి నరసమ్మ, మాలోతు రవీందర్ పాల్గొన్నారు.

**నిర్మల్/అదిలాబాద్ :** మేడే సందర్భంగా సిపిఐ జిల్లా కార్యాలయంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి కార్మిక జండా ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పట్టణ కార్యదర్శి అరుణ్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు కుంట రాములు డిహెచ్‌పిఎల్ జిల్లా అధ్యక్షుడు కమలే రందాస్, బికెఎంయు జిల్లా అధ్యక్షుడు కండెల గణేష్, పెద్ద నరసింహులు, తాజుద్దీన్, దత్తు, ఆశన్న పాల్గొన్నారు.

**నల్లగొండ :** మేడే పోరాట స్ఫూర్తితో కార్మికులు హక్కుల కోసం పోరాటాలుచేయాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మేడే సందర్భంగా నల్లగొండలో పలు సెంటర్లలో ఎఐటియుసి జెండాలు ఎగురవేసి పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. డిఇఒ కార్యాలయం వద్ద జరిగిన జెండా ఆవిష్కరన అనంతరం జరిగిన సభలో దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ అమరవీరుల స్ఫూర్తిని కొనసాగిస్తూ మే 20 సార్వత్రిక సమ్మెకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు కేవిఎస్ రెడ్డి పాణెం వెంకటరావు, కోశాధికారి దోనకొండ వెంకన్న, డివిజన్ కార్యదర్శి విశ్వనాధులు లెనిన్, గుండె రవి, కార్యదర్శి రెవల్లి యాదయ్య, ఎండీ జానీ,, జినరేందర్, నరసింహ, వెంకన్న యాదయ్య, యూసుఫ్, రాజు, వెంకటయ్య మల్లయ్య, జానయ్యా వెంకటయ్య, నందం పాల్గొన్నారు.

**నిజామాబాద్ ప్రతినిధి :** మేడే స్ఫూర్తితో నాలుగు లేబర్ కోడ్లను రద్దుకు పోరాడాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఓమయ్య అన్నారు. నగరంలోని ఎఐటియుసి ఆధ్వర్యంలో ఘనంగా జెండాలను ఆవిష్కరించుకుని ప్రభుత్వ మెడికల్ కళాశాల నుంచి ఎఐటియుసి కార్యాలయం రైల్వేస్టేషన్ వరకు ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సుధాకర్, నాయకలు భూమయ్య, నర్సింగరావు, చక్రపాణి, హన్మాండ్లు, రాధాకుమార్, స్వరూప, స్వప్న, సాయన్న, పరశురాం, దేవేందర్, మోహన్, గంగాధర్, ఇమ్రాన్‌అలీ, ఫిరోజ్, సురేష్ కార్మికులు పాల్గొన్నారు.

**వేములవాడ :** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని గుమ్మి పుల్లయ్య భవనంలో మేడే ను పురస్కరించుకొని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు కార్మిక జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి గాజుల పోశెట్టి, రూరల్ మండలం కార్యదర్శి శ్రీరాముల నర్సయ్య, ఎల్ల దేవరాజు, మున్సిపల్ నాయకులు పందుల మల్లేశం, నర్సయ్య, కె.వి.అనసూయ, పెంట గట్టవ్వ, పెంట భూమవ్వ, వాల్మీకి ఊర్మిల, సైకిల్ పుష్పలత, పెంట రాజవ్వ, పెంట నరేష్, పెంట మల్లేషం పాల్గొన్నారు.

**సంగారెడ్డి :** పోరాడితే పోయేదేమి లేదు, బానిస సంకెళ్లు తప్పా అని ఎఐటియుసి జిల్లా కార్యదర్శి బోయిని ప్రసాద్ అన్నారు. సంగారెడ్డిలోని కొత్త బస్టాండ్ వద్ద ఎఐటియుసి జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు బోయిని ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి నీరుడు సాయిలు, జిల్లా సహాయ కార్యదర్శి శంకరప పాల్గొన్నారు.

**అనంతగిరి :** కార్మికుల హక్కుల రక్షణకు పోరాటాలు చేయాలని ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు మేకల శ్రీనివాసరావు అన్నారు. సూర్యాపేట జిల్లా అనంతగిరి మండల పరిధిలోని బొజ్జగూడెం తండాలో ఎఐటియుసి జెండాను ఆవిష్కరించి కార్మికులకు మేడే శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో హమాలీ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి పోతురాజు సత్యనారాయణ, డ్రైవర్స్ యూనియన్ కార్యదర్శి సైదా, పొలంపల్లి రాఘవులు, ఎస్‌కె బాబు, భూక్య కోటేశ్వరరావు, గుగులోతు శ్రీనివాస్, నాగులు, సుధాకర్, రాంబాబు, సైదా, నాగేశ్వరరావు, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

**సూర్యాపేట :** కార్మికుల హక్కుల రక్షణకు పోరాటాలు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో కామ్రెడ్ ధర్మబిక్షం భవనంలో మేడే కార్మిక దినోత్సవాన్ని దంతాల రాంబాబు అధ్యక్షతన ఏర్పాటు చేసిన పార్టీ జెండాను బెజవాడ వెంకటేశ్వర్లు, ఎఐటియుసి జెండాను చామల అశోక్‌కుమార్ ఎగురవేశారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు అనంతుల మల్లేశ్వరి, పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, బొమ్మగాని శ్రీనివాస్, నిమ్మల ప్రభాకర్, దీకొండ శ్రీనివాస్, పున్నం రమేష్, నరేష్, నాగరాజు, ఏసు, వెంకటేశ్వర్లు, దేశగాని హేమలత, హరి, ఎండి పాషా పాల్గొన్నారు.

**వికారాబాద్ :** మేడే సందర్భంగా ఎఐ టియుసి ఆధ్వర్యంలో తాండూర్ మున్సిపల్ కా ర్యాలయం ఎదుట, పెన్నా సిమెంటు ఫ్యాక్టరీ వద్ద సిపిఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్ కార్మిక జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా కార్యదర్శి రవీందర్, పాండు, గోపాల్‌రెడ్డి, అజయ్ రామ్, రాజేందర్, విజయ్, మొత్తప్ప, కార్మికులు గోపాల్, నర్సింలు అశోక్, వంశికృష్ణ, జంగయ్య, దాస్తప్ప, ఇస్మాయిల్, లక్ష్మణ్, రాజు తాహేర్ తదితరులు పాల్గొన్నారు.

**సంస్థాన్ నారాయణపురం :** మేడే కార్మికుల హక్కుల గుర్తింపునకు చిహ్నమని ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు కె.శ్రీనివాస్ అన్నారు. అమరజీవి పల్లె లక్ష్మారెడ్డి స్మారక స్థూపం వద్ద అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, సహాయ కార్యదర్శి చిలువేరు అంజయ్య, కలకొండ సంజీవ, సుర్వి నరసింహ, ముత్యాల అంజయ్య, తోకల రామ్‌రెడ్డి, దుబ్బాక సంజీవ, పల్లె మల్లారెడ్డి, పందుల యాదగిరి, వీరమల్ల యాదయ్య, మొగుదాల సత్తయ్య, ఎస్‌నరేష్, గడ్డం యాదయ్య, పల్లె సీతారాంరెడ్డి, కొప్పు సుధాకర్ పాల్గొన్నారు.

**జనగామ :** జిల్లా కేంద్రంలో మేడే ఉత్సవాలను ఎఐటియుసి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎఐటియుసి అనుబంధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన ర్యాలీ నిర్వహించారు. మోటె శ్రీశైలం, గుండెల్లి రాజు అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో రాజారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ఆకుల శ్రీనివాస్, చామకూర యాకూబ్, శ్రీశైలం, నగేష్, రాజు, యాకయ్య, ఐలయ్య, వీరస్వామి, సిద్దులు, తిరుమలేష్ పాల్గొన్నారు.

**పెద్దపల్లి :** హక్కులు సాధించుకోవాలంటే పోరాటాలు తప్పనిసరి అని సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం అన్నారు. జిల్లా కేంద్రంలో మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ సెక్రటరీ వైవీ రావు, డిటి రావు, మల్లేష్, రవి, రామ్ చందర్, లెనిన్, కార్మికులు పాల్గొన్నారు.



మహబూబాబాద్



మేడ్చల్ జిల్లా చర్లపల్లి...





జనగాం...



సూర్యాపేట...



పెద్దపల్లి...



వికారాబాద్..





మంచిర్యాల...



యాదాద్రి..



వేములవాడ...



మునగాల...





నల్లగొండ...



నిజామాబాద్...





జగిత్యాల...





నాగర్‌కర్నూల్..



సంగారెడ్డి..



కరీంనగర్..



నిర్మల్...

## భూభారతి చట్టం అమలు

(మొదటి పేజీ తరువాయి)

తెలియజేసిన సమాచారం ప్రకారం రాష్ట్రంలో భూసమస్యలు శాశ్వత పరిష్కారమే లక్ష్యంగా గతనెల 14వ తేదీన అంబేద్కర్ జయంతి సందర్భంగా చారిత్రాత్మకమైన భూభారతి చట్టాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియకు ఏ మాత్రం ఆటంకం కలగకుండా ఉండేలా పైలట్‌గా ఖమ్మం జిల్లా నేలకొండపల్లి, కామారెడ్డి జిల్లా లింగంపేట, నారాయణ్‌పేట్ జిల్లా మద్దూర్, ములుగు జిల్లా వెంకటాపూర్ నాలుగు మండలాల్లో పూర్తి స్థాయిలో అమలు చేస్తున్నారు. ఇదే సమయంలో ఈ చట్టంపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి ప్రతిరోజు ఒక మండలంలో రెండు గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తోంది. ఈ రెండు సదస్సుల్లో కలెక్టర్లు స్వయంగా పాల్గొనాలని ఆదేశించింది. ఇందు కోసం మండల స్థాయిలో తహసీల్దార్,డిప్యూటీ తహశీల్దార్ ఆధ్వర్యంలో ఆరుగురు సభ్యులతో రెండుబృందాలను ఏర్పాటు చేసింది. భూభారతి చట్టం రైతులకు అర్థమయ్యే విధంగా చట్టాన్ని అమలు చేసే అధికారులకు ప్రత్యేకంగా శిక్షణా తరగతులు నిర్వహించింది. భూభారతి చట్టంలో కీలక పాత్ర వహించిన రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఒక సవాల్‌గా తీసుకుని విస్తృత స్థాయిలో జిల్లాల్లో పర్యటించి రోజుకు రెండు, మూడు అవగాహనా సదస్సులలో స్వయంగా పాల్గొన్నారు. ఏప్రిల్ 17వ తేదీ నుంచి 30వ తేదీ వరకు దాదాపు 20 జిల్లాల్లో సుమారు 45 సదస్సులలో పాల్గొన్నారు. నాలుగు పైలట్ మండలాల్లోని 72 రెవెన్యూ గ్రామాల్లో ఏప్రిల్ 17వ తేదీ నుంచి 30వ తేదీవరకు రెవెన్యూ సదస్సులను పూర్తి చేశారు. ఈ సదస్సుల్లో చట్టంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూనే మరోవైపు వివిధ మండలాల్లో భూసమస్యలపై దరఖాస్తులను స్వీకరించారు. ఒక ప్రత్యేక ఫార్మాట్‌లో తయారు చేసిన దరఖాస్తులను రెవెన్యూ సదస్సుకు ముందు రోజే ప్రజలకు అందించారు. వచ్చిన దరఖాస్తులన్నింటిని ఏరోజుకు ఆరోజు కంప్యూటర్‌లో నమోదు చేసి సంబంధిత అధికారులకు పంపించారు. హైదరాబాద్ మినహా 605 మండలాలకుగాను 555 మండలాలలో బుధవారం నాటికి సదస్సులు పూర్తి అయ్యా యి. వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి జూన్ 2వ తేదీ నాటికి ఆ నాలుగు మండలాల్లో భూసమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. మరోవైపు హైదరాబాద్ మినహా మిగిలిన 28జిల్లాల్లో జిల్లాకు ఒకమండలాన్ని పైలట్‌గా తీసుకుని 28 మండలాల్లో పూర్తి స్థాయిలో భూభారతి చట్టాన్ని అమలు చేయాలని నిర్ణయించింది.

**మార్పునకు నాంది : మంత్రి పొంగులేటి**

తెలంగాణ ప్రభుత్వం దార్శనికతతో తీసుకువచ్చిన భూభారతి చట్టం విప్లవాత్మక మార్పునకు నాంది పలకబోతోంది. నూటికి నూరు శాతం ప్రజలే కేంద్ర బిందువుగా ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రైతు సంక్షేమమే లక్ష్యంగా ఈ చట్టం ఉంది. జిల్లాల్లో పర్యటించిన సందర్భంలో తమ భూ సమస్యలు ఈ భూభారతి చట్టంతో పరిష్కారమవుతాయనే నమ్మకం, విశ్వాసాన్ని రైతులు వ్యక్తం చేశారు. పైలట్ నాలుగు మండలాలలో కోర్టు పరిధిలో ఉన్న భూ సమస్యలు మినహా అన్ని సమస్యలను జూన్ 2వ తేదీ నాటికి పరిష్కరిస్తాం. ఆ నాలుగు పైలట్ మండలాల మాదిరిగానే ఈ నెల 5వ తేదీ నుంచి రాష్ట్రంలోని 28 జిల్లాల్లో జిల్లాకు ఒక మండలంలో పూర్తి స్థాయిలో భూ భారతిని అమలు చేస్తున్నాం. చట్టం తీసుకువస్తే సరిపోదు, ఆ చట్టం పూర్తి స్థాయిలో అమలు జరిగినప్పుడే రైతులకు నిజమైన న్యాయం లభిస్తుంది. ఆ దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.









Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM - 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com